
కొండపిలో నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో అభివాదం చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి స్వామి, సత్య, రాఘవరెడ్డి

రెండో రోజు కోలాహలం

జిల్లాలో నామినేషన్ల పర్వం ఊపందుకుంది. రెండో రోజైన శుక్రవారం 15 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. తెలుగుదేశం పార్టీ తరపున ఎక్కువగా పడ్డాయి. యర్రగొండపాలెం, కొండపిలలో పార్టీ అభ్యర్థులు ఎరిక్షన్‌బాబు, స్వామిలు వేలాది మంది జనంతో భారీ ర్యాలీలు నిర్వహించి కోలాహలంగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే సభలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా అటు ఎర్రగొండపాలెం, ఇటు కొండపి జన సంద్రాన్ని తలపించాయి. తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం వెల్లివిరిసింది. అలాగే గిద్దలూరు, దర్శి, ఎస్ఎన్‌పాడు అభ్యర్థులు కూడా సాధారణంగా వేశారు. వారు మరోసారి భారీ కార్యక్రమాలతో నామినేషన్ వేయనున్నారు.


ఎర్రగొండపాలెంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి పెద్దఎత్తున హాజరైన టీడీపీ శ్రేణులు

- పలుచోట్ల టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు
- కొండపి, ఎర్రగొండపాలెంలో భారీ ర్యాలీలు, సభలు
- సంతనూతలపాడు, గిద్దలూరు, దర్శిలలో సాధారణంగా దాఖలు
- మరోసారి భారీ సభలకు ఏర్పాట్లు
- ఏడు అసెంబ్లీ స్థానాలకు 15 సెట్లు
- ఒంగోలు పార్లమెంట్, కనిగిరి అసెంబ్లీ స్థానాలకు నిల్

ఒంగోలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజైన శుక్రవారం జిల్లాలో కోలాహలంగా సాగింది. పలుచోట్ల టీడీపీ కూటమి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కొండపిలో టీడీపీ కూటమి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, డమ్మీ అభ్యర్థిగా ఆయన సతీమణి రాజేశ్వరిలు నామినేషన్ వేశారు. సంతనూతలపాడు టీడీపీ కూటమి అభ్యర్థి బి.ఎన్.విజయ్‌కుమార్ తరఫున ఆయన సోదరుడు బి.అనిల్‌కుమార్ చీమకుర్తిలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేశారు. గిద్దలూరు టీడీపీ కూటమి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి అక్కడి రిటర్నింగ్ అధికారి వద్ద నామినేషన్ దాఖలు చేశారు. ఎర్రగొండపాలెం టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్‌ను ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డితో కలిసి అక్కడి రిటర్నింగ్ అధికారికి అందజేశారు. దర్శిలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తరఫున మాజీ ఎమ్మెల్యే పాపారావు నామినేషన్ దాఖలు చేశారు. సాధారణంగా నామినేషన్లు వేసిన ముగ్గురు అభ్యర్థులు మరోరోజు భారీ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ర్యాలీలు, సభలు

కొండపి, ఎర్రగొండపాలెంలలో టీడీపీ కూటమి అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా పార్టీ శ్రేణులు భారీ ర్యాలీలు, సభలు నిర్వహించాయి. కొండపి అభ్యర్థి డాక్టర్ స్వామి తొలుత వల్లూరమ్మ దేవస్థానంలో పార్టీ యువనేత దామచర్ల సత్య, సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు, ఎంపీ మాగుంట కుమారుడు రాఘవరెడ్డితో కలిసి పూజలు చేశారు. అనంతరం అభిమానులు, పార్టీ కార్యకర్తలతో కలిసి కొండపి చేరుకొని అక్కడికి నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది పార్టీ శ్రేణులుతో కలిసి ప్రదర్శనగా వెళ్లి నామినేషన్ వేశారు. అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించారు. యర్రగొండపాలెంలో ఎరిక్షన్‌బాబు నామినేషన్ కోలాహలంగా సాగింది. నియోజకవర్గంలోని గ్రామగ్రామం నుంచి వేలాదిగా టీడీపీ శ్రేణులు తరలిరాగా ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర, ఇతర ముఖ్యనేతలతో కలిసి ఎరిక్షన్‌బాబు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేశారు. ఆతర్వాత సభ నిర్వహించారు.


కొండపిలో నామినేషన్ దాఖలు చేస్తున్న స్వామి


వైపాలెంలో మాగుంటతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న ఎరిక్షన్‌బాబు

వైసీపీ నుంచి ఇద్దరు

కొండపి వైసీపీ అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్, గిద్దలూరు వైసీపీ అభ్యర్థిగా కుందురు నాగార్జునరెడ్డి తదితరులు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. రెండోరోజు ఒంగోలు పార్లమెంట్‌తోపాటు కనిగిరి అసెంబ్లీ స్థానానికి ఎవరూ నామినేషన్ వేయలేదు. మిగిలిన ఏడు అసెంబ్లీ స్థానాలకు 15మంది 15 సెట్లు దాఖలు చేశారు. అందులో ఒంగోలులో మూడు, గిద్దలూరులో నలుగురు అభ్యర్థులు ఐదు సెట్లు, వైపాలెంలో ఒక అభ్యర్థి రెండు సెట్లు, సంతనూతలపాడు, దర్శి, మార్కాపురంలో ఒక్కొక్కటి, కొండపిలో మూడు ఉన్నాయి.

లోగ్రేడ్ మార్కెట్ ఒడిదొడుకులు

- కొనుగోలుకు కొన్ని కంపెనీల నిరాసక్తత
- పెరుగుతున్న నోబిడ్‌లు
- పొగాకు రైతుల్లో ఆందోళన
- తాజా పరిస్థితిపై బోర్డు ఆర్ఎం సమీక్ష
- కిలో రూ.256 పలికిన మేలురకం గరిష్ఠ ధర

ఒంగోలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్ ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. ప్రత్యేకించి లోగ్రేడ్ రకం కొనుగోళ్లు మందగించాయి. వారం క్రితం వరకూ పోటాపోటీగా కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం నిరాసక్తత కనబరుస్తున్నారు. శుక్రవారం పలు వేలం కేంద్రాల్లో 25నుంచి 35శాతం వరకు లోగ్రేడ్ బేళ్లు నోడ్ బిడ్ (తిరస్కరణ) అయ్యాయి. దీనిపై రైతుల్లో తీవ్ర ఆందోళనవ్యక్తమవడంతో సాయంత్రం వేలం కేంద్రం అధికారులు, రైతు కమిటీల ప్రతినిధులతో ఆర్ఎం లక్ష్మణరావు ఒంగోలులోని తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ఈఏడాది పొగాకు కొనుగోళ్ల ప్రారంభం నుంచి లోగ్రేడ్‌కు మంచి ధరలే లభించాయి. అందులో కాస్త నాణ్యత బాగున్న బేళ్లను దాదాపు మేలు రకం ధరతో సమానంగా వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక పొగాకు ఎలా ఉన్నా కిలో రూ.200కు తగ్గకుండా లోగ్రేడ్‌ను కొన్నవారు పది రోజుల క్రితం గరిష్ఠంగా రూ.233 వరకూ ఇచ్చారు.



వారం నుంచి ధరలు తగ్గుముఖం

లోగ్రేడ్ ధరలను వ్యాపారులు వారం రోజులుగా తగ్గిస్తూ వస్తున్నారు. అదే సమయంలో నోబిడ్‌లు పెరుగుతున్నాయి. తొలుత కర్ణాటక పొగాకులో కలుపుకొనేందుకు ఇక్కడ లోగ్రేడ్‌ను హాట్‌హాట్‌గా కొన్న వ్యాపారులు ప్రస్తుతం ఆ అవసరం తగ్గడంతో వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. రెండు, మూడు ఎక్స్‌పోర్టు కంపెనీల బయ్యర్లు శుక్రవారం మార్కెట్లో కొనుగోళ్లకు నిరాసక్తత చూపారు. దీంతో ప్రధానంగా పచ్చ, ఎర్రనేలల్లో పండే మాడు రకం బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఆయా వేలం కేంద్రాల్లోని రైతులు ఆందోళన, అసంతృప్తి వ్యక్తం చేయడంతో బోర్డు అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్ఎం లక్ష్మణరావు వెంటనే స్పందించి సాయంత్రానికి అధికారులు, రైతు ప్రతినిధులతో ఒంగోలులోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బోర్డు సభ్యులు బ్రహ్మయ్య, పొద ప్రసాదరావులతోపాటు వేలం కేంద్రాల అధికారులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న రకం బేళ్లను వేలంకు తీసుకురావాలని, ప్రస్తుతం ఉన్న ధరలు తగ్గకుండా చూస్తామని అధికారులు ఈ సమావేశంలో రైతులకు సూచించారు. సోమవారం నాటికి పరిస్థితిలో మార్పు ఉండాలని రైతులు డిమాండ్ చేసినట్లు సమాచారం.

పెరుగుతున్న మేలు రకం పొగాకు ధరలు

మార్కెట్‌లో మేలు రకం పొగాకు ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. దాదాపు నెలరోజులపాటు కిలో రూ.238పై నిలకడగా సాగిన మేలు రకం గరిష్ఠ ధర వారం క్రితం రూ.249 పలికింది. రెండు రోజుల నుంచి మళ్లీ కొద్దికొద్దిగా పెరుగుతోంది. శుక్రవారం ఒంగోలు-2లో గరిష్ఠ ధర కిలోకు రూ.256 లభించింది. ఇతర చోట్ల కూడా గరిష్ఠ ధర కిలో రూ.254 వరకు ఉన్నట్లు సమాచారం.

ఎండ మండుతోంది!

- పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు
- పామూరులో 44.2 డిగ్రీలు నమోదు
- అత్యధిక ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన వైనం
- విలవిల్లాడుతున్న ప్రజలు

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 19 : వేసవి ఠారెత్తిస్తోంది. ఎండలు మండిపోతున్నాయి. భానుడు భగభగలకు జనం బెంబేలెత్తిపోతున్నారు. మూడు రోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. మధ్యాహ్నానికి మంటపుట్టిస్తున్నాడు. దీనికితోడు ఉక్కపోత అధికంగా ఉంటుండటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. శుక్రవారం కూడా జిల్లాపై సూర్యప్రతాపం



కొనసాగింది. అత్యధికంగా పామూరులో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పొన్నలూరులో 44.1, మార్కాపురంలో 44.1, కనిగిరిలో 43.8, దొనకొండలో 43.8 ముండ్లమూరులో 43.4, హనుమంతునిపాడులో 43.4, పెద్దారవీడులో 43.3, కొమరోలులో 43.2 డిగ్రీల ఎండ కాచింది. పొదిలిలో 43.0, చీమకుర్తిలో 43.0, కంభంలో 43.2, దర్శిలో 43.1, కురిచేడులో 42.7, కొత్తపట్నంలో 42.5, కొనకనమిట్లలో 42.8డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో 15 మండలాల్లో 40నుంచి 44 డిగ్రీల వరకూ ఎండ కాచింది. అది ఒంగోలులో 39.1 డిగ్రీలుగా ఉంది.

ఇంటి దొంగలే స్కెచ్ వేశారు!

సీఎంఎస్ వాహనంలో రూ.66లక్షలు చోరీ
కేసును 20 గంటల్లో ఛేదించిన పోలీసులు

- ముగ్గురు అరెస్టు.. మొత్తం డబ్బు స్వాధీనం
- నిందితుల్లో ఒకరు సంస్థ మాజీ డ్రైవర్, మరో ఇద్దరు అక్కడి ఉద్యోగులు
- వివరాలను వెల్లడించిన ఎస్పీ సుమిత్

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 19 : నగరంలో పట్టపగలు సీఎంఎస్ (క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్) వాహనంలో రూ.66లక్షల చోరీ కేసును 20 గంటల్లోనే పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఒకరు సీఎంఎస్‌లో పనిచేస్తూ మూడు రోజుల క్రితం రాజీనామా చేసిన డ్రైవర్ కాగా, మరో ఇద్దరు అందులో పనిచేసే ఉద్యోగులు. వివరాలను ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ శుక్రవారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. సీఎంఎస్ సంస్థ సిబ్బంది గురువారం ఒంగోలులోని పలు బ్యాంకుల నుంచి రూ.68 లక్షలు తీసుకొని వాటికి సంబంధించిన ఏటీఎంలలో పెట్టేందుకు వాహనంలో బయల్దేరారు. కర్నూలు రోడ్డులోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం వద్ద గదిలో సిబ్బంది భోజనం చేసేందుకు వాహనం నిలిపారు. భోజనం అనంతరం వారు వచ్చి చూడగా వాహనం డోర్లు తెరిచినట్లు అనుమానం వచ్చింది. లోపలికి వెళ్లి చూడగా నగదు ఉన్న బాక్స్‌కు తాళం వేసి ఉంది. కానీ అందులో ఉన్న రూ.66లక్షలు మాత్రం మాయమైంది. మిగిలిన రెండు లక్షలు ఉంది. ఈమేరకు సీఎంఎస్ మేనేజర్ గుజ్జుల వెంకట కొండారెడ్డి ఫిర్యాదు చేయడంతో తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రధాన నిందితుడి గుర్తింపు

సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసును ఛేదించారు. సిబ్బంది భోజనం కోసం సీఎంఎస్ వాహనం నిలిపిన ప్రాంతం పక్కన గోడ దూకి ఓ వ్యక్తి రావడం సీసీ కెమెరాలో దొరికింది. దీంతో అతను ఎవరు అని ఆరా తీశారు. అతను అదే సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తూ మూడు రోజుల క్రితం రాజీనామా చేసిన మహేష్ అని తేలింది. వెంటనే అతని కోసం గాలింపు చేపట్టారు. పేర్నమిట్ట సమీపంలోని ఎన్ఎస్పీ కాలువ వద్ద ఆయన్ను అరెస్టు చేసి రూ.66లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

మాజీ డ్రైవర్‌కు మరో ఇద్దరు సహకారం

నగదు చోరీకి సీఎంఎస్ సంస్థలో పనిచేసే కొంత మంది కలిసి ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రకారం ప్రధాన నిందితుడైన సంతనూతలపాడు మండలం కామేపల్లివారిపాలెంనకు చెందిన సన్నమూరి మహేష్‌బాబు మూడు రోజుల క్రితమే సంస్థలో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. వాహనంలో నగదు ఉంచే పెట్టెకు మారు తాళం తయారు చేసేందుకు అక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న నగరంలోని శివప్రసాద్ కాలనీకి చెందిన గుజ్జుల వెంకట కొండారెడ్డి, కామేపల్లివారిపాలెంనకు చెందిన కస్టోడియన్ రాచర్ల రాజశేఖర్ సహకరించారు. దీంతో ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు. వాహనంలో ఉన్న సిబ్బందికి కూడా ఏదైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. నగదు రవాణాకు సంబంధించిన లోపాలపై హోం సెక్రటరీకి నివేదిక పంపనున్నట్లు ఎస్పీ చెప్పారు.


స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్

పోలీసులను అభినందించిన ఎస్పీ

చోరీ కేసును 20 గంటల్లో ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎస్.వి.శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి, సీసీఎస్ సీఐ టి.విజయకృష్ణ, సైబర్ సెల్ సీఐ సూర్యనారాయణ, ఎస్సైలు షన్నారావు, విజయ్‌కుమార్, మహేష్, ఏఎస్సైలు టి.బాలాంజనేయులు, నాగేశ్వరరావు, సురేష్‌బాబు, రమేష్‌బాబు, హెడ్‌కానిస్టేబుళ్లు రామకృష్ణ, రాంబాబు, ఖాజావలి, కానిస్టేబుళ్లు రవికుమార్, నాగేశ్వరరావు, హనోక్, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, రత్తయ్య, హోంగార్డులు శేషగిరిలకు రివార్డులను అందజేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఆర్పీలపై వేటు!

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 19 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఇద్దరు ఆర్పీలపై వేటు పడింది. వారి లాగిన్‌లను మెప్మా అధికారులు నిలిపివేశారు. ఒంగోలులో కొందరు ఆర్పీలు వైసీపీ ప్రచారంలో పాల్గొనడంపై 'కొందరికే కోడ్' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 17న కథనం ప్రచురితమైంది. దీనిపై ఎన్నికల అధికారులు స్పందించినట్లు సమాచారం. వారి ఆదేశాలతో మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఆర్పీలు సంధ్యారాణి, సుజాతల లాగిన్‌లను నిలిపివేసినట్లు సమాచారం. అలా చేయడమంటే వారిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లే. త్వరలోనే అందుకు సంబంధించి మెప్మా ఎండీ నుంచి అధికారిక ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.


దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరిన శ్రీరంగనాథ్, వాసు తదితరులు

టీడీపీతోనే బ్రాహ్మణుల సంక్షేమం

- కూటమి ఒంగోలు అభ్యర్థి జనార్దన్
- బ్రాహ్మణ సేవా సమితి నాయకులు తెలుగుదేశంలో చేరిక

వివరాలు లోపలి పేజీల్లో..

కనిగిరి అంటే నాకు ప్రాణం

- అందుకే ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడ్డా
- ప్రజాసేవ కొనసాగించా.. జనంతో నడిచా
- నేను చేసిన పనులకు రుజువులు ఉన్నాయి
- చేయబోయే పనులకు ప్రణాళిక ఉంది
- టీడీపీ కూటమి కనిగిరి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

'కనిగిరి నియోజకవర్గం అంటే నాకు ప్రాణం. వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధిలో నావంతు పాత్ర పోషించాలని చిన్నతనంలోనే నిర్ణయించుకున్నా. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నియోజకవర్గంలో ప్రజాసేవ కొనసాగిస్తూ నిత్యం ప్రజలతో కలిసి నడిచా. గతంలో అవకాశం వచ్చినప్పుడు నేను చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలుసు. భవిష్యత్తులో చేయబోయే పనులపై నిర్దిష్టమైన ప్రణాళిక నాకు ఉంది' అని టీడీపీ కూటమి కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను వివరించారు. నియోజకవర్గ వెనుకబాటుతనం, ప్రజల వలసలు తనకు చిన్నతనం నుంచి బాధలు కల్గిస్తున్నాయని చెప్పారు. అందుకే రాజకీయాల్లోకి వచ్చి సేవ చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. పదవి, అధికారం లేకపోయినా నిరంతరం కార్యక్రమాలు నిర్వహించానన్నారు. ప్రధానంగా వైద్యసేవ ద్వారా వేలాది మంది పేదలకు సాయపడగలిగాననే తృప్తి తనకు మిగిలిందని ఉగ్ర భావోద్వేగంతో చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులకు రుజువులు ఉన్నాయని స్పష్టం చేశారు. పొగాకు వేలంకేంద్రం, కలగా మిగిలిపోయిన అలవలపాడు బ్రిడ్జి నిర్మాణాలు అందులో భాగమేనన్నారు. కనిగిరి, పీసీపల్లి, పామూరు, సీఎస్‌పురం మండలాలకు రామతీర్థం నుంచి మంచినీటి సరఫరాకు రూ.190కోట్లతో ప్రాజెక్టు మంజూరు చేయించానని గుర్తుచేశారు. గొర్రెల పెంపకందారుల కోసం షిప్‌యార్డు నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల కోసం ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ఆరు మండలాల్లో కస్తూర్బా స్కూళ్లు, పేదలకు 10,046 గృహాల నిర్మాణాలు జరిగాయన్నారు. ఉపాధి కల్పన కోసం రూ.46వేల కోట్ల వ్యయంతో పరిశ్రమల కారిడార్ (నిమ్జ్), రోడ్ల అభివృద్ధి కోసం సుమారు రూ.654 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టానన్నారు. పదవిలో ఉంటే తాను అభివృద్ధి ఎలా సాధించగలనో చెప్పేందుకు ఇవి ఉదాహరణలేనన్నారు. భవిష్యత్తులో అభివృద్ధి ప్రణాళికను వివరిస్తూ వెలిగొండ పూర్తికి కష్టపడటమే కాక ఆ ప్రాజెక్టులో పీసీపల్లి మండలాన్ని చేర్చే లక్ష్యం తన ముందు ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన ట్రిపుల్ ఐటీని నియోజకవర్గంలో నిర్మించి పక్కకు పోకుండా చూస్తానన్నారు. నిమ్జ్‌ను సాధిస్తా, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేమార్గాన్ని పూర్తిచేయిస్తా, కనిగిరిలో ఎస్ఎస్ ట్యాంక్ ఏర్పాటు చేయటమే తన లక్ష్యమని చెప్పారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణం, నిరుపయోగంగా ఉన్న గొర్రెల మండీ ఆధునికీకరణ లాంటి అనేక అభివృద్ధి పనులు తన భవిష్యత్తు ప్రణాళికలో ఉన్నాయని తెలిపారు. వలసలను రూపుమాపేందుకు కష్టపడతానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న అరాచకాలు, భూదందాలు, రాజకీయ వేధింపులకు తావులేని పాలన అందిస్తానన్నారు.



ఒంగోలులో వైసీపీకి వరుస షాక్‌లు..!

- సైకిలెక్కుతున్న అధికార పార్టీ శ్రేణులు
- టీడీపీలో చేరికలే విజయానికి సంకేతం
- కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల వెల్లడి



కాపు కల్యాణమండపంలో జరిగిన చేరికల్లో మాట్లాడుతున్న దామచర్ల



22వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జనార్దన్, రాఘవరెడ్డి, రియాజ్

ఒంగోలు(కార్పొరేషన్), ఏప్రిల్ 19: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు నగరంలో పలువురు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఆ పార్టీకి మరింత బలం చేకూరుతోంది. ఈ సందర్భంగా స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాపు నాయకుడు కోలా ప్రభాకర్‌తోపాటు మరో 150 మంది కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరగా, వారికి దామచర్ల పార్టీ కండువాల కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం అభివృద్ధిని కాంక్షిస్తున్నారని, అందుకే అధికార వైసీపీ వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు మెచ్చిన పాలన టీడీపీతోనే సాధ్యమన్నారు. ఐదేళ్ళ సైకో పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడ్డారని విమర్శించారు. వైసీపీ నుంచి వస్తున్నవారితో వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయ సంకేతాలు కల్పిస్తున్నాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీ వచ్చేలా కోసం కృషి చేయాలని కోరారు. కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట కుమారుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వార్గల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందన్నారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో టీడీపీ కూటమి నుంచి ఎంపీ అభ్యర్థిగా తన తండ్రి మాగుంట శ్రీనివాసులురెడ్డి, అలాగే ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే దామచర్ల నివాసంలో 35వ డివిజన్ అధ్యక్షులు గంజం రంగనాథ్, బ్రాహ్మణ సేవాసమితి కార్యదర్శి ముక్తినూతలపాటి వాసు టీడీపీలో చేరారు. అలాగే 43వ డివిజన్ శ్రీరామ్‌కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో దామచర్ల పాల్గొని టీడీపీ గెలుపు కోసం బూత్ స్థాయి నుంచి పాటుపడాలని కోరారు.

22వ డివిజన్‌లో దామచర్ల ఇంటింటి ప్రచారం

తెలుగుదేశం పార్టీ గెలుపు కోరుతూ టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ స్థానిక 22వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలు వివరించారు. ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను ఎమ్మెల్యేగా శక్తివంచన లేకుండా కృషి చేశానని తెలిపారు. అలాగే నగరంలోని రహదారులు, డ్రైన్‌లు, బ్రిడ్జిలు, హైమాక్స్ లైట్‌లు ఇతర అభివృద్ధి పనుల కోసం రూ. 2600 కోట్లు ఖర్చు చేసినట్లు దామచర్ల తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. కనీసం వేసవిలో తాగునీటి సమస్యపైనా దృష్టి సారించనందునే నగరంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు వేసవిలో నీటి ఎద్దడి దృష్టిలో ఉంచుకుని బావుల్లో పూడిక తీత పనులు చేపట్టి, వినియోగంలోకి తీసుకురాగా, ట్యాంకర్ల ద్వారా నీటి ఇబ్బందులు లేకుండా చూసినట్లు తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అందరి భవిష్యత్‌కు గ్యారెంటీ ఉంటుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి మాగుంట కుమారుడు రాఘవరెడ్డి, డివిజన్ అధ్యక్షులు సుబ్బు, ప్రధానకార్యదర్శి తాండ్ర హరి, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, మంత్రి శ్రీనివాసరావు, బండారు మదన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు దామచర్లకు ఘనంగా స్వాగతం పలికారు.

టీడీపీతోనే బ్రాహ్మణుల సంక్షేమం

- తెలుగుదేశం కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 19: తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని టీడీపీ కూటమి ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులో బ్రాహ్మణ సేవాసమితి కార్యదర్శి గంజాం శ్రీరంగనాథ్, కార్యవర్గ సభ్యుడు ముక్తినూతలపాటి వాసులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని, తిరిగి రాబోయే ఎన్నికల తర్వాత చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పూర్వవైభవం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ నాయకులు మాట్లాడుతూ దామచర్ల గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు టీవీ.శ్రీరామమూర్తి, వ్యాముజాల ప్రసన్నకుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ తరపున నామినేషన్ దాఖలు



బీఎన్ తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న అనిల్

చీమకుర్తి, ఏప్రిల్ 19: సాధారణ ఎన్నికల్లో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో రెండవరోజైన శుక్రవారం ఒక నామినేషన్ దాఖలు అయింది. టీడీపీ కూటమి అభ్యర్థిగా బొమ్మాజీ నిరంజన్ విజయ్‌కుమార్ తరపున ఆయన సోదరుడు అనిల్‌కుమార్ తరపున ఒకసెట్ నామినేషన్‌ను ఆర్వో గోపాలకృష్ణకు అందజేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, మండవ విజయ్‌కుమార్, బొడ్డు రామలింగయ్య పాల్గొన్నారు. దీంతో నియోజకవర్గ పరిధిలో రెండురోజులకు రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు అయ్యాయి.

తెలుగుమహిళల ఇంటింటి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

చీమకుర్తి, ఏప్రిల్ 19: చీమకుర్తి పట్టణంలో తెలుగుమహిళలు శుక్రవారం ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి అభ్యర్థిని బీఎన్.విజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, ముప్పూరి చలమయ్య, మోమిన్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు వలంటీర్లు రాజీనామా

సంతనూతలపాడు, ఏప్రిల్ 19: మైనంపాడు సచివాలయం పరిధిలో పనిచేస్తున్న నలుగురు వలంటీర్లు ప్రశాంతి, దుర్గ, గంగయ్య, కవిత వ్యక్తిగత కారణాలతో శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సచివాలయం కార్యదర్శి దారా వెంకట్రావుకు అందజేశారు. అనంతరం వారి రాజీనామా పత్రాలను ఎంపీడీవో శ్రీహరికి అందించారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

సంతనూతలపాడు, ఏప్రిల్ 19: సంతనూతలపాడులో వైసీపీ కార్యాలయాన్ని శుక్రవారం మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా వైసీపీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ డి.చెంచిరెడ్డి, యలమందారెడ్డి, శేఖరరెడ్డి రమణమ్మ, బి.విజయ తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' సొమ్ములేవీ..?

లబ్ధిదారుల ఎదురుచూపు ● నమూనా చెక్కులతోనే సరి

మద్దిపాడు, ఏప్రిల్ 19: నాలుగవ విడత చేయూత పథకం కింద రావాల్సిన సొమ్ముల కోసం లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. వాస్తవానికి సీఎం జగన్ బటన్ నొక్కి నెలరోజులు దాటినా చాలా మంది మహిళలకు నేటికీ బ్యాంక్ ఖాతాలో నగదు జమ కాలేదు. మద్దిపాడు మండలంలో డ్వాక్రా గ్రూప్ సభ్యులకు అని గ్రామాల్లో కొంతమంది మహిళలకు సొమ్ము జమ కాలేదు. చేయూత సొమ్ములు పడితే కుటుంబ అవసరాలకు ఉపయోగపడతాయని, భావించామని నేటికీ జమకాలేదని మహిళలు వాపోతున్నారు. నిబంధనల సాకుతో తగ్గింపు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం సామాజిక వర్గాల్లో మహిళలకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం చేయూత పథకాన్ని ప్రారంభించింది. 45 నుంచి 60 సంవత్సరాల మధ్య మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లపాటు ఒక్కొక్కరికీ రూ.75వేలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఒక విడత లబ్ధి పొందిన కొందరికి మరో విడతలో అందని పరిస్థితి నెలకొంది. మండలంలో మూడో విడత కంటే నాలుగవ విడత వచ్చే సరికి 612 మందిని తగ్గించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు బహిరంగ సభలు నిర్వహించి నమూనా చెక్కును అందించి ఆర్భాటం చేశారు. ఇప్పటికీ చాలామంది ఖాతాలో డబ్బులు పడకపోవటంతో పలువురు మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం నిధులు విడుదల అయ్యాయని, దశలవారీగా అందరికీ జమ అవుతాయని చెబుతున్నారు.

చంద్రబాబుతోనే మహిళల అభ్యున్నతి

టీడీపీ కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ ● మద్దిపాడులో ఘన స్వాగతం పలికిన ప్రజలు ● తెలుగుదేశంలో కొనసాగుతున్న చేరికలు



మద్దిపాడు రామాలయం వద్ద మహిళలతో కలిసి అభివాదం చేస్తున్న బీఎన్



బీఎన్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

మద్దిపాడు, ఏప్రిల్ 19 : మహిళల అభ్యున్నతి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మద్దిపాడులోని పురగిరి క్షత్రియులు కాలనీ (పెరికకాలనీ)ప్రాంతంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాలనీలో మురుగు కాలువలు ఆధునికీకరణ చేస్తామని, గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేపట్టి సాగు, తాగు నీరుకి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కాగా బీఎన్‌కు గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. బీసీకాలనీలో మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, శుద్ధపల్లి అనిల్, సుబ్బారావుల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికారు.

వెల్లంపల్లి సర్పంచ్ చిట్టిబోయిన అనిల్ తన అనుచరులతో విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో అన్నంగి గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు బోడపాటి కోటేశ్వరరావు, అన్నాబత్తిని వెంకటేశ్వర్లు, నల్లమోతు అంజనేయులు, కోలా జీవరత్నం, తుపాకుల వెంకట్రావు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు అడకా స్వాములు, మండవ గోపీనాథ్, చింతల శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సున్నా బాలసుబ్రహ్మణ్యం, కడియాల రఘుబాబు, నరసింహారావు, బీజేపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి వెంకటరమణ, మద్ద ఆంజనేయులు, ఎర్రగాళ్ల చైతన్య, వేల్పుల నాగరాజు, నూనె వెంకటేశ్వర్లు, నూనె శ్రీనివాసులు, మద్ద సంజీవరావు, అద్దేపల్లి దుర్గాభవాని, దాట్ల వేణుగోపాల్ రాజు, నారిపెద్ది అనిల్, అన్నాబత్తిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చేరికలతో నూతనోత్సాహం

నాగులుప్పలపాడు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారు. తాజాగా తిమ్మసముద్రం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ముద్దన వీరయ్య చౌదరి, ముద్దన రవికుమార్, లంబు శ్రీనివాసరావులతో పాటు మరో 100 కుటుంబాలు శుక్రవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ బీఎన్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మాజి అనీల్, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, మంగమూరి మధు, చింటూ, తేళ్ళ శేష బాబు, అదుర్ల శ్రీను, జనసేన నాయకులు పాల్గొన్నారు.



బీఎన్ సమక్షంలో పార్టీలో చేరిన మంగమూరువాసులు



పార్టీలో చేరిన తిమ్మసముద్రం నాయకులతో విజయ్‌కుమార్

మంగమూరు గ్రామం నుంచి..

సంతనూతలపాడు: ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో మంగమూరు నుంచి టీడీపీ గ్రామ అధ్యక్షుడు అబ్బూరి శ్రీనివాసరావు, నారాయణరావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు శనివారం విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ బీఎన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలో చూసిన వైసీపీ వ్యతిరేకులు టీడీపీలోకి వలసలు వస్తున్నారని, దీనిని బట్టి చూస్తే ఆ పార్టీపై ప్రజల్లో ఎంత అసహనం ఉందో అర్థమవుతోందన్నారు. ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో కొండసింగ్‌రాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కారణాలతోనే చెక్‌పవర్ రద్దు !

ముప్పాళ్ల సర్పంచ్ ఆగ్రహం

డీపీవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



డీపీవో జారీ చేసిన నోటీసును చూపిస్తున్న సర్పంచ్ పద్మశ్రీ (ఫైల్)

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 19: నాగులుప్పలపాడు మండలం ఎం.ముప్పాళ్ల గ్రామ సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ చెక్‌పవర్‌ను ఎంపీడీవోకు బదిలీ చేయడంపై రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. నయానో భయానో వీరి ఓట్లు పొందేందుకు మంత్రి మేరుగ నాగార్జున అధికారుల మీద ఒత్తిడి తెచ్చి మరీ సర్పంచ్ చెక్‌పవర్‌ను ఎంపీడీవోకు బదిలీ చేయించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలి నుంచి టీడీపీకి ఎం.ముప్పాళ్ల గ్రామంలో మంచి పట్టు ఉంది. ప్రస్తుత సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ, ఆమె భర్త వీరాంజనేయులు కూడా తొలి నుంచి టీడీపీ సానుభూతిపరులుగా ఉన్నారు. రాజకీయపార్టీలతో సంబంధం లేకుండా గ్రామంలో వర్గాల నేపథ్యంలో అనేక ఇబ్బందులు, వర్గ పోరు ఎదుర్కొని పంచాయతీ ఎన్నికల్లో పద్మశ్రీ విజయం సాధించారు. అయితే గ్రామాభివృద్ధి కోసం ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబుకు సర్పంచ్, వారి వర్గీయులు సన్నిహితంగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో టీజేఆర్‌కు టిక్కెట్ దక్కలేదు. నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా వచ్చిన మంత్రి నాగార్జున సైతం సర్పంచ్ పద్మశ్రీ, వీరాంజనేయులు ఆయన వర్గీయులను పక్కన పెట్టి గ్రామంలో వ్యతిరేక వర్గాన్ని ప్రోత్సహిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు రాజకీయ వర్గాలలో చర్చ మొదలైంది. అందులో భాగంగానే మంత్రి చెక్ పవర్‌ను రద్దు చేయించేందుకు ఓ పక్క ఎన్నికల కోడ్ అమలులో ఉండగా జిల్లా స్థాయి అధికారిపై రాజకీయ ఒత్తిళ్ళు తీసుకొచ్చి మహిళా సర్పంచ్‌ను ఇబ్బందులకు గురిచేయడాన్ని సర్పంచ్‌ల సంఘం నాయకులు సైతం ఖండిస్తున్నారు. ఏకంగా డీపీవో ద్వారా మంత్రి నాగార్జున కక్షపూరితంగా నోటీసులు జారీ చేయించారని ప్రజల్లోనూ చర్చ జోరుగా సాగుతోంది. అధికార పార్టీలో తగిన న్యాయం జరగకపోవటం, మంత్రి చర్యల పట్ల విసిగి వేసారి సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తున్నది. ఈక్రమంలోనే సర్పంచ్ దంపతులు పద్మశ్రీ, వీరాంజనేయులు తమ వర్గీయులతో కలిసి సొంత గూటికి చేరే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. వీరి చేరిక దాదాపు ఖాయమైంది. వీరు పార్టీ మారకుండా బెదిరించే క్రమంలోనే సర్పంచ్ చెక్‌పవర్‌ను ఎంపీడీవోకు బదిలీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా అవినీతి అక్రమాలు చోటుచేసుకోకుండా రాజకీయ కక్ష సాధింపుతోనే చెక్‌పవర్ బదిలీ చేశారని సర్పంచ్ ఆరోపిస్తున్నారు.

సంజాయిషీ తీసుకోకుండా..

ఉపాధి హామీ పథకం కింద వేసిన రోడ్లకు బిల్లులు చెల్లించలేదని ఈ చెక్‌పవర్ బదిలీకి అధికారులు ప్రధాన కారణంగా చూపారు. సాధారణంగా ఏ బిల్లు అయినా చేయాలంటే పంచాయతీ తీర్మానం, పనులు జరిగిన అనంతరం ఎం-బుక్ నమోదు, పనుల నాణ్యత పరిశీలించి నిధులు మంజూరు చేస్తారు. అయితే ఇక్కడ పనులే సక్రమంగా జరగలేదని, ఇక ఎం-బుక్ ఊసే లేదని, వాటికి తాము ఎలా బిల్లులు చెల్లిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. దీనిపై తమకు ఈ నెల 16న సంజాయిషీ నోటీసు రాగా, తమ వివరణ కూడా తీసుకోకుండా ఈ నెల 17న తన చెక్‌పవర్ బదిలీ చేశారన్నారు. ఎన్నికల వేళ రాజకీయ ఒత్తిళ్లకు పాల్పడుతున్న డీపీవోపై ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక అంశంపై తాము న్యాయ పోరాటం చేయనున్నామన్నారు. తామ రాజకీయ ప్రస్థానాన్ని ఎవరి బెదిరింపులు ప్రభావితం చేయవని స్పష్టం చేశారు.

దళారుల మాటలు నమ్మొద్దు !

- ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రైవేటు ఆస్పత్రుల దరఖాస్తులకే అనుమతులు
- డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 19: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతి కోసం వైద్యశాఖలో పనిచేసే ఇరువురు కాంట్రాక్టు ఉద్యోగులు ఆస్పత్రుల నిర్వాహకుల వద్దకు వెళ్ళి సంప్రదింపులు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారి మాటలు నమ్మవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేటు వైద్యశాలలకు ప్రభుత్వ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలించి అనుమతులు ఇస్తామన్నారు. నిబంధనలను అనుసరించి కచ్చితంగా రిజిస్ట్రేషన్స్, రెన్యువల్స్ చేయించుకోవాలని సూచించారు. ఆయా పనులను స్వయంగా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో వారికి ఉన్న ప్రత్యేకమైన ఐడీ, పాస్‌వర్డ్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యాధికారులు దరఖాస్తుదారుల అనుపత్రులను స్వయంగా పరిశీలించి అన్ని సర్టిఫికెట్‌లను ధ్రువీకరించిన తరువాత అనుమతి మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం తప్ప ఎలాంటి అదనపు డబ్బులు ఎవరికి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తమ కార్యాలయంలో పనిచేసే ఇరువురు కాంట్రాక్టు ఉద్యోగులు కొంత మంది ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకుల వద్దకు వెళ్ళి వైద్యశాఖకార్యాలయం నుంచి సంజాయిషీ నోటీసులు వస్తున్నాయని, అందువల్ల ఆస్పత్రి డాక్యుమెంట్లు అన్ని తమకు ఇస్తే మీకు సంజాయిషీ నోటీసులు రాకుండా తామే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి తక్కువ ఖర్చుతో రిజిస్ట్రేషన్స్ లేదా రెన్యువల్ చేయిస్తామని సంప్రదింపులు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని రాజ్యలక్ష్మి తెలిపారు. ఇటువంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటూ నిబంధనల ప్రకారం పారదర్శకంగా రెన్యువల్ చేస్తామని, ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

అవీ..ఇవీ..

ఘనంగా జిల్లాస్థాయి ప్రేరణ ఉత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 19: ఒంగోలులోని పీఎంశ్రీ జవహర్‌నవోదయ విద్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఈవో సుభద్ర ప్రారంభించారు. ప్రాథమిక స్థాయి ప్రేరణ పోటీల్లో విజేతలుగా నిలిచిన 76 మంది విద్యార్థులకు జిల్లా ఉత్సవాలకు హాజరుకాగా వారిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను పాఠశాల స్థాయిలోనే పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర ఏఎంవో ఎం.రమేష్, ఏపీవో మాధవిలత, సిబ్బంది పాల్గొన్నారు.

25న గురుకుల ప్రవేశ పరీక్ష

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 19: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఈ నెల 25న పరీక్ష జరుగుతుందని అమ్మనబ్రోలు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజప్రియదర్శిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,6,7, 8 తరగతుల వారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు అలాగే ఇంటర్, డిగ్రీ ప్రవేశాల కోసం మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఒంగోలులో కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షా కేంద్రాలకు గంట ముందు చేరుకోవాలని ఆమె కోరారు.

రేపు టింబర్, సామిల్ అసోసియేషన్ జిల్లా సమావేశం



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 19: జిల్లాలోని టింబర్, సామిల్ అసోసియేషన్ సమావేశం ఆదివారం ఒంగోలులో జరుగుతుందని అసోసియేషన్ నగర అధ్యక్షుడు మొగిలిపువ్వు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఉడ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక దక్షిణబైపాస్‌లోని సింధూర హోటల్ రెసిడెన్సీలో ఈ సమావేశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం, ఇతర అంశాలపై చర్చించటం జరుగుతుందన్నారు. స్టేట్ ఫెడరేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ ఇతర సభ్యులు హాజరవుతారని, జిల్లాలోని టింబర్, సామిల్ యజమానులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో సెక్రటరీలు ఐ.నాగేశ్వరరావు, బత్తుల రమేష్, కోశాధికారి ఎం.సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ఒంగోలు అసెంబ్లీకి మూడు నామినేషన్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 19 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి రెండో రోజైన మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డి వద్ద ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బుట్టి రమేష్‌బాబు, స్వతంత్ర అభ్యర్థులుగా షేక్ హుస్సేన్‌బి, మన్నెం సుధీర్‌కుమార్ తమ నామినేషన్లను అందజేశారు.

క్విస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 19: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఐటీ, ఐటీఎలైడ్ బ్రాంచి విద్యార్థులకు శుక్రవారం మైక్రో కంట్రోల్, రియల్ టైమ్ పరిశ్రమల్లో దాని అప్లికేషన్లు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత విశ్వవిద్యాలయపీఠం ఈఎన్‌సీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ షేక్ రజాక్ ఆటోమేషన్ ఇండస్ట్రీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి డీఈఎల్‌ఈడీ పరీక్షలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 19: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) మొదటి, మూడవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 22నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర శుక్రవారం తెలిపారు. మైనంపాడులోని జిల్లా విద్యాశాఖ సంస్థ(డైట్) లో ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టిక్కెట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలని ఆయన కోరారు.

డ్రాయింగ్ పరీక్షలు: ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కళాశాలలో డ్రాయింగ్ పరీక్షలు, సెయింట్‌తెరిస్సా హైస్కూలులో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలు ఈనెల 22నుంచి నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర తెలిపారు. పరీక్షలు ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు హాల్ టిక్కెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యార్థులు పరీక్షకు హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు కూడా తీసుకొనిరావాలని డీఈవో సూచించారు.

పేస్‌లో దంత ఆరోగ్యంపై సదస్సు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 19: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో దంత ఆరోగ్యంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఆర్కే దంత వైద్యశాల డాక్టర్ కె.రామకృష్ణ విద్యార్థులకు దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. దంతాల ఆరోగ్యంపై అందరూ దృష్టి సారించాలన్నారు. దంత ఆరోగ్యాల వల్ల మన చిరునవ్వు, మనవ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతిరోజు రెండు పూటలా బ్రష్ చేయడం ద్వారా దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, ఏవో ఎం.రమణబాబు, కె.బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఆక్ట్ నెట్ సేవలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యుగంధర్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 19: ఆధునిక జీవనంలో ప్రతి ఒక్కరికీ ఇంటర్‌నెట్ తప్పని సరైందని ఆట్రియా కన్వర్జెన్సు టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ దువ్వూరి యుగంధర్ పేర్కొన్నారు. ఇంటర్నెట్ రంగంలో దేశ వ్యాప్తంగా పేరుగాంచిన ఆక్ట్ ఫైబర్ నెట్ సేవలను ఒంగోలు నగరానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఒంగోలులోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి ఆక్ట్ ఫైబర్ నెట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో విశాఖ, కాకినాడు, రాజమండ్రి, ఏలూరు, విజయఎవాడ గుంటూరు నెల్లూరు, తిరుపతి నగరాల్లోనూ, తాజాగా ఒంగోలులో నెట్‌సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆక్ట్ డిజిటల్ బిజినెస్ హెడ్ సుబ్బారావు, ఏజీఎంలు ప్రసాదరెడ్డి, జునైద్ పాల్గొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 19: ఒంగోలు నగరం కేశవస్వామి పేట శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి చందు డాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. గణపతి స్తుతి, అమ్మవారి గీతం మొదలైన పలు భక్తిగీతాలకు వారు తాళలయబద్ధంగా నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. ఇక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నిత్యహోమం, కుంభారాధన, శేషవాహన సేవలు జరిగాయి. దేవస్థాన అధ్యక్షులు ఈదుపల్లి గురునాథరావు, ఈవో రజనీకుమారిలు పర్యవేక్షించి చిన్నారులను అభినందించారు. ఇక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శనివారం రాత్రి సింహవాహన సేవ అనంతరం మాగంటి మూర్తి బృందంచే భక్తి సంగీత విభావరి ఉంటుందని వారు తెలిపారు. ఇందులో సీనియర్ గాయకులు ఐ.మురళీకృష్ణ, మొవ్వా నాగేశ్వరరావు, కనకారావు, శ్రీరంగనాథం, పి.శ్రావ్య, పి.సుమతి, డి.భవాని, డి.ఉషారాణిలు పాల్గొంటారని, కనుక భక్తులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈవో రజనీకుమారి కోరారు.

టీడీపీ అభ్యర్థిగా స్వామి నామినేషన్

కొండపి, ఏప్రిల్19: కొండపి ఎమ్మెల్యేగా నాల్గవసారి కొండపి సిట్టింగ్ ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలోని కొండపి నియోజకవర్గ ఈఆర్వో ఎ. కుమార్‌కు అందజేశారు. నామినేషన్ కార్యక్రమంలో ఆయన వెంట ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు, టీడీపీ టంగుటూరు మండల నాయకుడు బెల్లం జయంత్‌బాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వామి భార్య నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే స్వామి భార్య రాజేశ్వరి

కాగా ఎమ్మెల్యే స్వామికి డమ్మీగా ఆయన భార్య రాజేశ్వరి శుక్రవారం మధ్యాహ్నం తన నామినేషన్‌ను వేశారు. ఆమె వెంట టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొర్రపాటి వసంతరాయుడు, టీడీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు

రెండోరోజు శుక్రవారం కొండపి అసెంబ్లీకి టీడీపీ కూటమి అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఆయనకు డమ్మీ అభ్యర్థిగా స్వామి భార్య డోలా రాజేశ్వరి, వైసీపీ అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్ నామినేషన్‌లు వేశారు. తొలిరోజు కాంగ్రెస్ అభ్యర్థి శ్రీపతి సతీష్ నామినేషన్ వేశారు. దీంతో మొత్తం ఇప్పటివరకు నాలుగు నామినేషన్లు దాఖలు అయ్యాయి.


పార్టీలో చేరిన వారితో దామచర్ల సత్య

ఇద్దరు వార్డుమెంబర్లతో సహా 30 కుటుంబాలు చేరిక

జరుగుమల్లి (కొండపి), ఏప్రిల్19: మండలంలోని చిర్రికూరపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు మెడబలిమి గోవిందమ్మ, కోట ప్రియాంకలతోపాటు గుంటూరి ప్రవీణ్, తగరం అనిల్‌తో సహా 30 కుటుంబాలవారు గురువారం రాత్రి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా సత్య మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికోసం, కొండపి నియోజకవర్గ అభివృద్ధికోసం వైసీపీని వీడి అనేక మంది టీడీపీలో చేరడం ఆనందదాయకమన్నారు. రాబోయే టీడీపీ ప్రభుత్వంలో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ అందేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, గ్రామ టీడీపీ నాయకుడు అరికట్ల రమణయ్య పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న గొట్టిపాటి

అద్దంకి ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయను

- వచ్చేది కూటమి ప్రభుత్వం
- దుష్ట పాలన అంతమై..ధర్మ పాలన వస్తుంది
- మీడియాతో గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 : అద్దంకి నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని, ఇచ్చిన ప్రతిమాటా నిలబెట్టుకుంటానని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం బయటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నాలుగు సార్లు పోటీ చేయగా, ఎమ్మెల్యేగా అద్దంకి ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఐదోసారి నామినేషన్ వేశానని, ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ అసెంబ్లీకి వెళ్తానన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీల నాయకత్వంలో కచ్చితంగా రాబోయే రోజులలో ఆంధ్ర రాష్ట్రంలో 175కు 160 సీట్లు గెలవబోతున్నామని గొట్టిపాటి ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజ యవంతం చేసిన కూటమి శ్రేణులు, ప్రజలకు గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.


కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన వాడరేవు యువకులు

సైకిలెక్కుతున్న యువత

● కూటమి అభ్యర్థి కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు

చీరాల, ఏప్రిల్ 19 : మాకు తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. మా ఓటును సైకిల్ గుర్తుపైనే వేస్తామని నవ యువ ఓటర్లు ప్రకటించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అనివార్యం. ఉద్యోగ, ఉపాధి, అభివృద్ధి, సంక్షే మం బాబుతోనే సాధ్యమని చీరాల మండలం వాడరేవుకు చెందిన తొలిసారిగా ఓటు హక్కును పొందిన పలువురు యువకులు పేరొన్నారు. శుక్రవారం వారు టీడీపీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని కొండయ్య సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నూతనంగా ఓటు హక్కు పొందిన మీలో ఉన్న కసి, ఉత్సాహం చూస్తుంటే ప్రజా చైతన్యానికి నిదర్శనంగా కన్పిస్తోందన్నారు. ఆ స్ఫూర్తిని గ్రామంలో మిగిలిన వారిలోనూ రగిలించాలని వారిని కూడా కార్యోన్ముఖులను చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘స్వామి’కి అడుగడుగునా నీరాజనం

- మూడు గంటల పాటు సాగిన నామినేషన్ ర్యాలీ
- తొలుత ఇంటిలో పెద్దల ఆశీస్సులు
- తల్లిదండ్రుల సమాధుల వద్ద పూజలు
- వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
- టంగుటూరులో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులు
- అడుగడుగునా మహిళల హారతులు



నామినేషన్ సందర్భంగా టీడీపీ నేతల ర్యాలీ (ఇన్‌సెట్లో)ర్యాలీలో విక్టరీ గుర్తు చూపిస్తున్న తెలుగు మహిళలు

కొండపి, ఏప్రిల్19 : కొండపి అసెంబ్లీ అభ్యర్థిగా నాల్గవ సారి తన నామినేషన్‌ను సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత నామినేషన్‌నువేశారు. ఎప్పటికప్పుడు ‘అంతకుమించి’ అన్న రీతిలో ప్రజలు భారీగా నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. గతంలో మూడు సార్లు వేసిన దాని కన్నా ప్రజలు స్వామి నామినేషన్ కార్యక్రమానికి ఈదఫా హాజరయ్యారు. స్వామి ఉదయం టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడుపాలెంలోని తన స్వగృహంలో పూజలు చేశారు. తర్వాత తన కుటుంబంలోని పెద్దలు ఆశీస్సులు తీసుకుని, అక్కడ నుంచి నేరుగా తన తల్లిదండ్రుల సమాధుల వద్ద వారి ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేశారు. గ్రామంలోని దివంగత దామచర్ల ఆంజనేయులు, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వల్లూరమ్మ ఆలయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ టంగుటూరు కూడలిలోని బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కొండపి వైపు కదిలారు. గ్రామగ్రామాన స్వామికి మహిళలు హారతులిచ్చారు. దాదాపు కొండపి వరకు చేరుకోవడానికి 30 నిమిషాలు పట్టేది ..అటువంటిది మూడున్నర గంటలపాటు వాహనశ్రేణికి సమయం పట్టింది. ర్యాలీలో ప్రతి గ్రామం నుంచి తెలుగు తమ్ముళ్లు కలిసి సాగారు. ప్రజలకు అభివాదం చేశారు. కొండపికి వచ్చే సరికి జనసంద్రంగా మారింది. గ్రామం వెలుపల నుంచి నడుచుకుంటూ వెళ్లి స్వామి నామినేషన్ వేశారు. నామినేషన్ కార్యక్రమానికి దాదాపు 25వేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. గత ఏడాది కన్నా నాలుగు వేల మంది అధికంగా హాజరయ్యారని పరిశీలకులు అంచనావేస్తున్నారు.

సింగరాయకొండ నుంచి భారీగా వెళ్లిన శ్రేణులు

సింగరాయకొండ : కొండపిలో ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం సింగరాయకొండ మండలంలోని 10 గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. తొలుతగా స్థానిక పార్టీకార్యాలయానికి టీడీపీ కూటమి పార్టీ శ్రేణులు చేరుకున్నారు. అనంతరం వరాహ లక్ష్మీనరసింహస్వామి ముఖద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి కందుకూరు రోడ్డు కూడలి వరకూ ర్యాలీగా వెళ్లారు. భగ భగ మండే ఎండను సైతం లెక్క చేయకుండా గ్రామగ్రామాన టీడీపీ శ్రేణులు వెల్లువలా ఉత్సహంగా నామినేషన్ కార్యక్రమానికి కదలివెళ్లారు.


సింగరాయకొండ నుంచి ర్యాలీగా వెళ్తున్న టీడీపీ శ్రేణులు


నామినేషన్‌కు ర్యాలీగా బయలుదేరిన ఎం నిడమలూరు టీడీపీ శ్రేణులు

అట్టహాసంగా తరలిన నేతలు

టంగుటూరు : కొండపి నియోజకవర్గ తెలుగుదేశం కూటమి అభ్యర్థి నామినేషన్ దాఖలుకు శుక్రవారం నేతలంతా అట్టహాసంగా తరలివెళ్లారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో వల్లూరమ్మ దేవస్థానికి స్వామి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న టీడీపీ క్యాడర్‌తో దేవస్థాన ప్రాంగణం అంతా కిక్కిరిసింది. ముందే ఆలయానికి చేరుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, యువనేత మాగుంట తనయుడు మాగుంట రాఘవరెడ్డి , బెల్లం జయంత్‌బాబు, చదలవాడ చంద్రశేఖర్, బొజ్జా శ్రీనుతో కలసి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరిగి నామినేషన్ వేసేందుకు బయలుదేరిన ఎమ్మెల్యే టంగుటూరు హైవే ఫ్లైఓవర్ వద్దకు రాగానే జరుగుమల్లి మండల టీడీపీ నాయకులు, అభిమానులు కలిశారు. వీరందరికీ ఎమ్మెల్యే అభివాదం చేసి ముందుకు కదిలారు. అంతా కలిసి ఊరేగింపుగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిబాపూలే, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు అక్కడి నుంచి నేరుగా కొండపికి కదిలివెళ్లారు.

రామాయపాలెంలో కదంతొక్కిన తెలుగు తమ్ముళ్లు

మర్రిపూడి, ఏప్రిల్ 19 : కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి శుక్రవారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా మండలంలోని రామాయపాలెంలో టీడీపీ శ్రేణులు పార్టీ పతాకాలు చేబూని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మలసాని నాగేశ్వరరావు(బుజ్జి) ఆధ్వర్యంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ కొండపి వరకు సాగింది.


భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించిన టీడీపీ శ్రేణులు

మండలంలోని 21 పంచాయతీల నుంచి ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు 2,000 వేల మందిపైగా నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా ర్యాలీలను నిర్వహించారు. నామినేషన్ కార్యక్రమాన్ని మండల స్థాయి నాయకులు పర్యవేక్షించారు.

హ్యాట్రిక్ విజయంతో కొండపి మరింత అభివృద్ధిలోకి..

- ఎమ్మెల్యే స్వామి
- సభలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు



సభకు భారీగా హాజరైన జనం (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న స్వామి

కొండపి, ఏప్రిల్19: కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించి, రాబోయే టీడీపీ ప్రభుత్వంలో కొండపి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కొండపిలో నామినేషన్ వేసిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కొండపి నియోజకవర్గం గురించి మాట్లాడుకోవాలంటే దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు హయాంకు ముందు, తర్వాత అని మాట్లాడుకోవాలన్నారు. పూర్తిగా వెనుకబడిన కొండపి నియోజకవర్గాన్ని దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు అభివృద్ధి చేస్తే, దాన్ని తాను దామచర్ల కుటుంబం సహకారంతో కొనసాగించానన్నారు. నాలుగు దఫాలుగా ఇక్కడ నుంచే తాను పోటీ చేస్తున్నానన్నారు. ఒకసారి ఓడిపోయాను, రెండుసార్లు గెలిచాను. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి వంద మందిని గుర్తించగలనని, పేర్లు చెప్పి మాట్లాడగలనని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎటువంటి వారో, వారి అవసరాలేవో తనకు తెలుసునన్నారు. రైతు,కూలీలు అధికంగా ఉండే నియోజకవర్గంలో తాను ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడుచుకుంటున్నానని స్వామి అన్నారు. టీడీపీ హయాంలో నియోజవర్గంలో అన్ని గ్రామాలకు రోడ్లు, ఎస్సీ కాలనీలకు సీసీరోడ్లు, సైడు కాల్వలు నిర్మించుకున్నామన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు సాగరు నీరు అందిస్తున్నామని, రాబోయే టీడీపీ ప్రభుత్వంలో నియోజవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీరు ఇంటింటికీ అందిస్తామన్నారు. నాలుగోసారి తాను పోటీచేస్తుంటే నలుగురు తనపై పోటీచేశారని, ఇక్కడ ప్రత్యర్థులు ప్రజలకు జవాబుదారీగా ఏమి ఉంటారని ఆయన ప్రశ్నించారు. కొత్తగా వచ్చిన మంత్రి సురేష్ ఒకసారి అవకాశం ఇవ్వమని అడుగుతున్నాడని, నియోజవకర్గాన్ని నంబర్‌వన్ చేస్తానంటున్నాడన్నారు. మరి సురేష్ ఎర్రగొండపాలెం, సంతనూతలపాడు నియోజకవర్గాలను ఎందుకు నంబర్ వన్ చేయలేదని ఆయన ప్రశ్నించారు. మంత్రి అసత్యాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తనను గెలిపిస్తే కొండపి నియోజవకర్గ అభివృద్ధిని మరింతగా కొనసాగిస్తానని స్వామి అన్నారు. ఎంపీ మాగుంట తనయుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. అధికార పార్టీ ఎంతకైనా తెగబడుతుందని, కార్యకర్తలు అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. ఎంపీగా తనతండ్రిని, ఎమ్మెల్యేగా స్వామిని గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ కొండపికి స్వామి శాశ్వత ఎమ్మెల్యేగా కొనసాగుతాడన్నారు. ప్రజల్లో స్వామికి మంచిపేరు ఉన్నందునే ఇదిసాధ్యమన్నారు. దామచర్ల కుటుంబం కాని, ఎమ్మెల్యే స్వామి కాని నిస్వార్థంగా, అవినీతి రహితంగా పనిచేస్తున్నామన్నారు. అందువల్లే ప్రజల్లో స్వామికి ఆదరణ ఉందన్నారు. కొండపికి ప్రత్యర్థి పార్టీల నాయకులు నలుగురొస్తే అందరూ దోచుకో, దాచుకో అన్న విధంగా పని చేశారన్నారు. కొండపి అభివృద్ధికి తాను, స్వామి కృషి చేస్తామని, తమకు మద్దతు పలుకున్న పార్టీకార్యకర్తలు, నాయకులు, ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని అన్నారు. సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మనోజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గొట్టిపాటి నామినేషన్ అదుర్స్

- అద్దంకికి తరలిన తమ్ముళ్లు
- కార్లు, ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ
- జై రవికుమార్ అంటూ నినదించిన యువత
- ఆలయాల్లో దంపతుల పూజలు



సంతమాగులూరు, పంగులూరు నుంచి తరలివెళ్తున్న కూటమి శ్రేణులు

మార్టూరు, ఏప్రిల్ 19 : అద్దంకిలో జరిగిన టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి నామినేషన్ అదుర్స్ అనిపించింది. అన్ని మండలాల్లోని గ్రామాల నుంచి పెద్దఎత్తున శ్రేణులు తరలివెళ్లారు. ముందుగా మార్టూరులో తూర్పుబజారున శుక్రవా రం ఉదయం వినాయకుని ఆలయంలో గొట్టిపాటి రవి కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అద్దంకిలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషను వేసేందు కు వెళ్తూ మొదట యద్దనపూ డి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, అ నంతరం మార్టూరులోని వినాయకునికి గొట్టిపాటి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఇక్కడి నుం చి భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు అద్దంకి వె ళ్లారు. ఈ సందర్భంగా గొట్టిపాటికి మార్టూరు, యద్దనపూడి మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సన్నిహితులు అభినందనలు తెలిపారు. భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుకున్నారు.

పంగులూరు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం మండలం నుంచి వేల సంఖ్యలో తెలు గు తమ్ముళ్లు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మం డలంలోని 21 గ్రామాల నుంచి 80 ప్రత్యేక బస్సులు, 150కి పైగా కారు లు, 3500 ద్విచక్రవాహనాలపై నేతలు, కార్యకర్తలు అద్దంకికి తరలివెళ్లారు. పలు గ్రామాల నుంచి యు వత బైకులపై జై గొట్టిపాటి అంటూ నినాదాలతో ర్యాలీగా కదిలారు. అలవలపాడు నుంచి ముస్లిం యువత బైకులపై గొట్టిపాటి నాయకత్వం వర్ధిల్లాలంటూ చేసిన ర్యాలీ ప్రత్యేకత సంతరించుకుంది. కల్లంవారిపాలెం గ్రామానికి చెందిన మహిళలు పసుపు చీరలు ధరించి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలడంతో గ్రామాలలో కోలాహలం నెలకుంది.


శ్రీరామ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం కమనీయం

వైభవంగా కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

మర్రిపూడి, ఏప్రిల్ 19 : శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక పడమర బజారులో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం శుక్రవారం రాత్రి కమనీయంగా జరిగింది. ముందుగా సీతారాముల మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగ్రకోట శ్రీనివాసశాస్త్రి, కొత్రా లక్ష్మీ సత్యన్నారాయణ శాస్త్రిల ఆధ్వర్యంలో రామ కల్యాణం ఆద్యంతం రమణీయంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చరణల మధ్య స్వామివారికి జీలకర, బెల్లం శిరస్సుపైన దాల్చి కల్యాణ రాముడు సీతాదేవి మెడలో మాంగళ్యధారణ చేశారు. పిడికిట తలంబ్రాలు పోసే తంతు విశేషంగా నిర్వహించారు. ఉభయదాతలు సర్వేపల్లి సుమంత్, హిమజ దంపతులతోపాటు కొండూరి సుబ్బరామిరెడ్డి, కోటమ్మ దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ తంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందు ఉభయదాతలను ఆలయ మర్యాదలతో దేవాలయం వరకు తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం సీతారాముల గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కొండపి, ఏప్రిల్19: అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో కొండపిలోని దుర్గాదేవి వైద్యశాల ఆవరణలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. అగ్నిప్రమాదాలు, నివారణ మార్గాలు, ముందు జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి సీహెచ్ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

షామియానా దగ్ధం...


కాగా కొండపిలో టీడీపీ నామినేషన్‌ల సందర్భంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలోని టెంట్‌పై తారాజువ్వ పడటంతో ప్రమాదవశాత్తు టెంట్‌కు నిప్పంటుకుంది. దీంతో వెంటనే అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపు చేశారు. ఎటువంటి నష్టం లేదని సిబ్బంది తెలిపారు.

నిరంతర మార్పు.. మార్కాపురం మార్పు

- నియోజకవర్గం భిన్న ఫలితాల సమ్మేళనం
- కమ్యూనిస్టులు, స్వతంత్రులూ విజయకేతనం
- అత్యల్ప మెజార్టీ 83 ఓట్లు

మార్కాపురం నియోజకవర్గం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు గెలిచిన అభ్యర్థులు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	మెజార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1952	ఎన్.వెంకటయ్య	క్రిషికార్ లోక్ పార్టీ	5199	యక్కలి రామయ్య	(స్వతంత్ర)
1955	కందుల ఓబులరెడ్డి	క్రిషికార్ లోక్ పార్టీ	8069	పూల సుబ్బయ్య	(సీపీఐ)
1962	కందుల ఓబులరెడ్డి	కాంగ్రెస్	12693	ముతకపల్లి మూర్తిరెడ్డి	(స్వతంత్ర)
1967	చప్పిడి వెంగయ్య	స్వతంత్ర అభ్యరి	2800	కందుల ఓబులరెడ్డి	(కాంగ్రెస్)
1972	ఎం.నాసర్‌బేగ్	కాంగ్రెస్	13157	అడపాల కుప్పుస్వామి	(ఎబిజెఎస్)
1978	పూలసుబ్బయ్య	సీపీఐ	83	వి.వి.నారాయణరెడ్డి	(జనతాపార్టీ)
1983	వి.వి.నారాయణరెడ్డి	టీడీపీ	19353	దొడ్డా చలమారెడ్డి	(కాంగ్రెస్)
1985	కె.పి.కొండారెడ్డి	కాంగ్రెస్	7007	పూల సుబ్బయ్య	(సీపీఐ)
1989	కె.పి.కొండారెడ్డి	కాంగ్రెస్	2531	జంకె వెంకటరెడ్డి	(టీడీపీ)
1994	జంకె వెంకటరెడ్డి	స్వతంత్ర అభ్యర్థి	20941	కె.పి.కొండారెడ్డి	(కాంగ్రెస్)
1999	కె.పి.కొండారెడ్డి	కాంగ్రెస్	6121	జంకె వెంకటరెడ్డి	(టీడీపీ)
2004	కె.పి.కొండారెడ్డి	కాంగ్రెస్	20738	కందుల నారాయణరెడ్డి	(టీడీపీ)
2009	కందుల నారాయణరెడ్డి	టీడీపీ	9054	కె.పి.కొండారెడ్డి	(కాంగ్రెస్)
2014	జంకె వెంకటరెడ్డి	వైసీపీ	9802	కందుల నారాయణరెడ్డి	(టీడీపీ)
2019	కుందురు నాగార్జునరెడ్డి	వైసీపీ	18667	కందుల నారాయణరెడ్డి	(టీడీపీ)



మార్కాపురం, ఏప్రిల్ 19 : మార్కాపురం నియోజకవర్గ ఓటర్లు విజ్ఞులు. ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలలో ఓటర్లు విభిన్న ఆలోచనా ధోరణిని ఓట్ల రూపంలో వ్యక్తపర్చారు. కేవలం ఒక పార్టీ, ఒక వర్గం అనే విధానానికి తావులేకుండా తమ అభిప్రాయాలను బ్యాలెట్ ద్వారా తెలియజేశారు. పూర్వ కర్నూలు జిల్లాలో భాగంగా మార్కాపురం నియోజకవర్గం ఉంది. ఆ తర్వాత జరిగిన రాజకీయ మార్పుల్లో ప్రకాశం జిల్లాలో భాగమైంది. అయినప్పటికీ ఇక్కడ ప్రజల జీవన విధానం రాయలసీమ ప్రజల జీవన విధానాన్ని పోలి ఉంటోంది. కానీ ఆలోచనా ధోరణిలో ఒకింత విలక్షణత కలిగి ఉన్నారు ఓటర్లు. రాయలసీమ ఫ్యాక్షన్ మూలాలు మార్కాపురం ప్రాంతంలో ఉన్నప్పటికీ, రాన్రాను కనుమరుగయ్యాయి. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రాధాన్యతా అంశాలు కూడా మారుతున్నాయి. ప్రజలు సైతం తమకు, తమ ప్రాంతానికి సేవ చేసే నాయకులను ఎప్పటికప్పుడు వరిస్తూనే ఉన్నారు. నాయకుల ఎంపికలో తరతమ భేదాలు పట్టించుకోవడం లేదు. ఏ పార్టీ అండదండలు లేకపోయినా వ్యక్తితం ఉంటే స్వతంత్రులుగా కూడా శాసనసభకు పంపారు. పోరాటాల పార్టీగా గుర్తింపు పొందిన సీపీఐకి ప్రాధాన్యత ఇచ్చారు.



కాంగ్రెస్ పార్టీ ఆరు సార్లు విజయం

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మార్కాపురం నియోజకవర్గానికి 1952 నుంచి ఇప్పటివరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఆఎన్నికలలో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులు ఆరుసార్లు విజయం సాధించారు. 1962లో కందుల ఓబులరెడ్డి, 1972లో నాసర్‌బేగ్, 1985, 89, 99, 2004లో నాలుగు పర్యాయాలు కె.పి.కొండారెడ్డి విజయం సాధించారు.

స్వతంత్రులూ రెండుసార్లు

మార్కాపురం నియోజకవర్గ ఓటర్లు స్వతంత్ర అభ్యర్థులను ఆదరించారు. తొలుత మార్కాపురం నియోజకవర్గానికి 1967లో నాల్గవ పర్యాయం జరిగిన సాధారణ ఎన్నికలలో చప్పిడి వెంగయ్య స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కందుల ఓబులరెడ్డిపై 2800 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రెండోసారి 1994లో జంకె వెంకటరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కె.పి.కొండారెడ్డిపై 20,941 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

సీపీఐ నుంచి పూల సుబ్బయ్య విజయం

మార్కాపురం డివిజన్‌లో కమ్యూనిస్టు యోధునిగా పేరుగాంచిన వ్యక్తి పూల సుబ్బయ్య. స్వాతంత్రోద్యమంలో పాల్గొనటంతోపాటు స్వాతంత్ర్యం అనంతరం ప్రజా సమస్యలపై ముందుండి పోరాటాలు చేశారు. 1977లో దేశంలో అత్యవసర పరిస్థితి అనంతరం 1978లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో మార్కాపురం అసెంబ్లీ స్థానం నుంచి సీపీఐ తరఫున పూల సుబ్బయ్య జనతాపార్టీ అభ్యర్థి వి.వి.నారాయణరెడ్డిపై విజయం సాధించారు. ఆ ఓట్ల కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగింది. కౌటింగ్ పూర్తి చేసిన అధికారులు పూల సుబ్బయ్యకు 28 ఓట్లు ఆధిక్యం వచ్చినట్లు ప్రకటించారు. దీంతో జనతా పార్టీ అభ్యర్థి నారాయణరెడ్డి రీకౌంటింగ్‌కు పట్టుబట్టగా మెజార్టీ 86 ఓట్లు వచ్చినట్లు తేలింది.

రాఘవరెడ్డి సరికొత్తగా..

- ప్రచారంలో మాగుంట కుటుంబం
- చక్రం తిప్పుతున్న రాఘవరెడ్డి
- సూటి ప్రసంగాలతో ఆకట్టుకుంటున్న వైనం



దర్శిలో కూటమి అభ్యర్థుల సభలో రాఘవరెడ్డి, మాట్లాడుతున్న అభ్యర్థి లక్ష్మి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు :

ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలో మాగుంట కుటుంబీకులు టీడీపీ కూటమి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రధానంగా టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొందరు కీలక నాయకులను టీడీపీ కూటమిలోకి రాబట్టడంలోనూ, రాజకీయాలకు అతీతంగా తటస్థవాదుల మద్దతు పొందటంలోనూ రాఘవరెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. తండ్రీకొడుకులతో పాటు కుటుంబ సభ్యులలోని పలువురు మహిళలు, పురుషులు నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

గత 28 సంవత్సరాలుగా మాగుంట కుటుంబం ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలో రాజకీయంగా ప్రత్యేక స్థానం సొంతం చేసుకుంది. తొలుత 1991లో ఆ కుటుంబ పెద్ద దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి ఎంపీగా గెలుపొందారు. తీవ్రవాదుల చేతుల్లో 1995లో ఒంగోలు నడిబొడ్డులో ఆయన హత్యకు గురైన తర్వాత ఆయన సతీమణి పార్వతమ్మ ఆ తర్వాత ఆయన సోదరుడు శ్రీనివాసులరెడ్డి రాజకీయాల్లో ఆరంగేట్రం చేశారు. ఇప్పటికీ ఆరు పర్యాయాలు ఒంగోలు లోక్‌సభ నుంచి ఆ కుటుంబ సభ్యులు గెలుపొందారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ ప్రజలతో సన్నిహిత సంబంధాలను ఆ కుటుంబం కొనసాగిస్తోంది. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలుపొందిన శ్రీనివాసులరెడ్డికి ఈ ఎన్నికల్లో వైసీపీ టికెట్ నిరాకరించింది. స్థానికంగా టీడీపీ నాయకులతో పాటు ఆ పార్టీ అధినేత చంద్రబాబుతో మంచి సంబంధాలు ఉన్న మాగుంట కొంతకాలం క్రితం టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ పర్యాయం ఎన్నికల్లో రాఘవరెడ్డిని పోటీలో దింపాలని శ్రీనివాసులరెడ్డి భావించినా చంద్రబాబు సూచనలతో శ్రీనివాసులరెడ్డి లోక్‌సభ నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా రంగంలో నిలిచారు.

పరిచయాలను పెంచుకుంటూ..

తొలుత టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలను రాఘవరెడ్డి కలిసి పార్టీ పరమైన రాజకీయ సంబంధం పెంచుకున్నారు. వెంటనే రాఘవరెడ్డి నియోజకవర్గంలోని అన్నీ అసెంబ్లీ స్థానాల్లో తిరుగుతూ తన తండ్రితో పాటు టీడీపీ కూటమిలోని అసెంబ్లీ అభ్యర్థుల ప్రచారానికి శ్రీకారం పలికారు. ముఖ్యంగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీలో ఉన్న వారిని టీడీపీలోకి తీసుకురావటంలోను, వారిని స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులతో సమన్వయం చేయటంలోను, ఆయా వర్గాల ప్రముఖుల మద్దతును రాబట్టటంలోను రాఘవరెడ్డి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఆయన సమక్షంలో కొండపి, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం లాంటి నియోజకవర్గాల్లో పలువురు టీడీపీలో చేరటం విశేషం. కింది స్థాయిలో పట్టున్న నాయకులను రాబట్టగలిగారు. ఒంగోలు అభ్యర్థి మాగుంట కనిగిరి, ఒంగోలు లాంటి నియోజకవర్గాల్లో కొందరు నాయకులతో పాటు వారి కుటుంబ శ్రేయోభిలాషులను టీడీపీకి మద్దతు ఇచ్చేందుకు కృషి చేసి సఫలీకృతులయ్యారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభంకావటంతో తండ్రీకొడులకుతో పాటు మిగిలిన కుటుంబ సభ్యులు ప్రచార కార్యక్రమానికి శ్రీకారం పలికారు.

ప్రభుత్వ నిధులు రాకున్నా.. సొంత డబ్బుతో పనులు

మాగుంట కుటుంబం తరఫున తమ స్వంత నిధులతో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చేపట్టిన సంస్థల్లోని ప్రతినిధులతో ఆ కుటుంబ మహిళలు కలిసి టీడీపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేక, ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టలేక మాగుంట కుటుంబం స్వంత నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. గ్రామాల్లో రోడ్లు, గ్రామాల మధ్య లింక్ రోడ్లు, పొలాలకు వెళ్లే రహదారులు అభివృద్ధి, తాగునీటి, డ్రైనేజీ లాంటి సమస్యల పరిష్కారానికి స్వంత నిధులతో పనులు నిర్వహిస్తున్నారు. ఆయా పనుల ద్వారా వీరిని గౌరవిస్తున్న సాధారణ ప్రజలను టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని స్వయంగా వెళ్లి కలిసి చెబుతున్నారు. ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంపై దృష్టి కేంద్రీకరించి ఊరూవాడా ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. మార్కాపురంలో నివాస గృహం ఏర్పాటు చేసుకొని అన్నీ ప్రాంతాలకు వెళ్లి పనిచేస్తున్నారు. అవసరమైన కార్యక్రమాల్లో తప్పా మిగిలిన సందర్భాల్లో తండ్రీకొడుకులు నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు.


ఈ కార్యక్రమాల్లో మాగుంట రాఘవరెడ్డి చేస్తున్న ప్రసంగాలు, చెబుతున్న మాటలు హైలెట్‌గా నిలుస్తున్నాయి. ప్రధానంగా టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలకు ఉత్సాహన్ని కల్పించే విధంగా తక్కువ సమయంలో చెప్పదలుచుకున్న అంశాలను ఆయన సూటిగా చెప్పి అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. మీకు కూటమి పార్టీల అండ ఉంది, మేమున్నాం ధైర్యంగా నిలబడి పనిచేయండి. మీ భవిష్యత్తు మేము చూసుకుంటాం అంటూ మూడు పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ఇంకోవైపు జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయంగా ఆ పార్టీ శ్రేణులను కలుపుకుపోటవంతో సఫలీకృతులవుతున్నారు.

పరిశ్రమలకు పాడెకట్టి..

- దర్శి నియోజకవర్గంలో ప్రభుత్వరంగ సంస్థలకు మంగళం
- టీడీపీ హయాంలో శంకుస్థాపనలు, పనుల ప్రారంభం
- జగన్‌రెడ్డి వచ్చాక ఆ టెండర్లన్నీ రద్దు
- పూర్తిగా కుంటుపడిన అభివృద్ధి
- ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన యువత
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



దర్శి, ఏప్రిల్ 19 : వైసీపీ అసమర్థ పాలన వలన దర్శి నియోజకవర్గంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణాలు పునాదుల్లోనే నిలిచిపోయాయి. బహుళ ప్రయోజనాలు చేకూరే ప్రాజెక్టులు అటకెక్కడంతో ఈ ప్రాంత అభివృద్ధి కుంటుపడింది. యువతకు ఉద్యోగాలను కోల్పోయారు. ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలకుల నిర్లక్ష్యవైఖరి, తప్పుడు నిర్ణయాల పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



దర్శిలో పునాదుల్లోనే నిలిచిన డ్రైవింగ్ శిక్షణ కేంద్రం

పునాదుల్లోనే డ్రైవింగ్ శిక్షణ కేంద్రం

టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధన కేంద్రం పునాదుల్లోనే నిలిచిపోయింది. దర్శి-కురిచేడు రోడ్డులో చంద్రబాబు హయాంలో 20 ఎకరాల్లో రూ.18.5 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 2018లో శంకుస్థాపన చేశారు. కొంతమేర పనులు జరిగిన తర్వాత ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని పట్టించుకోలేదు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ నిర్మాణం కోసం కొంత మేరకు కృషి చేసినా ప్రభుత్వ పెద్దలు సహకరించకపోవడంతో అది ముందుకు సాగలేదు. ఇది పూర్తయి ఉంటే వందలాదిమందికి ఉద్యోగావకాశాలు, వేలాది మందికి ఉపాధి లభించేది.

నిలిచిన కోల్డ్‌స్టోరేజీ

మార్కెట్ యార్డులో రూ.5కోట్ల వ్యయంతో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేపట్టిన కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం పునాదుల్లోనే నిలిచిపోయింది. కొంతమేర పనులు జరిగినా ఎన్నికలు రావడంతో ఆగిపోయాయి. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ టెండర్లను రద్దు చేశారు. వైసీపీ పాలకులు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు మళ్లీ టెండర్లు పిలిచినప్పటికీ ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆ నిధులను పక్కకు మళ్లించడంతో కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం అటకెక్కింది. దర్శి ప్రాంతంలో రైతులు కూరగాయలు పండ్ల తోటలు అధికంగా సాగు చేస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం పూర్తయి ఉంటే దానిలో నిల్వ చేసుకొని గిట్టుబాటు ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం ఉండేదని, వైసీపీ తప్పుడు నిర్ణయంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి ఇతర పంటలను గుంటూరు తీసుకెళ్లి నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి ఉంది.

శంకుస్థాపనకే పరిమితమైన మొగిలిగుండాల రిజర్వాయర్

తాళ్లూరు మండలం, శివరాంపురం సమీపంలో రూ.10.40 కోట్లతో నిర్మించ తలపెట్టిన మొగిలిగుండాల రిజర్వాయర్ శంకుస్థాపనకే పరిమితమైంది. టీడీపీ ప్రభుత్వ హకాంలో నిధులు విడుల కావడంతో పాటు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అప్పటి మంత్రి శిద్దా శంకుస్థాపన చేశారు. అనంతరం వచ్చిన వైసీపీ అకారణంగా ఆ టెండర్లను రద్దు చేసింది. అధికార పార్టీకి అనుకూలమైన వారికి టెండర్లు కట్టబెట్టేందుకు రీటెండర్లు పిలిచారు. ఒక కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకోగా అధికార పార్టీలో కుమ్ములాటల వలన ఆటెండర్‌ను కూడా మళ్లీ రద్దు చేశారు. ఆ తర్వాత మళ్లీ టెండర్ పిలిచి ముఠ వ్యక్తికి టెండర్ అప్పచెప్పినా పనులు నిర్వహించలేదు. దీంతో ఈ రిజర్వాయర్ నిర్మాణం మూలన పడింది. ఈ పథకం పూర్తయితే తాళ్లూరు మండలంలోని అనేక గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగి తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోయేది.



పరిశ్రమల ఏర్పాటుకాక వెలవెలబోతున్న దొనకొండ పార్క్

పరిశ్రమల ఏర్పాటుకు నోచుకోని పారిశ్రామిక కారిడార్

గత టీడీపీ హయాంలో దొనకొండ మండలంలో పరిశ్రమల కారిడార్ ఏర్పాటు కోసం 25వేల ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించింది. అనేక పరిశ్రమలను అక్కడ నెలకొల్పేందుకు ప్రణాళికలు రచించారు. కొంతమంది విదేశీ పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలను నెలకొల్పేందుకు భూములను పరిశీలించారు. అలాగే ప్రభుత్వ ఆధ్వర్యంలో చిన్నతరహా పరిశ్రమల పార్క్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ రోడ్లు, కాల్వలు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించారు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. యుద్ధ విమానాల విడిభాగాల తయారీ పరిశ్రమ నెలకొల్పుతున్నామని వైసీపీ పాలకులు చివరి సమయంలో హడావుడి చేశారు. ఇప్పటి వరకు అక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి ప్రాథమిక అడుగులు పడిన దాఖలాలు లేవు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వలన పారిశ్రామిక కారిడార్ అటకెక్కింది. ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పివుంటే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి ఉండేవి. ఈ పథకాలు అన్నీ పూర్తయి ఉంటే దర్శి నియోజకవర్గం అన్ని విధాలా ఎంతో అభివృద్ధి చెంది ఉండేది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం, చేతగాని నిర్ణయాలతో భారీ ప్రాజెక్టులు, పథకాల నిర్మాణాలు ఆగిపోయి, అభివృద్ధి నిలిచిపోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ చిత్ర విచిత్రాలు

మాగుంట ఆస్తుల వివరాలివి...



ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 19 : ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి తన ఆస్తులు, అప్పుల వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏఎస్ దినేష్‌కుమార్‌కు అఫిడవిట్ రూపంలో సమర్పించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.13,85,370 మేర ఆదాయ రిటర్న్‌కు దాఖలు చేశారు. నగదు రూ.18,529 ఉన్నట్లు చూపించారు. రూ.4,58,30,319 విలువైన చరాస్తులు ఉన్నట్లు ఉన్నట్లు అఫిడవిట్ దాఖలు చేశారు. రూ. 1,09,00,000 విలువైన స్థిర ఆస్తులున్నట్లు చూపించారు. బ్యాంకులు, ఇతర ఆర్థికసంస్థల నుంచి రూ.3,19,39,571 అప్పు తీసుకున్నట్లు చూపించారు. షేర్లు, డిబెంచర్లు, బాండ్ల రూపంలో రూ.2,14,42,617 పెట్టుబడులు ఉన్నట్లు చూపించగా, రూ.1,92,32,384 వివిధ సంస్థలు, వ్యక్తుల నుంచి మాగుంటకు రావాల్సి ఉంది. గుడూరు మండలం పేడూరు గ్రామంలో మూడు సర్వేనెంబర్లలో రూ.77 లక్షల విలువైన 10.22 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.32 లక్షల విలువైన వ్యవసాయేతర భూమి కూడా మాగుంట పేరుతో ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు.

నామినేషన్ కార్యక్రమంలో మంత్రి సురేష్ భార్య

ప్రభుత్వ ఉద్యోగి అయినా పాల్గొనడంపై వివాదం.. తప్పులేదన్న ఈఆర్వో



మంత్రి సురేష్ తరఫున నామినేషన్ వేస్తున్న వైసీపీ నేతలు

కొండపి, ఏప్రిల్ 19 : కొండపి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా మంత్రి ఆదిమూలపు సురేష్ తరఫున ఆ పార్టీ నాయకులు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన భార్య విజయలక్ష్మి పాల్గొనడం వివాదంగా మారింది. శుక్రవారం మంచిరోజు కావడంతో ఒకసెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ఫారాలను మంత్రి తరఫున కొండపి, పొన్నలూరు జడ్పీటీసీ సభ్యులు మారెడ్డి అరుణకుమారి, బెజవాడ వెంకటేశ్వర్లు, వైసీపీ కొండపి మండల సీనియర్ నాయకుడు డాకా పిచ్చిరెడ్డి, సింగరాయకొండ మండల వైసీపీ నాయకుడు యన్నాబత్తిన వెంకటేశ్వరరావుతో పాటు మంత్రి భార్య, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయిన విజయలక్ష్మి కూడా ఈఆర్వో వద్దకు వెళ్లారు. కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో ఎ.కుమార్‌కు శుక్రవారం మధ్యాహ్నం నామినేషన్ అందజేశారు. అయితే అధికారులు ఫొటో తీసేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకుని ఆమెను దూరంగా ఉంచారు. ఈ విషయమై ఈఆర్వో కుమార్‌ను వివరణ కోరగా మంత్రి భార్య విజయలక్ష్మి కూడా తన కార్యాలయంలోకి వచ్చారని, అయితే ఆమె నామినేషన్ పత్రాలు అందించే కార్యక్రమానికి దూరంగా ఉన్నారని వివరించారు. ఆమె ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనవచ్చా? అని విలేకరులు ప్రశ్నించగా ఆయన మరో ఈఆర్వోకి ఫోన్ చేశారు. ఆయన పాల్గొనవచ్చని సమాధానమివ్వడంతో ఈఆర్వో కుమార్ ఆమె పాల్గొనడం తప్పు కాదని వివరించారు.

వైసీపీ సేవలో ఫీల్డ్ అసిస్టెంట్



వైసీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ శివారెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 19 : ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలిచ్చినా కొందరు ఉద్యోగులు వైసీపీకి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మండలంలోని బొద్దికూరపాడు ఉపాధి క్షేత్రసహాయకుడిగా పనిచేస్తున్న గంగవరపు శివారెడ్డి దర్శిలో గురువారం జరిగిన వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దర్శి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి నామినేషన్‌కు వైసీపీ శ్రేణులు ర్యాలీగా వెళుతుండగా, ఫీల్డ్ అసిస్టెంట్ శివారెడ్డి కార్యకర్తలతో కలిసి ముందుకుసాగారు.

గొట్టిపాటికి అమరావతి రైతుల సంఘీభావం



మాట్లాడుతున్న అమరావతి రైతులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 : టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి నామినేషన్ సందర్భంగా శుక్రవారం అమరావతి నుంచి పలువురు రైతులు వచ్చి రవికుమార్‌కు తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయస్థానం టూ దేవస్థానం వరకు అమరావతి రైతులు చేపట్టిన పాదయాత్రలో మా వెన్నంటి ఉండి, నియోజవర్గంలో మాకు అవసరమైన భోజనవసతి, బస వంటి అనేక విషయాలల్లో మాకు గొట్టిపాటి ఎంతో సహకరించారని తెలిపారు. వైసీపీ అరాచకాలను తట్టుకుని పార్టీ కోసం నిలబడిన గొట్టిపాటికి సంఘీభావాన్ని తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అమరావతి రైతులతో పాటు మహిళలు ఉన్నారు.





జనసంద్రమైన ఎర్రగొండపాలెం వీధులు, ఎరిక్షన్‌బాబు, మాగుంట శ్రీనివాసులురెడ్డికి గజమాల వేస్తున్న కార్యకర్తలు, నృత్యం చేస్తున్న మహిళలు

- అట్టహాసంగా ఎరిక్షన్‌బాబు నామినేషన్
- నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తల హాజరు
- మార్కాపురం జిల్లా ఏర్పాటుకు హామీ
- వెలిగొండ జలాలు అందించడమే లక్ష్యమని భరోసా
- వై.పాలెంలో టీడీపీ జెండా ఎగురుతుందని ధీమా
- ర్యాలీలో పాల్గొన్న మాగుంట, మన్నె రవీంద్ర

పోటెత్తిన పసుపుదండు

ఎర్రగొండపాలెం (పుల్లలచెరువు), ఏప్రిల్ 19 : ఎర్రగొండపాలెంలో కనివిని ఎరగని రీతిలో ఎరిక్షన్‌బాబు నామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. నామినేషన్ సందర్భంగా జరిగిన ర్యాలీలో పాల్గొనేందుకు నియోకవర్గం నుంచి పసుపుదండు పోటెత్తింది. దీంతో ఎర్రగొండపాలెంలోని రోడ్లన్నీ కిక్కిరిశాయి. నామినేషన్ దాఖలుకు వెళుతూ.. ఎర్రగొండపాలెం ర్యాలీలో పాల్గొన్న టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డిలు ప్రచార వాహనం పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. టీడీపీ కార్యాలయం నుంచి వేలాది మంది ప్రజానీకంతో బయలుదేరి బంగ్లా మీదుగా ప్రధాన రోడ్డులోకి వచ్చారు. అక్కడ నుంచి ఎన్టీఆర్ కూడలి మీదగా బస్టాండ్ పుల్లలచెరువు రోడ్డు వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ కూడలిలో ప్రజలను నేతలు ఉద్దేశించి మాట్లాడారు. ఎన్టీఆర్ కూడలిలో తెలుగు యువత ఆధ్వర్యంలో ఎక్సకవేటర్‌తో గజమాల వేశారు. ర్యాలీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజానీకానికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ర్యాలీలో రాష్ట్ర విభిన్న ప్రతిభవంతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని ఆనందంలో నృత్యాలు చేశారు. పుల్లలచెరువు రోడ్డులో టీడీపీ అభిమానులు ఎరిక్షన్‌బాబుకు, మాగుంట శ్రీనివాసులరెడ్డికి భారీ గజమాలను వేశారు. నేతల ప్రసంగం అనంతరం ఆర్‌వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. నామినేషన్ సందర్భంగా పట్టణంలో కోలాహ లం నెలకొంది. వై.పాలెం చరిత్రలో ఇంతమంది జనం నామినేషన్ కార్యక్రమానికి తరలిరావడంతో టీడీపీ కూటమి శ్రేణులు ఆనందోత్సవంలో ఉన్నాయి. ఇంచుమించు 30 వేల మంది కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమానికి హాజరైనట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వై.పాలెం టీడీపీ నామినేషన్ ర్యాలీ విజయవంతం కావడంతో, అధికార పార్టీ వర్గాల్లో కూడా చర్చ నడిచింది. గిరిజన తాండాలు, చెంచుగూడేంల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. నామినేషన్ సందర్భంగా టీడీపీ శ్రేణులు పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు.

సామాన్య కార్యకర్తను.. అవకాశం ఇవ్వండి

'టీడీపీలో సామాన్య కార్యకర్తను, ఒక్కసారి అవకాశం ఇవ్వండి.., ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తా' అని వై.పాలెం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు కార్యకర్తలను అభ్యర్థించారు. గురువారం ఎర్రగొండపాలెం టీడీపీ కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేసిన సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రెండు పర్యాయాలు ఎర్రగొండపాలెంలో వైసీపీని గెలిపించారన్నారు. అయితే ఎర్రగొండపాలెంలో అవినీతి మినహా అభివృద్ధి లేదన్నారు. పుల్లలచెరువు, త్రిపురాంతకం నియోజకవర్గం కేంద్రం నుంచి ఇప్పటికీ సరైన రోడ్లు లేవన్నారు. డబుల్ రోడ్డు వేస్తామని చెప్పిన మంత్రి హామీ ఏమయ్యిందని ప్రశ్నించారు. పుల్లలచెరువు మండలానికి అవసరమైన తీగలేరు చిన్నకండ్లేరు అనుసందానికి జీవో ఇచ్చిన ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టిందన్నారు. ఎర్రగొండపాలెంలో కరువుతో వలసలు పెరుగుతున్నాయన్నారు. యువతకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎర్రగొండపాలెంలో పరిశ్రమలు స్థాపించి వలసలు నివారించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. డాక్టరు మన్నె రవీంద్ర మాట్లాడుతూ, ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రతి గడపలో సమస్య తెలిసినా ఏకైక వ్యక్తి ఎరిక్షన్‌బాబు అని అన్నారు. అలాంటి మంచివ్యక్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, ఎరిక్షన్ బాబు కుమార్తె చల్సియా, కుమారుడు అజిత్, గోనుగుంట్ల కోటేశ్వరరావు టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, మేకల వలరాజు, పయ్యావుల ప్రసాద్, మెట్టు గోవిందురెడ్డి, మల్లికార్జునరెడి, ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, టీడీపీ ముఖ్య నాయకులు వడ్లమూడి లింగయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగ నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, మంత్రునాయక్, షేక్ మస్తాన్‌వలి, కామేపల్లి వెంకటేశ్వర్లు, నలగాటి చిన్న మల్లికార్జుననాయుడు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు : రాష్ట్రంలో, ఎర్రగొండపాలెంలో టీడీపీని ఆదరించి గెలిపించాలని టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. శుక్రవారం ఎర్రగొండపాలెంలో కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొ ని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తన ముప్పై ఏళ్ళ రాజకీయ చరిత్రలో ఎర్రగొండపాలెంలో నామినేషన్ కార్యక్రమానికి ఇంత జనాన్ని ఎప్పుడు చూడలేద న్నారు. ఎరిక్షన్‌బాబు గెలుపు ఖాయం అని చెప్పడానికి ఇక్కడి ప్రజాస్పందనే నిదర్శన మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే సీఎం జగన్మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నీరు వస్తుందని రైతులు, ఈ ప్రాంత ప్రజలు కళ్లకు ఒత్తులేసుకోని చూశారన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండను పూర్తి చేస్తామన్నారు. వెలిగొండ జీవోపై సంతకం చేసేది చంద్రబాబు అని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు పార్టీ గెలుపునకు కృషి చేయాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయ ఢంకా మోగిస్తుందని 150 సీట్లతో చంద్రబాబు సీఎం అవుతారన్నారు. కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీ కార్యకర్తలు కలిసి కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేస్తామన్నారు. చంద్రబాబు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పరుగులు పెట్టిస్తారని అన్నారు.

అవీ.. ఇవీ..

టీడీపీలోకి భారీగా చేరికలు



కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు, మాగుంట శ్రీనివాసులరెడ్డిలు

పుల్లలచెరువు , ఏప్రిల్ 19 : నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర జోరుగా సాగుతోంది. శుక్రవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో పుల్లలచెరువు మండలం మానేపల్లిలో 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అయ్యాగానిపల్లె నుంచి 50 కుటుంబాలు, గారపెంటలో 20, ఎర్రగొండపాలెం పట్టణం, మురారిపల్లెలో 10, పాలుట్లలో 10 కుటుంబాలకు టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి, వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతుండటంతో వైసీపీ పార్టీకి పెద్ద షాక్ తగిలింది.

ఘనంగా గౌతు లచ్చన్న వర్ధంతి



లచ్చన్నకు నివాళి అర్పిస్తున్న గౌడసంఘం నేతలు

మార్కాపురం వన్ టౌన్, ఏప్రిల్ 19: స్వాతంత్ర్య సమర యోధుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 18వ వర్ధంతి శుక్రవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నాగార్జునగౌడ్, రంగస్వామి గౌడ్, శ్రీనివాసరావు గౌడ్, హనుమయ్య గౌడ్, ఔంత కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు పట్టణంలో..

గిద్దలూరు టౌన్ : సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమాన్ని గౌడ సంఘీయులు ఘనంగా నిర్వహించారు. గిద్దలూరులో గురువారం సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రైతుల కోసం ఉద్యమాలు చేసి ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు పాదయాత్ర చేసిన మహనీయుడు గౌతు లచ్చన్న అని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్దార్ సర్వాయ్‌పాపన్న గౌడ సంఘం అధ్యక్షులు బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్, ప్రధాన కార్యదర్శి కంచర్ల రంగవరప్రసాద్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కంచర్ల కోటయ్య, బీజేపి జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడులో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

తర్లుపాడు, ఏప్రిల్ 19: తర్లుపాడు బస్టాండ్ కూడలిలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. డీఆర్‌డీఏ ఏరియా కో-ఆర్డనేటర్ సుధాకర్ బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఎస్‌బీఐ మేనేజర్ దేవరకొండబాబు, ఆల్ఫా గ్లోబల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఎస్. విజయ్ కుమార్‌లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తొలిరోజు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం డి.పిచ్చయ్య, నెహ్రూ యూత్ అధ్యక్షులు పుల్లయ్య, వెలుగు సీసీ సాయిలు, మండల సమాఖ్య సభ్యురాలు కొప్పరపు రంగ రత్నమ్మ, వీవోఏలు, డ్వాక్రా సంఘం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం



రాములవారి రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని బోడపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మూడురోజులుగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అందరికీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆలయ పూజారి కే.నరసింహాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వందల సంఖ్యలో రాములోరి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 19: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వైకేపీ ఏపీఎం రమేష్‌బాబు అన్నారు. మండలంలోని బోడపాడు ఎస్సీ కాలనీలో ఓటు హక్కుపై గ్రామంలోని మహిళలకు అవగాహన ర్యాలీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు



మాట్లాడుతున్న పీడీ అర్జున్‌రావు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 19: గ్రామీణ ప్రాంతాలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉపాధి పని కల్పించాలని డ్వామా పీడీ అర్జున రావు సిబ్బంది ని ఆదేశించారు. మండలంలోని రాయవరం పంచా యతీ పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న ఈఎల్ ఆర్‌సీ భవనంలోని మార్కాపురం క్లస్టర్ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొనకొండ, దోర్నాల, మార్కాపురం, పెద్దారవీడు, పుల్లల చెరువు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం మండలాల పరిధిలోని సిబ్బంది 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని పనులు చేయిం చాలని కోరారు. వేసవికాలంలో గ్రామాలలో నీటిఎద్దడి నెలకొన్న నేపథ్యంలో రైతులకు నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, నీటినిలో కందకాల పనులు చేయించాలని కోరారు. సమావేశంలో ఏపీడీ జీవీకే నిర్మలదేవి, ప్లాంటేషన్ మేనేజర్ సంజీవరావు, సీడీ ఎల్ఆర్‌సీ శ్యాంసన్, ఆయా మాడలాల ఏపీఓలు, టీఏలు, సీఓలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఆంక్షల సడలింపుతో ట్రాఫిక్ సులభతరం

గిద్దలూరు, ఏప్రిల్ 19 : నామినేషన్ల పుణ్యమా అని పోలీసుల ట్రాఫిక్ ఆంక్షలతో వాహనచోదకులు గురువారం ఇక్కట్లకు గురికాగా 'ఆంధ్రజ్యోతి' కథనంతో శుక్రవారం ఆంక్షలను తొలగించారు. నామినేషన్లు వేసే తహసీల్దార్ కార్యాలయం జాతీయ రహదారి పక్కనే ఉండడంతో రోడ్డులో సగభాగాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మిగిలిన సగభాగంలోనే వాహనాలు పంపడం వలన ఎదురెదురుగా వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో శుక్రవారం జాతీయ రహదారిపై రెండువైపులా వాహనాలు తిరిగే విధంగా సీఐ సోమయ్య ఏర్పాట్లు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోయింది. కేవలం నామినేషన్ వేసే సమయంలో పెద్దపాటి ర్యాలీ ఉన్న కొద్ది సేపు మాత్రమే ట్రాఫిక్‌ను ఒక రూటులో పంపిస్తామని మిగిలిన సమయం రెండు రోడ్లలో వాహనాలను పంపిస్తామని తెలిపారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు

కంభం, ఏప్రిల్ 19 : కంభం పట్టణంలో ఎస్‌పీజీ పాలేనికి చెందిన ఓ యువతిని ప్రేమించి మోసం చేసిన ఘటనలో ఒక యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పులి రాజేష్ తెలిపారు. అర్ధవీడు మండలం వెలగలపాయ గ్రామానికి చెందిన శ్రీనివాసులు కంభం పట్టణం ఎస్‌పీజీపాలెంకు చెందిన యువతిని ప్రేమించడమేకాక పెళ్ళి చేసుకుంటానని నమ్మబలికాడు. అయితే కొన్ని రోజుల నుంచి శ్రీనివాసులు ముఖం చాటేయడంతో మోసపోయిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వలంటీర్లతో వైసీపీ నేతల సమావేశం

- ఎన్నికలకు సహకరించాలని దిశానిర్దేశం

పొదిలి, ఏప్రిల్ 19 : పొదిలిలో వైసీపీ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఆ పార్టీ నేతలు లాడ్జిని ఏర్పాటు చేసుకున్నారు. అందులో రహస్య సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుంటుంది. ఆ క్రమంలో శుక్రవారం ముఖ్యనాయకులు, బూత్‌స్థాయి వైసీపీ నాయకులతోపాటు వలంటీర్లను కలుపుకొని సమావేశం నిర్వహించారు. ఇక నుంచి బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలోని వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇప్పటికే సుమారుగా 38మంది వలంటీర్లు రాజినామాలు చేసిన వారు, రాజీనామాలు చేయని కొంతమంది వలంటీర్లు కూడా వచ్చినట్లు తెలిసింది. ఈ నెల 22న మార్కాపురం వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు నామినేషన్ వేయనున్న సందర్భంగా ఈ సమావేశం నిర్వహించి వలంటీర్లను కలుపుకొని వెళ్లి నామినేషన్ కార్యక్రమానికి ప్రజలను పెద్దఎత్తున తరలించే విధంగా చూడాలని కోరినట్లు సమాచారం. అంతేకాకుండా ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన వలంటీర్లకు భవిష్యత్‌లో మంచి గుర్తింపు ఉంటుందని నాయకులు చెప్పినట్లు ప్రచారం జరుగుతుంది.

టీడీపీతోనే బ్రాహ్మణుల సంక్షేమం

- తెలుగుదేశం కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 19: తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని టీడీపీ కూటమి ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులో బ్రాహ్మణ సేవాసమితి కార్యదర్శి గంజాం శ్రీరంగనాథ్, కార్యవర్గ సభ్యుడు ముక్తినూతలపాటి వాసులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని, తిరిగి రాబోయే ఎన్నికల తర్వాత చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పూర్వవైభవం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ నాయకులు మాట్లాడుతూ దామచర్ల గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు టీవీశ్రీరామమూర్తి, వ్యామజాల ప్రసన్నకుమార్‌శర్మ పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన తెలుగు తమ్ముళ్లు



దోర్నాల నుంచి వై.పాలెం తరలి వెళుతున్న కార్యకర్తలు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 19 : ఎర్రగొండపాలెం నియోజక వర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్‌బాబు శుక్రవారం నామినేషన్ వేస్తున్న క్రమంలో మండల నాయకులు భారీ సంఖ్యల్లో తరలివెళ్లారు. మండలం నుంచి అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు 36 వాహనాలు, 14 లారీలు, 20 కార్లలో సుమారు నాలుగు వేలమంది ఎర్రగొండపాలెం నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. తరలివెళ్లిన వారిలో టీడీపీ మండ ల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, షేక్ సమ్మద్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, కే శ్రీనివాసులు, ఎలకపాటి చెంచయ్య, షేక్ భాష, ఇస్మాయల్, కే.సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, నాగెళ్ల సత్యనారాయణ, మౌలాలి, రఫీ, జనసేన అధ్యక్షులు మురళి, గుర్రాల ప్రసాద్, గండి వీరారెడ్డి పాల్గొన్నారు.

త్రిపురాంతకం : ఎర్రగొండపాలెం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. మండల పార్టీ నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, ఎం.వలరాజు, డి.చలమయ్య, ఏ.నాసరరెడ్డి, ఎం.అల్లూరిరెడ్డి, కె.కొండలు, వి.వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు పి.సుబ్బారావు, ఏ.మల్లికార్జున ఆధ్వర్యంలో సుమారు వంద వాహనాలలో పెద్దఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు.

మార్కాపురానికి తొలి నామినేషన్ దాఖలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 19: మార్కాపురం నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పట్టణంలోని 27వ వార్డులో నివాసం ఉంటున్న పొట్టి సుబ్బారావు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, సబ్‌కలెక్టర్ రాహుల్ మీనాకు నామినేషన్ దాఖలు పత్రాలను అందజేశారు. ఈయన స్వగ్రామం మార్కాపురం మండలం బోడపాడు గ్రామం ఆర్యవైశ్య కులానికి చెందిన వ్యక్తి. గతంలో బీజేపీలో క్రియాశీలక కార్యకర్తగా, అధికార ప్రతినిధిగా పనిచేశాడు. గతంలో మార్కాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో 27 వార్డులో బీజేపీ అభ్యర్థిగా పోటీలో నిలిచి ఓటమి చెందారు.

ఐదు నామినేషన్లు దాఖలు

గిద్దలూరు : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి రెండవరోజు శుక్రవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ నెల 24న భారీ ఎత్తున ర్యాలీతో మరో సారి ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు. వైసీపీ అభ్యర్థిగా కుందురు నాగార్జున రెడ్డి, వైసీపీ డమ్మీ అభ్యర్థిగా ఆయన సతీమణి కుందురు కల్పన నామినేషన్లు దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా జవ్వాజి పవన్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థిగా మూఢావత్ లక్ష్మీరామనాయక్ శుక్రవారం ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం ఒక నామినేషన్ దాఖలు కాగా శుక్రవారం 5 నామినేషన్లతో కలిపి మొత్తం 6 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి తెలిపారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న సుబ్బారావు

వడదెబ్బకు వ్యక్తి మృతి

పుల్లలచెరువు, ఏప్రిల్ 19 : వడదెబ్బకు వ్యక్తి మృతిచెందిన ఘటన ఎర్రగొండపాలెంలో శుక్రవారం చోటుచేసుకొంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని గంగవరం ఎస్సీపాలేనికి చెందిన కందుల చిన్న బూసి(30) వైపాలెం టీడీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి వచ్చారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో సొమ్మసిల్లి పడిపోయాడు. వారితో పాటు వచ్చిన వారు గమనించకపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్థులు ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న వై.పాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు మృతుదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బూసికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

టీడీపీలో బీసీ కుటుంబాల చేరిక



టీడీపీలో చేరిన కుటుంబాలు

కంభం, ఏప్రిల్ 19 : అర్ధవీడు మండలం నాగులవరానికి చెందిన 100 బీసీ కుటుంబాలు గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి కుమారుడు ముత్తుముల దివ్యేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. దివ్యేష్‌రెడ్డి వారందరికీ పార్టీ కుండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలని, ప్రజల్లో నమ్మకం కలిగిందని, అందువల్లనే గిద్దలూరులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు నిర్ణయించుకునట్లు దివ్యేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అర్ధవీడు మండలం టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాగుంటకు మార్కాపురంలో ఘనస్వాగతం

కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురంలో బైక్ ర్యాలీ

మార్కాపురం, ఏప్రిల్ 19: ఒంగోలు ఎంపీ, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డికి మార్కాపురంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. ఎర్రగొండపాలెం అసెంబ్లీ అభ్యర్థిగా గూడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మాగుంట శ్రీనివాసరెడ్డి మార్కాపురం వచ్చారు. జాతీయ రహదారి వద్ద ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కూడలి వద్ద మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. సుమారు 1000కి పైగా కూటమి కార్యకర్తలు మోటార్ సైకిళ్లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తూర్పు వీధి టీడీపీ నాయకులు మాగుంటను గజమాలతో సత్కరించారు. పట్టణంలో కళాశాలరోడ్డు, నాయుడువీధి, రథంబజారు, మెయిన్ బజార్ మీదుగా టీడీపీ కార్యాలయం ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి ఆధ్వర్యంలో మోటర్‌సైకిల్ ర్యాలీ విజయవంతమైంది.



మాట్లాడుతున్న మాగుంట శ్రీనివాసులరెడ్డి

మార్కాపురం : జిల్లాలో వెనుకబడిన మార్కాపురం ప్రాంత అభివృద్ధికి హితోధికంగా కృషి చేస్తానని ఎంపీ, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మార్కాపురం పట్టణ, మండల టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి కరువును పాలదోలతామన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూలమార్పులు తీసుకువచ్చి ఐటీ రంగ అభివృద్ధికి తోడ్పడింది చంద్రబాబునాయుడేనన్న విషయాన్ని గుర్తు చేశారు. ఏపీని అభివృద్ధి, సంక్షేమ రంగాలలో ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాడికే దక్కుతుందన్నారు. మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతు మాగుంట కుటుంబ సేవానిరతితో గతంలో మార్కాపురం ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.వి.శివారెడ్డి, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.కృష్ణారావు, జనసేన నాయకులు ఎస్‌వి.సురేష్, సయ్యద్ జావిద్, తదితరులు పాల్గొన్నారు.



మోటారు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న తెలుగుయువత

ఉగ్ర నామినేషన్‌ను విజయవంతం చేయాలి

పామూరు, ఏప్రిల్ 19: కూటమి అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి ఈనెల 24న నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. నామినేషన్, ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలుఅంశాలపై చర్చించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఇరిగినేని రవీంద్ర, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, గుర్రం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, సర్పంచ్ దారపనేని కొండబాబు, సయ్యద్ అమీర్‌బాబు, దేవరపు మాల్యాద్రి, మన్నం రమణయ్య పాల్గొన్నారు.

పీసీపల్లి: కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఈనెల 24న నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య తెలిపారు. మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కనిగిరికి తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 9గంటలకు కనిగిరిలో అమరావతి గ్రౌండ్ నుంచి భారీ ర్యాలీతో ఉగ్రనరసింహారెడ్డి నామినేషన్ వేసేందుకు బయలుదేరతారని ఆయన తెలిపారు.

వెలిగండ్ల: కూటమి అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ సీనియర్ నాయకుడు శ్యామల కాశిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలస్థాయి నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24న కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున్న కార్యకర్తలు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్.కాశిరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, చిలకల వెంకటేశ్వర్లు, ఒంగోలు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర నామినేషన్‌కు భారీగా జన సమీకరణ చేయాలి

పామూరు, ఏప్రిల్ 19: కనిగిరిలో ఈనెల24న జరిగే కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పామూరు మండలం నుంచి జనసమీకరణకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శేషమహల్ సినీ థియేటర్ ప్రాంగణంలో కూటమి నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమంలోనే కూటమి సత్తా చాటాలని సూచించారు. సమావేశంలో భైరెడ్డి జయరామిరెడ్డి, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, డీవీ మనోహార్, కేవీ రమణయ్య, దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయాన్ని నిరంతరం పరిశీలించాలి


ఎన్నికల వ్యయ నియంత్రణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు విశ్వాస్

దర్శి, ఏప్రిల్ 19: ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు పెట్టే ఖర్చులను నిరంతరం గమనిస్తూ ఎప్పటికప్పుడు వివరాలు అందించాలని దర్శి అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిశీలకుడు దుకే విశ్వాస్ సూచించారు. దర్శిలో శుక్రవారం ఎన్నికల వ్యయ పర్యవేక్షకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చుచేసే సందర్భాలు ఉంటే వెంటనే తెలపాలని ఆదేశించారు. నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియ జరిగేలా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పామూరు, ఏప్రిల్ 19: అక్రమంగా మద్యం అమ్ముతుండగా ఏఆర్‌వో, తహసీల్దార్ షాకీర్‌పాష గురువారం రాత్రి దాడి చేసి క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాజాగారికోష్టాలు స్టేజివద్ద కొండయ్య అనే వ్యక్తి దుకాణంలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారంతో తనిఖీ చేశారు. 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

లాడ్జిలో రూ.లక్షా 35వేల నగదు స్వాధీనం

పామూరు, ఏప్రిల్ 19: పట్టణంలోని నెల్లూరు రోడ్డులోగల ఓ లాడ్జిలో ఎటువంటి బిల్లులు లేకుండా ఓవ్యక్తి అక్రమంగా రూ.లక్షా 35వేల నగదు కలిగిఉన్నాడు. సమాచారం అందుకొన్న సీఐ ఎం.రామానాయక్, ఎస్ఐ సైదుబాబులు ఎన్నికల నేపథ్యంలో తన సిబ్బందితో కలిసి తనిఖీ చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కురిచేడు, ఏప్రిల్ 19: కురిచేడు- దర్శి రోడ్డులో 3వ కిలోమీటరు రాయి సమీపంలో గుంటూరు జిల్లా తక్కెళ్లపాడుకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం తక్కెళ్లపాడు నుంచి ద్విచక్రవాహనంపై కురిచేడు మీదుగా దర్శికి వెళుతున్నాడు. 3వ కిలోమీటరు రాయి సమపంలో వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. ఆ దారిన వెళ్ళేవారు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అతడికి ప్రాథమిక చికిత్స చేసి దర్శి సీహెచ్‌సీ వైద్యశాలలో చేర్పించారు. ప్రాణాపాయం లేదని తెలిసింది.

మద్యం సేవించి వ్యక్తి మృతి

కనిగిరి, ఏప్రిల్ 19: మద్యం సేవించి మండలంలోని సుల్తాన్‌పురంకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన లక్కిరెడ్డి పెద అంజయ్య(56) గురువారం రాత్రి మద్యం సేవించేందుకు మాచవరం వచ్చాడు. పూటుగా మద్యం సేవించి స్వగ్రామానికి వెళుతూ మార్గమధ్యంలో రోడ్డుపక్కన పడిపోయాడు. పామూరు సీఐ రామానాయక్ కనిగిరి నుంచి పామూరు వెళ్తుండగా రోడ్డుపై పడి ఉన్న అంజయ్యను చూసి వెంటనే తన కారులో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య చికిత్స అందిస్తుండగా గుండెపోటు రావటంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీలో చేరిన దొనకొండ వాసులు

దొనకొండ, ఏప్రిల్ 19: దొనకొండకు చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులు టీడీపీ నాయకుడు వీరపనేని వెంకటన్నచౌదరి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మాదాల కనకరాజు, బత్తుల నారాయణ, మారబోయిన అనంతలక్ష్మి, మరికొందరికి టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్ పార్టీ కండవాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుందని, గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, టీడీపీ నాయకులు బత్తుల గాలయ్య, వల్లపునేని ఆదినారాయణ, విప్పర్ల శేషు, తదిత రులు పాల్గొన్నారు.

దారంవారిపాలెంలో 15 కుటుంబాలు..

తాళ్లూరు, ఏప్రిల్ 19: మండలంలోని దారంవారిపాలెంలో వైసీపీకి చెందిన 15 కుటుంబాలు దారం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. శుక్రవారం దర్శిలోని టీడీపీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి లక్ష్మి భర్త లలిత్‌సాగర్ సమక్షంలో పార్టీలో చేరారు. వైసీపీని వీడిన మంచాల గిరి, దారం వెంకటేశ్వరరెడ్డి, పాలెం రత్నారెడ్డి, రావులపల్లిరాజా, పేరం బలరామిరెడ్డిలకు చెందిన 15 కుటుంబాలను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధ మహోత్సవ వేడుకలు


దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

పామూరు, ఏప్రిల్ 19: పామూరు మేజర్ పంచాయతి గోపాలపురం గ్రామంలో వెలసియున్న శ్రీహజరత్ సయ్యద్ కరీముల్లాషా ఖాదిరీ(ఉరఫ్) కాలేషా పీర్ మస్తాన్ వలి రహంతుల్లా అల్లాహీ దర్గా గంధమహోత్సవం 58వ (ఉరుసు) వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. దర్గాలో స్వామి వారి డేర్ వద్ద చాదర్‌లను భక్తులు సమర్పించుకొని మొక్కుబడులు చెల్లించుకొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దర్గా ప్రధాన ముతవల్లి పొదిలి షేక్ గౌస్‌బాష, కస్మూర్ దర్గా ముజావర్లు సయ్యద్ కరిముల్లా, సల్మామస్తాన్, హనీఫ్, దర్గా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

- కూటమి అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి
- హెచ్‌ఎంపాడు మండలంలో ఇంటింటి ప్రచారం


హెచ్‌ఎంపాడు మండలం చినగొల్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 19: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. హనుమంతునిపాడు మండలం చినగొల్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఇంటింటి ప్ర చారం చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర ప్రతి ఇంటిని సందర్శిస్తూ గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దటితో పాటు రోడ్లు బాగాలేకపోవటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు డాక్టర్ ఉగ్ర దృష్టికి తీసుకువచ్చారు. పక్కా ప్రణాళిక ద్వారా గెలిచిన అనతి కాలంలోనే నీటి సమస్యను పరిష్కరించటంతో పాటు రోడ్లను వేయించి రవాణా ఇబ్బందులను తొలగిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా చంద్రబాబు ప్రజలకు మెరుగైన పాలన అందించనున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో నిత్యావసర ధరలతో పాటు గ్యాస్, ఆయిల్ రేట్లు విపరీతంగా పెంచి ప్రజలకు నరకం చూపించారని ఉగ్ర విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వైసీపీ నేతలు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు మళ్ళీ వస్తున్నారని అన్నారు. ప్రజలకు ఏమి అభివృద్ధి చేశారో వైసీపీ నేతలను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ హనుమంతునిపాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), గాయం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, తాతపూడి స్టాలిన్(బుజ్జి), తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం.. విజయం మనదే!

వెలిగండ్ల, ఏప్రిల్ 19: కనిగిరి నియోజకవర్గంలో నాయకులు. కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి, టీడీపీ జెండా ఎగరేయాలని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని మరపగుంట్ల పంచాయతీకి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి శుక్రవారం ఉగ్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు వారికి పార్టీ


వైసీపీ నుంచి టీడీపీ చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఉగ్ర

కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళగా నాతోపాటు నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని చెప్పారు. వారిని ఎప్పటికీ మరిచిపోనని చెప్పారు. కొత్తాపాత తేడా లేకుండా మనమంతా టీడీపీ కుటుంబసభ్యులమేనని అన్నారు. మరో 25 రోజులు కష్టపడండి.. కచ్చితంగా అధికారాన్ని చేజిక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు కార్యక్రమంలో శ్యామల కాశీరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, చిలకల వెంకటేశ్వర్లు, ఒంగోలు శ్రీను, కొండు భాస్కర్ రెడ్డి, కర్నాటి భాస్కర్‌రెడ్డి, మీనిగ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచవరంలో ఇంటింటి ప్రచారం

కనిగిరి, ఏప్రిల్ 19: కనిగిరి ప్రాంత ప్రజల భవిష్యత్తు తరాలకు భరోసా ఉగ్రతోనే సాధ్యమని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని మాచవరం గ్రామంలో శుక్రవారం రాత్రి భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో నెలకొన్న మంచినీటి, తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం జరగాలంటే ఉగ్ర లాంటి సమర్థుడైన నాయకుడిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు సూరసాని హజరత్‌రెడ్డి, కార్యదర్శి కుడుముల షడ్రక్, రామయ్య, ఒంటిపెంట శ్రీనివాసులురెడ్డి, చీమలదిన్నె చినవెంకటసుబ్బయ్య, ముప్పారపు మార్కు, తదితరులు పాల్గొన్నారు.


పీసీపల్లి: మురుగుమ్మిలో ప్రచారం చేస్తున్న జయసింహ

తండ్రి కోసం తనయుడు..

పీసీపల్లి, ఏప్రిల్ 19: కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తనయుడు జయసింహారెడ్డి శుక్రవారం పీసీపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మురుగుమ్మి, జంగాలపల్లి గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను పలకరిస్తూ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న ఉగ్ర నరసింహారెడ్డికి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, వడ్డెంపూడి వెంకట్ (చిన్నా), బీసీ సెల్ కార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాగా, పెదఅలవలపాడు, పీసీపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పువ్వాడి నాగరాజు, వీరపనేని పెద్దన్న ఆధ్వర్యంలో మారెళ్ల, గోపవరపువారిపల్లి, బుడ్డారెడ్డిపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'దర్శి' అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తా!

- కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి


దర్శి మండలం కట్టసింగన్నపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి

దర్శి, ఏప్రిల్ 19 : దర్శి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెప్పారు. మండలంలోని కట్టసింగన్నపాలెం, గంగపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాల్లో పెద్దఎత్తున ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి పూలవర్షం కురిపించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మీరు చూపుతున్న ఆదరణ మరువలేనిదన్నారు. మీ ఇంటి ఆడపడుచుగా ఎంతో ఆప్యాయంగా చూస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దర్శిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

దర్శి, ఏప్రిల్ 19: దర్శి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో బండివెలిగండ్ల


కూటమి అభ్యర్థి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో టీడీపీలో చేరిన చిన్నఉయ్యాలవాడ గ్రామస్థులు

సర్పంచ్ వర్నె రమణమ్మ, ఆమె కుమారుడు కాశి తదితరులు టీడీపీలో చేరారు. అంతకుముందు మండలంలోని చిన్నఉయ్యాలవాడ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. టీడీపీ పాలనలోనే న్యాయం జరుతుందనే విశ్వాసంతో భారీగా పార్టీలోకి చేరుతున్నారని చెప్పారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా న్యాయం చేస్తామన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు రూపినేని వెంకటరావు, సాధం వెంకటేశ్వర్లు, రూపినేని రామారావు, పోలంరెడ్డి వీరనాగిరెడ్డి, అంబటి గోవిందరెడ్డి, కుమ్మల రోశయ్య, తోటా కేటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీటీసీ, పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

దర్శి, ఏప్రిల్ 19: టీడీపీలోకి చేరికలు ఉధృతమవుతున్నాయి. మండలంలోని వైసీపీ చందలూరు ఎంపీటీసీ అంధం సత్యనారాయణ, ఆయన సోదరుడు సత్యం, నాయకులు సెట్టినేని సత్యనారాయణ, సెట్టినేని శ్రీనివాసరావులు టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో శుక్రవారం సాయంత్రం టీడీపీలో చేరారు. అలాగే, దేవవరం పంచాయతీలోని శేషంవారిపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.


కురిచేడు: పడమరవీరాయపాలెం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

వలసలు జోరు పెరుగుతుండటంతో టీడీపీ క్యాడర్‌లో రోజురోజుకు జోష్ పెరుగుతుంది

సమస్యల పరిష్కారానికి కృషి

కురిచేడు, ఏప్రిల్ 19: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పడమర వీరాయపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ఆమెకు నీరాజనాలు పట్టారు. బీసీ కాలనీ, వెంగాయపాలెం గ్రామాలలో ప్రచారం నిర్వహించి పడమర వీరాయపాలెం గ్రామం వెళ్ళడానికి ఆమెకు ఎక్కువ సమయం పట్టింది. ప్రజలు ఎక్కడికక్కడ ఆపి ఆమెతో మమేకమవుతుండటంతో ప్రచారం ఆలస్యం అవుతున్నది. ఏ గ్రామానికి వెళ్ళినా అక్కడి సమస్యలు ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. పడమర వీరాయపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, పమిడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

40 కుటుంబాలు టీడీపీలో చేరిక

కురిచేడు, ఏప్రిల్ 19: కురిచేడు మండలం బయ్యవరం, పెద్దవరం, పడమర గంగవరం గ్రామాలకు చెందిన 40 కుటుంబాలు శుక్రవారం టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య,బొల్లేపల్లి ఆదినారాయణ, అడుసుమల్లి పెద్దసాంబయ్య తదితరులు ఉన్నారు.

కూటమి అభ్యర్థి లక్ష్మి తరపున నామినేషన్ దాఖలు


కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి, ఏప్రిల్ 19: టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తరపున దర్శి అసెంబ్లీకి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. దర్శి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. మంచి ముహూర్తం అనే ఉద్దేశంతో ఈరోజు సాదాసీదాగా నామినేషన్ వేశారు. ఈనెల 22న నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ ర్యాలీతో అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మరో నామినేసన్ దాఖలు చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, సంగా తిరుపతిరావు, వీరపనేని రంగ, ముప్పరాజు రవీంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దొనకొండ, ఏప్రిల్ 19: మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగూర్‌వలి తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో సాంకేతిక మరమ్మతులతో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని ఏఈ కోరారు.

మరమ్మతులకు నోచుకోని బోర్లు

- పట్టించుకోని పాలకులు
- పామూరు వాసులకు తప్పని నీటి కష్టాలు


మరమ్మతులకు గురైన చేతి పంపులు

పామూరు, ఏప్రిల్ 19: పట్టణంలో చేతి పంపులు మరమ్మతులకు గురై సంవత్సరాలు గడుస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడంలేదు. పట్టణంలో రోజురోజుకు నీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి. ఏర్రచేలు, ఎస్టీవో కాలనీ, పేట వీధి ప్రాంతాల్లో ఐదు రోజులకొకసారి పంచాయతి కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు బోర్లలో నీటి మట్టం బాగానే ఉంది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో బోర్లలో నీటి మట్టం తగ్గడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడంలేదు. వేసవి కాలంలో నీటి వాడకం అధికంగా ఉంటుంది. కుళాయిల ద్వారా నీటి సరఫరా లేనప్పుడు చేతి పంపులు వాడుకొందామంటే, అవి మరమ్మతులకు గురయ్యాయి. ప్రధానంగా ఆకులవీధిలోని దర్వాజాగల్లీలో ఉన్న ఏకైక చేతి పంపు మరమ్మతులకు గురై సంవత్సరాలు గడుస్తున్నది. సుమారుగా 25 కుటుంబాలవారు బోరు అందుబాటులో లేకపోవడంతో నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. అలాగే, పట్టణంలోని పలు ప్రాంతాల్లోనూ చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వరుస చేరికలతో టీడీపీలో జోష్

- పామూరు మండలంలో మారుతున్న రాజకీయ సమీకరణలు


టీడీపీలో చేరిన ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ అనుచరులు

పామూరు, ఏప్రిల్ 19: పామూరు మండలంలో రోజురోజుకు రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి, అధికార వైసీపీ నాయకుల తీరు నచ్చక పలు సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలకే కుటుంబాలు టీడీపీలోకి వలసలు వస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే మూడువందల కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. మండలంలో టీడీపీలో చేరికలు బొట్లగూడూరు పంచాయతిలో ప్రారంభం కాగా, నుచ్చుపొద, తిరగలదిన్నె, తూర్పు కోడిగుడ్లపాడు, బుక్కాపురం, వగ్గంపల్లి, తూర్పుకట్టకిందపల్లి, కోడిగుంపల, మోపాడు, ఇనిమెర్ల, లక్ష్మీనరసాపురం, బోడవాడ, అయ్యన్నకోట, గోపాలపురం, చింతలపాలెం, రావిగుంటపల్లి, దాదిరెడ్డిపల్లి గ్రామాల్లో పలు సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలు టీడీపీలో చేరారు. పామూరు పట్టణంలో అంకాళమ్మవీధి వడ్డెపాలెంలో 50 కుటుంబాలు, వైసీపీని వీడి టీడీపీలో చేరారు. చేరికలతో టీడీపీలో జోష్ పెరడటంతో నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంలో ఉండగా, వైసీపీ శ్రేణులు నిరాశలో ఉన్నారు. ఉగ్ర ఇస్తున్న భరోసాతో వైసీపీకి చెందిన తాజా మాజా ప్రజాప్రతినిధులు పార్టీని వీడుతూ టీడీపీలో చేరుతున్నారు.

ఇప్పటివరకు టీడీపీలో చేరిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్, దరిశిరాము, పామూరు మాజీ సర్పంచ్ డీవీ మనోహార్, పట్టణానికి చెందిన 2వ ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, 5వ ఎంపీటీసీ సభ్యుడు షేక్ నాసర్‌బి తదితరులు ఉన్నారు. అలాగే, దాదిరెడ్డిపల్లి, తూర్పుకోడిగుడ్లపాడు సర్పంచ్‌లు, బద్దిపూడి శారమ్మ, దారపనేని కొండబాబు, నుచ్చుపొద ఉప సర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, తూర్పుకోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్ మానం గురవయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ చెనికల మాలకొండయ్య, పామూరు పంచాయతికి చెందిన వార్డు మెంబర్లు షేక్ నాయబ్‌రసూల్, పిడుగు శ్రీనివాసులు తదితరులు ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. రేపో మాపో మరికొందరు ప్రజాప్రతినిధులు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.





నేనేమిటో.. ప్రజలకు తెలుసు

నేనేమిటో ప్రజలకు తెలుసు.. నా జీవితం తెరిచిన పుస్తకం. సామాన్య కుటుంబం నుంచి 20 ఏళ్లు కష్ట పడి ఈ స్థాయికి ఎదిగా. పదేళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. నేను చేసిన అభివృద్ధి, అమలు చేసిన సం క్షేమ పథకాలు కళ్ల ముందు కనిపిస్తున్నాయి. ఓటమి భయంతో అధికార వైసీపీ వాళ్లు రాయించే పిచ్చి రాతలు, ప్రేలాపనలకు భయపడేది లేదు... అని పర్చూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. శుక్ర వారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఇటీవల సీఎం జగన్ పత్రికలో వస్తున్న కథనాలు, వైసీపీ నాయకుల ఆరోపణలపై తీవ్రస్థాయి లో మండిపడ్డారు. సోమవారం మరోసారి నామి నేషన్ వేస్తానని తెలిపారు. వివిధ అంశాలపై సమాధా నాలు ఆయన మాటల్లోనే.. (ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

- నా ఎదుగుదలలో 20 ఏళ్ల కష్టం ఉంది
- ఆస్తులు కరిగిపోతున్నా ప్రజల ఆదరణతోనే సంతృప్తి
- ఓటమి భయంతో వైపీపీ నేతల అసత్య ప్రచారాలు

ఆంధ్రజ్యోతితో పర్చూరు టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

* సామాన్య కుటుంబం నుంచి..

సామాన్య కుటుంబం నుంచి వచ్చాను. 20 ఏళ్లు కష్టపడి పారిశ్రామికంగా పురోగతితో ఎదిగాను. తెలుగుదేశం పార్టీపై ఆసక్తి, చంద్రబాబుపై ఆరాధనతో ప్రత్యేక పరిస్థితుల్లో రాజకీయ అరంగేట్రం చేశాను. నిజాయితీతో పారిశ్రామిక రంగం ద్వారా సంపాదించి ఇష్టంగా కొనుక్కున్న వందల ఎకరాల భూములను అమ్మి రాజకీయం చేశాను. అంతే తప్ప అవినీతి, అక్రమాలు, అరాచకాలకు పాల్పడలేదు. ఈ విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన క్లిష్ట పరిస్థితుల్లో కూడా తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి పనులను సాధించా. అభివృద్ధిలో పర్చూరును ముందు వరుసకు తీసుకెళ్లాను.

* జగన్ ప్రభుత్వం అన్యాయం

జగన్ ప్రభుత్వం వచ్చి అమరావతి రాజధానిని దెబ్బతీసింది. రాజధాని సమీపంలో ఉన్న పర్చూరు నియోజకవర్గానికి తీరని అన్యాయం చేసింది. ఉద్యోగావకాశాలు కోల్పోయిన విద్యార్థులు కూలీపనులు చేసుకుంటుంటే కళ్లు చమర్చుతున్నాయి. గుంటూరు చానల్ పొడిగింపునకు తాను శ్రీకారం చుడితే ఈ ప్రభుత్వం తుంగలో తొక్కి పర్చూరు, యద్దనపూడి మండలాలకు తీరని అన్యాయం చేసింది. సాగర్ కాల్వ కింద ఉన్న 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు 100 కోట్లతో కాల్వల ఆధునికీకరణ టీడీపీ ప్రభుత్వంలో సాధిస్తే ఈ ప్రభుత్వం కనీసం కాల్వల మరమ్మతులు కూడా చేయక రైతులకు అన్యాయం చేసింది. గ్రానైట్ పరిశ్రమను డబ్బులు పిండు కోవడానికి వినియోగించుకున్నారు తప్ప దానిని నిలబెట్టే ప్రయత్నం చేయలేదు.

అరాచకాలు.. అసత్య ప్రచారాలు

అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లాను. ఈ ఐదేళ్ల ప్రభుత్వం సహకరించకపోయినా సొంత నిధులు, సేవా కార్యక్రమాలతో ప్రజలకు, పార్టీ శ్రేణులకు అండగా నిలిచాను. ప్రజలకు, నాయకులకు దగ్గరై నియోజకవర్గంలో సుస్థిరస్థానం సంపాదించుకున్నాను. ఓటమి భయంతో వైసీపీ నాయకులు ప్రశాంతమైన పల్లెల్లో అరాచకాలు సృష్టించారు. వీటిని కప్పి పుచ్చుకునేందుకు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు.

* దొంగ ఓట్లపై పోరాడాను

నియోజకవర్గంలో దొంగ ఓట్ల పేరుతో ఓట్ల తొలగింపు చర్యకు పాల్పడితే పోరాడాను. 23 వేల ఫారం 7లను పెట్టించేందుకు కొందరు అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాశారు. న్యాయ పోరాటంతో ఓటర్లకు న్యాయంజరిగే విధంగా పాటుపడ్డాను. ఆయా తప్పిదాలు చేసిన అధికారులను భవిష్యత్తులో వదిలేదు లేదు. నాపై ఒకటి కాదు ఏడు కేసులు పెట్టారు. అన్నీ బోగస్ కేసులు కావడంతో చట్టం అండగా నిలి చింది.

* అభివృద్ధిపై ప్రణాళిక..

నియోజకవర్గ అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళిక ఉంది. చినగంజాం మండలంలో 5 వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమను సాధించి తీరుతా. ఇంకొల్లులో ఆటోనగర్ ఏర్పాటు చేస్తా. రానున్న ఐదేళ్లల్లో ఇంటింటికి తాగునీటి కొళాయిల ఏర్పాటు పథకాన్ని పూర్తి చేసి తీరుతా. రోడ్ల అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రైతులకు గిట్టుబాటు ధరలకు సంబంధించి నిర్దిష్ట ప్రణాళిక ఉంది. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి పేదలకు అందిస్తా. గత పదేళ్లుగా నియోజకవర్గంలో తండ్రి పేరుతో ట్రస్టు ద్వారా చేస్తున్న వైద్య సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాను. నియోజకవర్గంను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాను.

* సమస్యలు లేకుండా సమన్వయం

వైసీపీ, ఇతర పార్టీల నుంచి వస్తున్న వారిని టీడీపీలో చేర్చుకోవడం ద్వారా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సమన్వయం చేస్తా. గతం నుంచి పార్టీకి కష్టపడుతున్న వారిని, కొత్తగా చేరిన వారికి మధ్య ఇబ్బందులు రాకుండా చూసే శక్తి నాకుంది. ఈ విషయంలో ఏదో జరుగుతుందని భ్రమిస్తే పప్పులో కాలేసినట్టే.



టీడీపీ కూటమి అభ్యర్థులుగా బాపట్ల లోక్‌సభ స్థానానికి తెన్నేటి కృష్ణప్రసాద్, అసెంబ్లీ స్థానానికి వేగేశన నరేంద్రవర్మ తరపున ఆయన సతీమణి హరికుమారి శుక్రవారం మొదటిసెట్ నామినేషన్లను దాఖలు చేశారు. అంతకముందు వీరు పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. - బాపట్ల



దగా మామ!

- తలనూనె, సబ్బులకు డబ్బులు ఇవ్వలేదు..
- వసతి గృహాల విద్యార్థులకు చెల్లించని కాస్మోటిక్ ఛార్జీలు
- నాలుగు రోజుల్లో వసతి గృహాలకు సెలవులు
- ఈ లోగా పిల్లలకు డబ్బు చెల్లించేనా?



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు కాస్త సంక్షామ గృహాలుగా మారిపోయాయి. గిరిజన, బీసీ, ఎస్సీ గృహాల్లోని విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండేది అధికంగా పేద పిల్లలు. తాము పడుతున్న కష్టం తమ పిల్లలకు ఉండకూడదన్న ఉద్దేశంతో కిలోమీటర్ల మేర దూరంతో ఉన్న వసతి గృహాలకు పంపుతుంటారు. ఉచిత వసతి, భోజనంతో పాటు, ఇతరత్రా చేతి ఖర్చులకు ప్రభుత్వమే డబ్బులు ఇస్తుందని భావించి చేర్పిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయి. ప్రభుత్వం మాత్రం నెలవారీ కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటి నుంచి డబ్బు తెచ్చుకోవాల్సిన దుస్థితి. నాలుగు రోజుల్లో వసతి గృహాలకు సెలవులు కూడా ఇవ్వనున్నారు. ఈ లోగానైనా పిల్లల డబ్బు చెల్లింస్తారో లేదో?

వసతి గృహాలల్లోని విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాలి. 7 నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తలనూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంటుంది. అన్ని తరగతులకు చెందిన బాలురకు రూ.30 చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా ఇవ్వాలి. విద్యార్థుల బ్యాంకు ఖాతాలకే నేరుగా కాస్మోటిక్ ఛార్జీలను జమచేయాలి. జూన్ నెలలో వసతి గృహాలు ప్రారంభమైతే రెండు నెలలకు సదరు ఛార్జీలు చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తొమ్మిది నెలలుగా కాస్మోటిక్ ఛార్జీల ఊసేలేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి తమ అవసరాల నిమిత్తం డబ్బులు తెచ్చుకుంటున్నారు. ఇది వారి తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోని విద్యార్థులకు నెలలు తరబడి కాస్మోటిక్ ఛార్జీలు విడుదల కావాల్సి ఉంది. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఆశ్ర యిస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల బాలికలకు కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వడం లేదు. 2019 వరకు కాస్మోటిక్ కిట్‌లను బాలికలకు పంపిణీ చేశారు. ఐదేళ్లుగా కాస్మోటిక్ కిట్‌ల పంపిణీని ప్రభుత్వం నిలిపి వేయడం గమనార్హం.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

గుంటూరు ఛానల్‌కు.. గ్రహణం



పర్చూరుకు పొగిడించాల్సిన గుంటూరు ఛానల్

- ఛానల్ పొడిగింపుపై నెరవేరని జగన్ హామీ
- రివర్స్ టెండర్.. ఐదేళ్లుగా సర్వేల పేరుతో సరి
- సాగు, తాగునీటి అవస్థల్లో పర్చూరువాసులు

రివర్స్ టెండర్‌తో ముంచారు..

ప్రజలకు తాగునీటితో పాటు, సాగు నీటిని అందించేందుకు దోహద పడే గుంటూరు ఛానల్ పొడిగింపునకు వైసీపీ రివర్స్ టెండర్ పేరుతో నిలుపుదల చేసింది. రీ సర్వే పేరుతో కాలయాపన చేయడం వల్లే సాగు, తాగునీటి కోసం ప్రజలు అగచాట్లు పడాల్సి వస్తుంది. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే రైతులతోపాటు, గ్రామస్తులకు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేది.

- కాకాని వీరయ్య, పర్చూరు రైతు

పర్చూరు, ఏప్రిల్ 19: గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో, ముఖ్యమంత్రి అయిన తర్వాత వైసీపీ అధినేత జగన్ గుంటూరు ఛానల్ అభివృద్ధి, పొడిగింపుపై ఎన్నో హామీలు ఇచ్చారు. దీంతో గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న రైతులు తమ కల నెరవేరిందని ఆశించారు. అయితే ముఖ్యమంత్రి జగన్ రివర్స్ టెండరింగ్ విధానాలు వారి ఆశలను వమ్ము చేసింది. జగన్ ప్రభుత్వ రివర్స్ టెండర్ నిర్ణయంతో గుంటూరు ఛానల్‌కు గ్రహణం పట్టింది. ఐదేళ్లుగా సర్వేలతో అదిగో ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ పర్చూరు, కాకుమాను, పెదనందిపాడు సభల్లో గుంటూరు ఛానల్‌ను పొడిగిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత 2022 జనవరి 1న ప్రత్తిపాడులో జరిగిన బహిరంగ సభలో మరోమారి వాగ్దానం చేశారు. జగన్ తన పదవీ కాలంలో 99 శాతం హామీలను అమలు చేశామని ప్రచారం చేస్తున్నారు. అయితే గుంటూరు ఛానల్ పొడిగింపు విషయంలో మడమ తిప్పారని, దీనినిబట్టి మిగతా హామీలు ఎక్కడ నెరవేర్చారో అర్థమవుతుందని పలువురు విమర్శిస్తున్నారు. వైసీపీ హయాంలో గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొగింపు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే 50 గ్రామాల ప్రజలకు తాగునీటితోపాటు సాగు నీరు అందే అవకాశం ఉన్నా పాలకులకు పట్టడం లేదు. రైతు సంఘం పోరాటాలతో గత టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేలా ప్రభుత్వం నిధులను కూడా కేటాయించింది. తదుపరి అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఛానల్ పొడిగింపు అదిగోఇదిగో అంటూ కాలయాపన చేసింది. వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసినా నేటికీ ఛానల్ పొడిగింపునకు నోచుకోలేదు. కేవలం సర్వేల పేరుతో సరిపెట్టిందని రైతులు, రైతు సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఏటేటా తాగు, సాగు నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుతం తాగునీటి కోసం సాగర్ నీటిని విడుదల చేసిన పర్చూరు ఆయకట్టు చివర ఉండడంతో చెరువులకు నీరు సక్రమంగా చేరుతున్న దాఖలాలు లేవు. దీంతో తాగునీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఆరు తడులు అందక మిర్చి, వైట్ బర్లీ పొగాకు పంటలను వేల ఎకరాల్లో సాగు చేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలను కాపాడుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా వేలకు వేలు చెల్లించి మరీ నీరు అందించారు. దీంతో సాగు కోసం అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. అదే గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొగిస్తే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని ప్రజలు అంటున్నారు.



ఛానల్ పొడిగింపు కోసం డాక్టర్ రాజ మోహన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రైతుల నిరాహార దీక్ష (ఫైల్ ఫోటో)



శింగరకొండ ఆలయంలో పూజలు చేస్తున్న గొట్టిపాటి రవికుమార్ దంపతులు

అద్దంకి పసుపు మయం

- ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటి నామినేషన్
- భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



శ్రేణులతో నడిచివస్తున్న రవికుమార్

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19: టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా ఆయన నామినేషన్లను సమర్పించారు. పట్టణంలోని భవానీ సెంటర్ నుంచి ర్యాలీ ఆర్వో కార్యాలయం వరకు సాగింది. దీంతో పట్టణం మొత్తం పసుపుమయంగా మారింది. ఎండను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కూటమి శ్రేణులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువత తరలి వచ్చింది. గొట్టిపాటి ర్యాలీతో పట్టణం జనసంద్రంగా మారింది. వారి నినాదాలతో దద్దరిల్లింది. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి చిలకలూరిపేటలోని శివాలయం, యద్దనపూడి వేణుగోపాలస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం శింగరకొండలోని లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి, వేయి స్తంభాల గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భవానీ సెంటర్ నుంచి ప్రధాన రహదారి, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్ మీదగా అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వరకు గొట్టిపాటి పాదయాత్ర చేశారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్వో టీపీ సునీల్‌కు గొట్టిపాటి రవికుమార్, సతీమణి ఝాన్సీ, న్యాయవాదులు నాదెండ్ల దశరథరామయ్య, గొట్టిపాటి శ్రీనివాసరావులతో కలిసి నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. ర్యాలీలో గొట్టిపాటి తనయులు హర్షవర్ధన్, మహేష్ బాబు, సోదరుడి కుమారుడు కమల్‌కిశోర్(బాబీ) పాల్గొన్నారు.



ఆర్వోకు నామినేషన్‌ను అందజేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్

గొట్టిపాటి నామినేషన్ అదుర్స్

» అద్దంకికి తరలిన తమ్ముళ్లు
» కార్లు, ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ
» జై రవికుమార్ అంటూ నినదించిన యువత
» ఆలయాల్లో దంపతుల పూజలు



మార్టూరులో పూజలు చేస్తున్న గొట్టిపాటి

సంతమాగులూరు, పంగులూరు నుంచి తరలివెళ్తున్న కూటమి శ్రేణులు



మార్టూరు, ఏప్రిల్ 19 : అద్దంకిలో జరిగిన టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి నామినేషన్ అదుర్స్ అనిపించింది. అన్ని మండలాల్లోని గ్రామాల నుంచి పెద్దఎత్తున శ్రేణులు తరలివెళ్లారు. ముందుగా మార్టూరులో తూర్పుబజారున శుక్రవారం ఉదయం వినాయకుని ఆలయంలో గొట్టిపాటి రవికుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అద్దంకిలో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషను వేసేందుకు వెళ్తూ మొదట యద్దనపూడి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, అనంతరం మార్టూరులోని వినాయకునికి గొట్టిపాటి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఇక్కడి నుంచి భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు అద్దంకి వెళ్లారు. ఈ సందర్భంగా గొట్టిపాటికి మార్టూరు, యద్దనపూడి మండలాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సన్నిహితులు అభినందనలు తెలిపారు. భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుకున్నారు.

పంగులూరు : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం మండలం నుంచి వేల సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని 21 గ్రామాల నుంచి 80 ప్రత్యేక బస్సులు, 150కి పైగా కారులు, 3500 ద్విచక్రవాహనాలపై నేతలు, కార్యకర్తలు అద్దంకికి తరలివెళ్లారు. పలు గ్రామాల నుంచి యువత బైకులపై జై గొట్టిపాటి అంటూ నినాదాలతో ర్యాలీగా కదిలారు. అలవలపాడు నుంచి ముస్లిం యువత బైకులపై గొట్టిపాటి నాయకత్వం వర్థిల్లాలంటూ చేసిన ర్యాలీ ప్రత్యేకత సంతరించుకుంది. కల్లంవారిపాలెం గ్రామానికి చెందిన మహిళలు పసుపు చీరలు ధరించి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలడంతో గ్రామాలలో కోలాహలం నెలకుంది.

సంతమాగులూరు : గొట్టిపాటి నామినేషన్‌కు మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు 900 వాహనాల్లో అద్దంకి తరళివెళ్లారు.

బల్లికురవ : గొట్టిపాటి నామినేషన్ కార్యక్రమానికి బల్లికురవ మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు భారీగా అద్దంకికి తరలివెళ్లారు. బైకులపై పెద్ద ఎత్తున యువత జై గొట్టిపాటి అంటూ ర్యాలీగా బయలుదేరారు.

ఏలూరి గెలుపు పర్చూరు చరిత్రలో నిలిచిపోవాలి

» ఉత్సాహంగా మహిళల ప్రచారం
» టీడీపీ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి



మార్టూరులో ప్రచారం చేస్తున్న మహిళలు

మార్టూరు, ఏప్రిల్ 19 : పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజయం పర్చూరు చరిత్రలో నిలిచిపోవాలని కోరుతూ శుక్రవారం మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం పడమర బజారున పార్టీ కార్యకర్తలు ప్రచారం చేశారు. ముఖ్యంగా మార్టూరు గ్రామంలోని టీడీపీ మహిళలు కండువాలను మెడలో వేసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని, పర్చూరులో ఏలూరిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు, వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పేద కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలంతా సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. తూర్పుబజారు, విద్యానగర్, చౌదరి కాలనీ, మద్ది సీతాదేవినగర్ తదితర కాలనీల మహిళలు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ మైనారిటీ, బీసీ, ఎస్సీ కుటుంబాలు, జనసేన పార్టీ కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నాయి. వలపర్ల గ్రామంలో మైనారిటీలు ముస్లిం కాలనీల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు కరిముల్లా, గ్రామ అధ్యక్షుడు ఎస్‌ఏ సలాం, గ్రామనాయకులు షేక్ బషీర్, ఎంపీటీసీ సభ్యుడు జంజనం వెంకట సుబ్బారావు, కంభంపాటి హనుమంతరావు, వెంకటేశ్వర్లు, షేక్ అక్రమ్, వీరు, ఖాదర్ మస్తాన్, బడేసా, మన్సూర్ పాల్గొన్నారు.

అరాచక వైసీపీని గద్దె దింపండి

చినగంజాం, ఏప్రిల్ 19 : రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసి, అరాచక పాలన సాగించిన వైసీపీని గద్దె దింపాలని టీడీపీ కూటమి నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని చినగంజాం గ్రామం, పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధి లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తూ శుక్రవారం రాత్రి ప్రచారాన్ని నిర్వహించారు. చినగంజాం గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని మాయాబజారు, వైశ్యబజారు, రాజాహాల్, అన్నపూర్ణ హాల్ సెంటర్లలో, పల్లెపాల్లెం ఎంపీటీసీ సభ్యులు వీతా భార్గవి, మండల బీసీ సెల్ అధ్యక్షులు వాటుపల్లి ఏటుకొండలుల ఆధ్వర్యంలో బాపయ్యనగర్ గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఓట్లును అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పర్వతరెడ్డి సత్యనారాయణ, కొండ్రగుంట శ్రీహరి, రాయని ఆత్మారావు, టి.జయరావు, సందు శ్రీనివాసరావు, ఆజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, పీ.పార్థసారిథి, షేక్ జిలాని, ఎస్.సుబ్రమణ్యం, భయ్యా సతీష్, ఉలిచి ఏసుబాబు, శిఖరం కోటయ్య, ఎ.శ్రీనివాసరావు, ఎన్‌సీ.సుబ్బారావు, టి.సతీష్, ఎన్.గోపి, గంటా చెన్నయ్య, కోట శివరామకృష్ణ, సీ.హెచ్.రవణమ్మ, ఎం.పద్మావతి, ఎం.రామాంజనేయులు, లక్ష్మయ్య, టి.చిన్నా, వీ.శ్రీనివాసరావు, జి.నరసింహారావు, షేక్ హుస్సేన్‌బాషా, టి.దుర్గారావు, సంబ్యా శ్రీను పాల్గొన్నారు.

గంగవరంలో ఇంటింటి ప్రచారం

ఇంకొల్లు, ఏప్రిల్ 19 : మండలంలోని గంగవరం గ్రామంలో రాష్ట్రంలో చంద్రబాబును గెలిపించి ముఖ్యమంత్రిని చేయాలని, పర్చూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. మహిళలు ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కరి వీరాంజనేయులు, బొడెంపూడి సుబ్బారావు, కొల్లి సుబ్బారావు, కేసరి వీరారెడ్డి, కరి నాగేంద్రమ్మ, అప్పారావు, విజయకుమారి, కరివాసు, పార్వతి, రామాంజమ్మ, అచ్చాయమ్మ, అంజలి పాల్గొన్నారు.





చినగంజాంలో ప్రచారం చేస్తున్న టీడీపీ కూటమి నాయకులు .. ప్రచారంలో పాల్గొన్న గంగవరం శ్రేణులు

అద్దంకి ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయను

» వచ్చేది కూటమి ప్రభుత్వం
» దుష్ట పాలన అంతమై..ధర్మ పాలన వస్తుంది
» మీడియాతో గొట్టిపాటి



మీడియాతో మాట్లాడుతున్న గొట్టిపాటి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 : అద్దంకి నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని, ఇచ్చిన ప్రతిమాటా నిలబెట్టుకుంటానని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం బయటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నాలుగు సార్లు పోటీ చేయగా, ఎమ్మెల్యేగా అద్దంకి ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఐదోసారి నామినేషన్ వేశానని, ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ అసెంబ్లీకి వెళ్తానన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీల నాయకత్వంలో కచ్చితంగా రాబోయే రోజులలో ఆంధ్రరాష్ట్రంలో 175కు 160 సీట్లు గెలవబోతున్నామని గొట్టిపాటి ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా కూటమికి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని, జగన్ దుష్ట పాలనను అంతమై.. ధర్మపాలన వస్తుందన్నారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కూటమి శ్రేణులు, అద్దంకి ప్రజలకు గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

కొండయ్య తరపున నామినేషన్ దాఖలు

» ఆర్వోకు అందజేసిన కుమారుడు గౌరీ అమర్‌నాథ్
» ముగ్గురి నామినేషన్ల స్వీకరణ



నామినేషన్ దాఖలు చేస్తున్న గౌరీఅమర్‌నాథ్

చీరాల, ఏప్రిల్ 19 : టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య తరపున ఆయన కుమారుడు గౌరీఅమర్‌నాథ్ (ప్రపోజర్) తదితరులు శుక్రవారం ఆర్వో సూర్య నారాయణరెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున అంకమ్మగాంధీ లగడపాటి, స్వంతంత్ర అభ్యర్థి పింజల శాంతారాం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం ముగ్గురు అభ్యర్థుల తరపున నాలుగు సెట్ల నామినేషన్లను ఆర్వో స్వీకరించారు.

పర్చూరులో నలుగురు

పర్చూరు : పర్చూరులో రెండో రోజు శుక్రవారం మొత్తం నలగులు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా యడం బాలాజీ నామినేషన్ వేశారు. పిరమిడ్ పార్టీ తరుపున బెండపూడి లోకేశ్వరశర్మ, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ ఖాశిం సైదా, జాతీయ సమసమాజ పార్టీ అభ్యర్థిగా బాచిన రాంబాబు నామపత్రాలను దాఖలు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ తెలిపారు.

22న బొగ్గులకొండ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



బల్లికురవ, ఏప్రిల్ 19 : మండలంలోని కూకట్లపల్లి గ్రామ పరిధిలో ఉన్న బొగ్గులకొండ యెగ ప్రసన్నాంజనేయ స్వామి వార్షిక తిరునాళ్ల ఈనెల 22వ తేదీన జరుగుతుందని ఆలయ ధర్మకర్త తాళ్ల శివశంకర్‌రెడ్డి తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక భజనలు, కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని అలానే అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

షర్మిల నుంచి బీఫాం అందుకున్న శ్రీలక్ష్మీజ్యోతి



బీఫాం అందజేస్తున్న షర్మిల

పర్చూరు, ఏప్రిల్ 19 : పర్చూరు శాసన సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్ఆర్ఐ నల్లగొర్ల శివశ్రీలక్ష్మీజ్యోతి శుక్రవారం కర్నూలు జిల్లాలోని ఆదోనిలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల నుంచి బీఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో టికెట్ ఇచ్చి అవకాశం కల్పించిన షర్మిల, మాజీ మంత్రి జేడీ శీలం, జిల్లా డీసీసీ అధ్యక్షుడు గంటా అంజిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టంరాజుకు ఉగాది పురస్కారం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19: ఒంగోలులో జేవీసీ ఉగాది పురస్కార కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21వ తేదీన పది మందికి ఉగాది పురస్కారాలను అందిస్తున్నారు. దీనిలో భాగంగా సమాజ సేవలో, విద్యారంగంలో, సాహిత్య సామాజిక రంగాలలో సేవలందిస్తున్న అద్దంకికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి ఉగాది పురస్కారాన్ని ఇవ్వనున్నారు. ఉగాది పురస్కారానికి ఎంపికైన పుట్టంరాజును సంఘాల సభ్యులు అభినందనలు తెలియజేశారు.

సైకిలెక్కుతున్న యువత

కూటమి అభ్యర్థి కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు



కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన వాడరేవు యువకులు

చీరాల, ఏప్రిల్ 19 : మాకు తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. మా ఓటును సైకిల్ గుర్తుపైనే వేస్తామని నవ యువ ఓటర్లు ప్రకటించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అనివార్యం. ఉద్యోగ, ఉపాధి, అభివృద్ధి, సంక్షేమం బాబుతోనే సాధ్యమని చీరాల మండలం వాడరేవుకు చెందిన తొలిసారిగా ఓటు హక్కును పొందిన పలువురు యువకులు పేరొన్నారు. శుక్రవారం వారు టీడీపీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని కొండయ్య సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నూతనంగా ఓటు హక్కు పొందిన మీలో ఉన్న కసి, ఉత్సాహం చూస్తుంటే ప్రజా చైతన్యానికి నిదర్శనంగా కన్పిస్తోందన్నారు. ఆ స్ఫూర్తిని గ్రామంలో మిగిలిన వారిలోనూ రగిలించాలని వారిని కూడా కార్యోన్ముఖులను చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏబీసీ కార్మికులతో మాట్లాడుతున్న కొండయ్య

ఆదరించండి.. నమ్మకాన్ని వమ్ముచేయను

చీరాల, ఏప్రిల్ 19 : ఆదరించి.. ఓటు వేసి.. గెలిపించండి.. మీ నమ్మకాన్ని వమ్ముచేయనని కూటమి అభ్యర్థి కొండయ్య అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం పలు ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలను వివరించారు. రామకృష్ణాపురం పరిధిలోని ఏబీసీ సంస్థ మహిళాకార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం ఉడ్‌నగర్, కొట్లబజారు తదితర ప్రాంతాల్లో కొండయ్య ఇంటింటి ప్రచారం చేశారు. ఆయా ప్రాంతాల ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చింది. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యం

» గొట్టిపాటి నామినేషన్‌లో లేని ముందస్తు చర్యలు
» నామ్‌రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టని వైనం
» శింగరకొండ వద్దే వేలాదిగా వెనుదిరిగిన తమ్ముళ్లు



గొట్టిపాటి నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన శ్రేణులు

అద్దంకి, ఏప్రిల్ 19 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ నామినేషన్‌కు భారీ సంఖ్యలో కేడర్ తరలివస్తారని ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ పోలీసులు తగిన ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాలోని అత్యధిక గ్రామాల నుంచి నామ్ రోడ్డు ద్వారా అద్దంకిలోజరిగే నామినేషన్ ర్యాలీకి కూటమి శ్రేణులు వాహనాలల్లో తరలివచ్చారు. నామ్ రోడ్డులో ట్రాఫిక్‌ను ముందస్తుగానే అడ్డరోడ్డు నుంచి మళ్లించడమో లేక నిలిపి వేయాల్సి ఉండగా అలా చేయలేదు. గోపాలపురం, శింగరకొండ వరకు అనుమంతించడంతో భారీ వాహనాలు సైతం బారులు తీరాయి. ఈ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు కూడా గోపాలపురం, శింగరకొండ వద్దనే ఆగిపోవలసి వచ్చింది. దీంతో వేలాది మంది కార్యకర్తలు అద్దంకిలో జరిగిన ర్యాలీకి హాజరు కాకుండానే నిరుత్సాహంతో వెనుదిరిగారు. పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తామని పదేపదే చెప్తున్నప్పటికీ ఆ దిశగా ఏర్పాట్లు చేయడం లేదని, పోలీసుల నిర్లక్ష్య చర్యలతో ఈ పరిస్థితి ఏర్పడిందని నేతలు ఆరోపిస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

చీరాల, ఏప్రిల్ 19 : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి వీవీ రామకృష్ణ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ కామాక్షికేర్ హాస్పటల్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వేళ అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే అక్కడ ఉన్నవారు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని రామకృష్ణ చెప్పారు. ప్రధానంగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు ఎగసినపుడు కంగారు పడకుండా ఆ మంటలను నియంత్రించేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా చూపించారు. ఇతర అగ్ని ప్రమాదాలపై కూడా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ ఎండీ తాడివలస దేవరాజ్, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి జీ ఆంజనేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాల వద్ద వైద్యులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే ఫైర్ సిబ్బంది ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్ కుమార్, డాక్టర్ పీ వెంకటకిరణ్, డాక్టర్ జీ మెర్సీ, డాక్టర్ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

26న ఉరుసు వేడుకలు

మార్టూరు, ఏప్రిల్ 19 : హజరత్ కరిముల్లాషావలి ఉరుసు వేడుకలు ఈనెల 26 వతేదీ శుక్రవారం మార్టూరులో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొణిదెన రోడ్‌లో ఉన్న దర్గా వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారని, శుక్రవారం అర్ధరాత్రి పీర్ల చావిడి నుంచి గంధం బయలుదేరుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మార్టూరు ప్రాంత భక్తులు ఉరుసు వేడుకలను చూసేందుకు తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ కోత

మార్టూరు, ఏప్రిల్ 19: మండలంలోని కోనంకి, నాగరాజుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏ ఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

31 మంది వలంటీర్ల రాజీనామా

మార్టూరు, ఏప్రిల్ 19 : మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 31 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో నితిన్ శుక్రవారం తెలిపారు. మార్టూరు గ్రామం నుంచి 20 మంది, తాటి వారిపాలెంలో 7గురు మిగిలిన గ్రామాల నుంచి పలువురు రాజీనామా చేసినట్లు తెలిపారు.

మంచి చేతి రాత నేర్చుకోవాలి

ఇంకొల్లు, ఏప్రిల్ 19 : విద్యార్థులు చిన్నతనం నుంచి మంచి చేతి రాతను నేర్చుకోవాలని గంగవరం బాలల సైన్స్ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేదిక కన్వీనర్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఏవీ సుబ్బారావు సూచించారు. మండలంలోని గంగవరం ఎస్‌వీకే హైస్కూల్‌లో శుక్రవారం చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.సమత, వై.సిద్దయ్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్, మైక్ సెట్ బహూకరణ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 : మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం పలువురు దాతలు టేబుల్, మైక్ సెట్‌ను బహూకరించారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని పీ జ్యోతినిర్మలకు టేబుల్, మైక్‌సెట్‌నుఅందజేశారు. అలాగే కానమ్మ పాఠశాలకు ఆఫీస్ కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా వడ్లవల్లి వీరనారాయణ, దాతలను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సన్మానించారు.

నేడు గొట్టిపాటి ప్రచార వివరాలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ శనివారం సాయంత్రం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. కావున మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు.

దరి చేరని సాగర్ జలాలు

» అడుగంటిన చెరువులు
» ఆందోళనలో పలు గ్రామాల ప్రజలు



సాగర్ జలాల కోసం సిద్ధం చేసిన కాలువ నీరు లేక ఇలా

పర్చూరు, ఏప్రిల్ 19 : ఎన్నో ప్రయాశలతో చెరువులను శుభ్రం చేసుకొని ఎక్స్‌కవేటర్‌తో కాలువలను తవ్వించి బ్లీచింగ్ చల్లి ఆరబెట్టుకొని చెరువులను సిద్ధం చేశారు. సాగర్ జలాలు వచ్చి చెరువులు నిండి మంచినీటి అవసరాలు తీరుతాయని ఎదురు చూసిన ఆశలు అడియాసలయ్యాయి. సాగర్ జలాలను విడుదల చేసి పది రోజులు గడుస్తున్నా నేటికీ చెరువులకు చుక్క నీరు కూడా చేరలేదు. దీంతో నీరులేక వెలవెలబోతున్న చెరువులు దర్శనమిస్తున్నాయి. మరోపక్క వేసవి ముంచుకొస్తోందని, నేటికీ చెరువులు అడుగంటడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సాగర్, కొమ్మమూరు కాలువ పరిధిలో 18 మంచి నీటి చెరువులు ఉండగా దాదాపు నీరులేక అడుగంటాయి. మండలంలోని నాగులపాలెం గ్రామంలో ఉన్న రెండు మంచినీటి కంపార్ట్‌మెంట్‌లతో ఇప్పటికే ఒక చెరువు నీరులేక ఎండిపోగా, రెండో చెరువులో ఉన్న అరకొర నీరు రంగుమారి దుర్వాసన వస్తోంది. అదేవిధంగా మండల కేంద్రమైన పర్చూరులో ఉన్న రెండు మంచి నీటి చెరువులు అడుగంటాయి. దాదాపు మండలంలోని అన్ని చెరువుల పరిస్థితి ఇలానే ఉంది. వేసవిని అధికమించేందుకు మంచినీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు చెరువులకు చేరకపోవడంతో ప్రజల్లో అందోళన నెలకొంది. మరోపక్క నూతలపాడు మైనర్‌కు చుక్కనీరు కూడా చేరకపోవడంతో ప్రజల్లో నైరాశ్యం నెలకొంది. అసలు సాగర్ జలాలు చెరువుకు చేరతాయా లేదా అన్న సందేహం నెలకొంది. ఇప్పటికే ప్రజలతో పాటు, పశువులు నీటి కోసం అల్లాడే పరిస్థిలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులను సాగర్ జలాలతో నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు. ఆదిశగా ప్రభుత్వ యంత్రాంగం దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నీరు లేక వెలవెలబోతున్న నూతలపాడు మైనర్ కాలువ

చెరువులకు చేరకుండానే నిలిచిన జలాలు

» నీటి కష్టాలు తప్పవంటున్న ప్రజలు
» అధికారుల తీరుపై ఆగ్రహం

పంగులూరు, ఏప్రిల్ 19 : ప్రజల తాగునీటి అవసరాల కోసం చెరువులు నింపేందుకు విడుదలైన సాగర్ జలాలను నిలిపివేశారు. మండలంలోని చెరువులకు నీరు చేరకుండానే సాగర్ జలాలు నిలిపి వేయడంతో వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవని ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. గత డిసెంబర్‌లో విడుదలైన సాగర్ జలాలు చెరువులకు చేరకపోగా ఏప్రిల్‌లో కూడా సాగర్ జలాలు కూడా చెరువులకు చేరకుండానే నిలిపి వేయడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో 10 నోటిఫైడ్, 10 నాన్ నోటిఫైడ్ చెరువులను సాగర్ నీటితో నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేసిన ప్రయత్నం ఫలితం ఇవ్వలేదు. ఒక్క రామకూరు చెరువును 50 శాతం సాగర్ జలాలతో నింపారు. తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చే జనకవరం, నూజెళ్లపల్లి, ఆరికట్లవారిపాలెంతో పాటు చందలూరు పరిసర గ్రామాలకు సాగర్ జలాలు చెరువులకు చేరకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వేసవిలో నీటి కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. ప్రజల నీటి అవసరాలు గుర్తించకుండా మొక్కుబడిగా నీటిని సరఫరా చేసి మమ అనిపించిన అధికారుల చర్యలను ప్రజలు తప్పుబడుతున్నారు.



స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్

ఇంటి దొంగలే స్కెచ్ వేశారు!

సీఎంఎస్ వాహనంలో రూ.66లక్షలు చోరీ

కేసును 20 గంటల్లో ఛేదించిన పోలీసులు

ముగ్గురు అరెస్టు.. మొత్తం డబ్బు స్వాధీనం

నిందితుల్లో ఒకరు సంస్థ మాజీ డ్రైవర్, మరో ఇద్దరు సంస్థ ఉద్యోగులు

వివరాలను వెల్లడించిన ఎస్పీ సుమిత్

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 19 : నగరంలో పట్టపగలు సీఎంఎస్ (క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్) వాహ నంలో రూ.66లక్షల చోరీ కేసును 20 గంటల్లోనే పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఒకరు సీఎంఎస్‌లో పనిచేస్తూ మూడు రోజుల క్రితం రాజీనామా చేసిన డ్రైవర్ కాగా, మరో ఇద్దరు అందులో పని చేసే ఉద్యోగులు. వివరాలను ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ శుక్రవారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. సీఎంఎస్ సంస్థ సిబ్బంది గురువారం ఒంగోలులోని పలు బ్యాంకుల నుంచి రూ.68 లక్షలు తీసుకొని వాటికి సంబంధించిన ఏటీఎంలలో పెట్టేందుకు వాహనంలో బయల్దేరారు. కర్నూలు రోడ్డులోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం వద్ద గదిలో సిబ్బంది భోజనం చేసేందుకు వాహనం నిలిపారు. భోజనం అనంతరం వారు వచ్చి చూడగా వాహనం డోర్లు తెరిచినట్లు అనుమానం వచ్చింది. లోపలికి వెళ్లి చూడగా నగదు ఉన్న బాక్స్‌కు తాళం వేసి ఉంది. కానీ అందులో ఉన్న రూ.66లక్షలు మాత్రం మాయమైంది. మిగిలిన రెండు లక్షలు ఉంది. ఈమేరకు సీఎంఎస్ మేనేజర్ గుజ్జుల వెంకట కొండారెడ్డి ఫిర్యాదు చేయడంతో తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రధాన నిందితుడి గుర్తింపు

సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసును ఛేదించారు. సీఎంఎస్ వాహనం నిలిపిన ప్రాంతం పక్కన గోడ దూకి ఓ వ్యక్తి రావడం సీసీ కెమెరాలో దొరికింది. దీంతో అతను ఎవరు అని ఆరా తీశారు. అతను అదే సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తూ మూడు రోజుల క్రితం రాజీనామా చేసిన మహేష్ అని తేలింది. వెంటనే అతని కోసం గాలింపు చేపట్టారు. పేర్నమిట్ట సమీపంలోని ఎస్ఎస్పీ కాలనీ వద్ద ఆయన్ను అరెస్టు రూ.66లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

మాజీ డ్రైవర్‌కు మరో ఇద్దరు సహకారం

నగదు చోరీకి సీఎంఎస్ సంస్థలో పనిచేసే కొంత మంది కలిసి ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రకా రం ప్రధాన నిందితుడైన సంతనూతలపాడు మండలం కామేపల్లి వారిపాలెంనకు చెందిన సన్నమూరి మహేష్‌బాబు మూడు రోజుల క్రితమే సంస్థలో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. వాహనంలో నగదు ఉంచే పెట్టెకు మారు తాళం తయారు చేసేందుకు అక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న నగరంలోని శివప్రసాద్ కాలనీకి చెందిన గుజ్జుల వెంకట కొండారెడ్డి, కామేపల్లివారిపాలెంనకు చెందిన కాస్టోడియన్ రాచర్ల రాజశేఖర్ సహకరించారు. దీంతో ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు. వాహనంలో ఉన్న సిబ్బందికి కూడా ఏదైనా సంబంధం ఉం దా? అన్న కోణంలో పోలీసులు విచారిస్తు న్నారు. నగదు రవాణాకు సంబంధించిన లోపాలపై హో సెక్రటరీకి నివేదిక పంపనున్నట్లు ఎస్పీ చెప్పారు.

పోలీసులను అభినందించిన ఎస్పీ

చోరీ కేసును 20 గంటల్లో ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. అద నపు ఎస్పీ క్రైమ్స్ ఎస్.వి.శ్రీధర్‌రావు, ఒంగో లు డీఎస్పీ కిషోర్‌బాబు, తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి, సీసీఎస్ సీఐ టి.విజయకృష్ణ, సైబర్ సెల్ సీఐ సూర్యనారాయణ, ఎస్సైలు పున్నారావు, విజయ్‌కుమార్, మహేష్, ఏఎస్సైలు టి.బాలంజనేయులు, నాగేశ్వరరావు, సురేష్‌బాబు, రమేష్‌బాబు, హెడ్‌కానిస్టేబుళ్లు రామకృష్ణ, రాంబాబు, ఖాజావలి, కానిస్టేబుళ్లు రవికుమార్, నాగేశ్వరరావు, హనోక్, శ్రీనివాసులు, శ్రీనివారావు, రత్తయ్య, హోంగార్డులు శేషగిరిలకు రివార్డులను అందజేశారు.



దర్శి మండలం కట్టసింగన్నపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి

'దర్శి' అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తా!

» **కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి**

దర్శి, ఏప్రిల్ 19 : దర్శి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెప్పారు. మండలంలోని కట్టసింగన్నపాలెం, గంగపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాల్లో పెద్దఎత్తున ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి పూలవర్షం కురిపించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మీరు చూపుతున్న ఆదరణ మరువలేనిదన్నారు. మీ ఇంటి ఆడపడుచుగా ఎంతో ఆప్యాయంగా చూస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దర్శిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

దర్శి, ఏప్రిల్ 19: దర్శి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ సమక్షంలో బండివెలిగండ్ల సర్పంచ్ వర్నె రమణమ్మ, ఆమె కుమారుడు కాశి తదితరులు టీడీపీలో చేరారు. అంతకుముందు మండలంలోని చిన్నఉయ్యాలవాడ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తామన్నారు.

కోలాహలం

పలుచోట్ల టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు

కొండపి, వైపాలెంలో భారీ ర్యాలీలు, సభలు

ఎస్ఎన్‌పాడు, గిద్దలూరు, దర్శిలలో సాదాసీదాగా..

మరోసారి భారీ సభలకు ఏర్పాట్లు

ఏడు అసెంబ్లీ స్థానాలకు 15 దాఖలు

ఒంగోలు పార్లమెంట్, కనిగిరి అసెంబ్లీకి నిల్

జిల్లాలో నామినేషన్ల పర్వం ఉపందుకుంది. రెండో రోజైన శుక్రవారం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ తరపున ఎక్కువగా నామినేషన్‌లు పడ్డాయి. అయితే యర్రగొండపాలెం, కొండపిలలో పార్టీ అభ్యర్థులు ఎరిక్షన్‌బాబు, స్వామిలు వేలాది మంది జనంతో భారీ ర్యాలీ నిర్వహించి కోలాహలంగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే సభలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా అటు వైపాలెం, ఇటు కొండపి జనసంద్రాన్ని తలపించాయి. తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం వెల్లివిరిసింది. అలాగే గిద్దలూరు, దర్శి, ఎస్ఎన్‌పాడు అభ్యర్థులు కూడా సాధారణంగా వేశారు. వారు మరోసారి భారీ కార్యక్రమాలతో నామినేషన్ వేయనున్నారు.



ఎర్రగొండపాలెంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు(ఇన్‌సెట్లో) నామినేషన్ దాఖలు చేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఒంగోలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండవ రోజైన శుక్రవారం జిల్లాలో కోలాహలంగా సాగింది. పలుచోట్ల తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు భారీ ర్యాలీలతో నామినేషన్లు దాఖలు చేశారు. కొండపిలో టీడీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, డమ్మి అభ్యర్థిగా ఆయన సతీమణి రాజేశ్వరిలు నామినేషన్ వేశారు. సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయకుమార్ తరపున ఆయన సోదరుడు బి.అనిల్‌కుమార్ చీమకుర్తిలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేయగా, గిద్దలూరు టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి అక్కడి రిటర్నింగ్ అధికారి వద్ద నామినేషన్ దాఖలు చేశారు. వైపాలెంలో టీడీపీ అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్‌ను ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డితో కలిసి అక్కడి రిటర్నింగ్ అధికారికి అందజేశారు. దర్శిలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తరఫున మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు నామినేషన్ దాఖలు చేశారు. సాధారణంగా నామినేషన్ల దాఖలు చేసిన ముగ్గురు అభ్యర్థులు మరోరోజు భారీగా కార్యక్రమం నిర్వహించనున్నారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న టీడీపీ నేతలు (ఇన్‌సెట్లో) నామినేషన్ దాఖలు చేస్తున్న స్వామి

కొండపి, వైపాలెంలో భారీ ర్యాలీలు

కాగా కొండపి, ఎర్రగొండపాలెంలలో టీడీపీ అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా పార్టీశ్రేణులతో భారీ ర్యాలీలు, సభలు నిర్వహించారు. కొండపి అభ్యర్థి డాక్టర్ స్వామి తొలుత వల్లూరమ్మ దేవస్థానంలో పార్టీ యువనేత దామచర్ల సత్య, సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు, ఎంపీ మాగుంట కుమారుడు రాఘవరెడ్డితో కలిసి పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అభిమానులు, పార్టీ కార్యకర్తలతో కలిసి కొండపి చేరుకొని అక్కడ నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది పార్టీశ్రేణులుతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. అనంతరం భారీ బహిరంగసభ నిర్వహించారు. యర్రగొండపాలెంలోను ఎరిక్షన్‌బాబు నామినేషన్ కోలాహలంగా సాగింది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వేలాదిగా శ్రేణులు, జనం తరలిరాగా ఎంపీ అభ్యర్థి మాగుట శ్రీనివాసులరెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ డాక్టన్ మన్నె రవీంద్ర ఇతర ముఖ్యనేతలతో కలిసి ఎరిక్షన్‌బాబు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేశారు. ఆ తర్వాత భారీ సభ నిర్వహించారు.

వైసీపీ నుంచి ఇద్దరు

ఇదిలా ఉండగా కొండపిలో వైసీపీ అభ్యర్థిగా ఆదిములపు సురేష్, గిద్దలూరు వైసీపీ అభ్యర్థిగా కుందురు నాగార్జునరెడ్డి తదితరులు శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు. రెండవ రోజైన శుక్రవారం ఒంగోలు పార్లమెంట్‌తోపాటు కనిగిరి అసెంబ్లీ స్థానానికి ఎవరు నామినేషన్ వేయలేదు. మిగిలిన ఏడు అసెంబ్లీ స్థానాలకు 15 మంది 15 సెట్లను దాఖలు చేశారు. అందులో ఒంగోలులో మూడు దాఖలు చేయగా, గిద్దలూరులో ఐదు నామినేషన్లు, వైపాలెంలో ఒక అభ్యర్థి రెండు సెట్లు, సంతనూతలపాడులో ఒకటి, దర్శిలో ఒకటి, మార్కాపురంలో ఒకటి, కొండపిలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి.

లోగ్రేడ్ మార్కెట్ ఒడిదొడుకులు



కొనుగోలుకు కొన్ని కంపెనీల నిరాసక్తత

పెరుగుతున్న నోబిడ్‌లు

పొగాకు రైతుల్లో ఆందోళన

తాజా పరిస్థితిపై బోర్డు ఆర్ఎం సమీక్ష

కిలో రూ.256 పలికిన మేలు రకం గరిష్ఠ ధర

ఒంగోలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్ ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. ప్రత్యేకించి లోగ్రేడ్ రకం కొనుగోళ్లు మందగించాయి. వారం క్రితం వరకూ పోటాపోటీగా కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం నిరా సక్తత కనబరుస్తున్నారు. శుక్రవారం పలు వేలం కేంద్రాల్లో 25నుంచి 35శాతం వరకు లోగ్రేడ్ బేళ్లు నోబిడ్ (తిరస్కరణ) అయ్యాయి. దీనిపై రైతుల్లో తీవ్ర ఆందోళనవ్యక్తమవడంతో సాయంత్రం వేలం కేంద్రం అధికారులు, రైతు కమిటీల ప్రతినిధులతో ఆర్ఎం లక్ష్మణరావు ఒంగోలులోని తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ఈఏడాది పొగాకు కొనుగోళ్ల ప్రారంభం నుంచి లోగ్రేడ్‌కు మంచి ధరలే లభించాయి. అందులో కాస్త నాణ్యత బాగున్న బేళ్లను దాదాపు మేలు రకం ధరతో సమానంగా వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక పొగాకు ఎలా ఉన్నా కిలో రూ.200కు తగ్గకుండా లోగ్రేడ్‌ను కొన్నవారు పది రోజుల క్రితం గరిష్ఠంగా రూ.233 వరకూ ఇచ్చారు.

వారం నుంచి ధరలు తగ్గుముఖం

లోగ్రేడ్ ధరలను వ్యాపారులు వారం రోజులుగా తగ్గిస్తూ వస్తున్నారు. అదే సమయంలో నోబిడ్‌ల పెరుగుతున్నాయి. తొలుత కర్ణాటక పొగాకులో కలుపు కొనేందుకు ఇక్కడ లోగ్రేడ్‌ను హాట్‌హాట్‌గా కొన్న వ్యాపారులు ప్రస్తు తం ఆ అవసరం తగ్గడంతో వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. రెండు, మూడు ఎక్స్‌పోర్టు కంపెనీల బయ్యర్లు శుక్రవారం మార్కెట్లో కొనుగోళ్లకు నిరాసక్తత చూపారు. దీంతో ప్రధానంగా పచ్చ, ఎర్రనేలల్లో పండే మాడు రకం బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. అయా వేలం కేంద్రాల్లోని రైతుల ఆందోళన, అసంతృప్తి వ్యక్తం చేయడంతో బోర్డు అధికారులు అప్రమత్తమ య్యారు. ఆర్ఎం లక్ష్మణరావు వెంటనే స్పందించి సాయంత్రానికి అధికారులు, రైతు ప్రతినిధులతో ఒంగోలులోని తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బోర్డు సభ్యులు బ్రహ్మయ్య, పొద ప్రసాదరావులతోపాటు వేలం కేంద్రాల అధికారులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న రకం బేళ్లను వేలంకు తీసుకురావాలని, ప్రస్తుతం ఉన్న ధరలు తగ్గకుండా చూస్తా మని అధికారులు ఈ సమావేశంలో రైతులకు సూచించారు. సోమవారం నా టికి పరిస్థితిలో మార్పు ఉండాలని రైతులు డిమాండ్ చేసినట్లు సమాచారం.

పెరుగుతున్న మేలు రకం పొగాకు ధరలు

మార్కెట్‌లో మేలు రకం పొగాకు ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. దాదాపు నెలరోజుల పాటు కిలో రూ.238పై నిలకడగా సాగిన మేలు రకం గరిష్ఠ ధర వారం క్రితం రూ.249 పలికింది. రెండు రోజులుగా మళ్లీ కొద్దికొ ద్దిగా పెరుగుతోంది. శుక్రవారం ఒంగోలు-2లో గరిష్ఠ ధర కిలోకు రూ.256 లభించింది. ఇతర చోట్ల కూడా గరిష్ఠ ధర కిలో రూ.254 వరకు ఉన్నట్లు సమాచారం.

ఎండ మండుతోంది!

● **పెరిగిపోతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు**

● **పామూరులో 44.2 డిగ్రీలు నమోదు**

● **అత్యధిక ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటిన వైనం**

● **విలవిల్లాడుతున్న ప్రజలు**

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 19 : వేసవి తారెత్తిస్తోంది. ఎండలు మండిపోతున్నాయి. భానుడు భగభగలకు జనం బెంబేలెత్తిపోతున్నారు. మూడు రోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. మధ్యాహ్నానికి మంటపుట్టిస్తున్నాడు. దీనికితోడు ఉక్కపోత అధికంగా ఉంటుండటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు.



శుక్రవారం కూడా జిల్లాపై సూర్యప్రతాపం కొనసాగింది. అత్యధికంగా పామూరులో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పొన్నలూరులో 44.1, మార్కాపురంలో 44.1, కనిగిరిలో 43.8, దొనకొండలో 43.8 ముండ్లమూరులో 43.4, హనుమంతునిపాడులో 43.4, పెద్దారవీడులో 43.3, కొమరోలులో 43.2 డిగ్రీల ఎండ కాచింది. పొదిలిలో 43.0, చీమకుర్తిలో 43.0, కంభంలో 43.2, దర్శిలో 43.1, కురిచేడులో 42.7, కొత్తపట్నంలో 42.5, కొనకొనమిట్ల 42.8డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో 15 మండలాల్లో 40నుంచి 44 డిగ్రీల వరకూ ఎండ కాచింది. అది ఒంగోలులో 39.1 డిగ్రీలుగా ఉంది.

ఇసుకలో మృతదేహం ఎవరిది..?

నేటికీ తెలియని ఆచూకీ

మృతుడి తల నుజ్జునుజ్జయి మొండానికి వేలాడుతున్న వైనం

మండల శివారులో పేట్రేగిపోతున్న ఇసుకాసురులు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

పనిభారంతో పూర్తిస్థాయిలో కేసుపై దృష్టిసారించలేకపోతున్న పోలీసులు

చీరాలటౌన్, ఏప్రిల్ 19 : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం పద్మనాభునిపేటలో యజమాని ఇంటి నిర్మాణం కోసం తెప్పించిన ఇసుక లోడ్‌లో వచ్చిన గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ ఇంతవరకు తెలియరాలేదు. గత గురువారం సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఇసుకలో లభ్యమైన విషయం అందరికీ తెలిసినదే. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న పోలీసులు కేసుపై పూర్తి స్థాయిలో దృష్టిసారించలేక పోతున్నారు. ఈక్రమంలో ఈ కేసులో విషయంలో పురోగతి శూన్యమైంది.

చీరాల మండలం బోయినవారిపాలెం శివారులో గతకొంత కాలంగా అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ఈక్రమంలో గతనెల 5వ తేదీన ఎస్ఈబీ అధికారులు వ్యవహారాన్ని గుర్తించి రెండు ట్రాక్టర్‌లు, ఎక్స్‌కవేటర్‌ను దాదాపు ఈపూరుపాలెం స్టేషన్ దాకా తీసుకు వెళ్లి మార్గం మధ్యలోనే వాటిని తిప్పి పంపారు.

అసలు ఏమి జరిగింది ?

వివరాల్లోకి వెళితే.. ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటకు చెందిన కాగితాల రాంబాబు ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈక్రమంలో ఆ ఇంటి బేస్ మట్టంలో ఇసుకను నింపేందుకు ఈనెల 12వ తేదీ రాత్రి సుమారు 10 ట్రక్కులు ఇసుకను తోలించారు. ఆ ఇసుకను మరుసటి గురువారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో బేస్‌మట్టంలో నింపుతుండగా అందులోనుంచి మృతదేహం కనిపించింది. దీంతో అవాక్కు చెందిన యజమాని వెంటనే సమాచారాన్ని ఈపూరుపాలెం పోలీసులకు అందించారు. దీంతో సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్సై మర్రి శివకుమార్ మృతదేహాన్ని వెలుపలకు తీయించారు. నుజ్జు నుజ్జయిన సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆ కేసులో పోలీసులు ఇప్పటికి సుమారు 10 మందికిపైగా విచారణ చేశారు. కానీ అందులో ఎటువంటి ఆచూకీ లభ్యం లేదు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సిఐ సత్యన్నారాయణ, ఎస్సై శివకుమార్ (ఫైల్)

అడ్డూ అదుపులేని అక్రమ రవాణా

ఇసుక రవాణా జరిగిన ప్రాంతంలో పెద్ద ఎత్తున చాలాకాలంగా సిండికేట్‌గా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఇంతకాలంగా వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఇటీవల ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించినా గంటల వ్యవధుల్లోనే అక్రమ రవాణాకు ఎందుకు దారులు పడ్డాయో అంతుపట్టడం లేదు. ఇదిలావుంటే గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కూడా అదే పరిసరాల్లో నుంచి తోలిన ఇసుక కావడంతో సమస్య మరింత జటిలమైంది. ఇసుకాసురులు ఎవరైనా ఇతడిని ఉద్దేశపూర్వకంగానే హతమార్చి ఇసుకలో పూడ్చారా లేక ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనను బయటకు రాకుండా ఉండేందుకు తీసుకున్న నిర్ణయాలు బెడిసికొట్టాయా అనేది పోలీసులు తేల్చాల్సి ఉంది. ఏదేమైనా చనిపోయిన వ్యక్తిపై ఉద్దేశ పూర్వకంగానే దాడి చేసి హతమార్చినట్లు సంకేతాలు వినిపిస్తున్నాయి.

మృతిపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటాము

ఇసుక లోడులో మృతదేహం అందరినీ కలవర పరిచింది. ఇసుక ఎక్కడ నుంచి వచ్చింది, చంపారా లేక చనిపోయారా.. ఇలా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం. మృతుని తల బాగా దెబ్బ తినడంతో ఆనవాళ్లు గుర్తించలేకపోతున్నాం. అతని కుడి భుజంపై పచ్చబొట్టు ఉంది. పూర్తి విచారణ అనంతరం చర్యలు చేపడతాం.

\- సీఐ సత్యనారాయణ

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

» **కూటమి అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి**

» **హెచ్ఎంపాడు మండలంలో ఇంటింటి ప్రచారం**

కనిగిరి, ఏప్రిల్ 19: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. హనుమంతునిపాడు మండలం చినగొల్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఇంటింటి ప్ర చారం చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర ప్రతి ఇంటిని సందర్శిస్తూ గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దటితో పాటు రోడ్లు బాగాలేకపోవటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థు లు డాక్టర్ ఉగ్ర దృష్టికి తీసుకువచ్చారు. ప క్కా ప్రణాళిక ద్వారా గెలిచిన అనతి కాలం లోనే నీటి సమస్యను పరిష్కరించటంతో పా టు రోడ్లను వేయించి రవాణా ఇబ్బందులను తొలగిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా చంద్రబాబు ప్ర జలకు మెరుగైన పాలన అందించనున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో నిత్యావసర ధరలతో పాటు గ్యాస్, ఆయి ల్ రేట్లు విపరీతంగా పెంచి ప్రజలకు నరకం చూపిం చా రని ఉగ్ర విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వై సీపీ నేతలు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు మళ్లీ వస్తున్నారని అన్నారు. ప్రజలకు ఏమి అభివృద్ధి చేశారో వైసీపీ నేతలను నిలదీయాలన్నారు. కా ర్యక్రమంలో టీడీపీ హనుమంతునిపాడు మండల అ ధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), గాయం తిరుపతి రెడ్డి, గాయం రామిరెడ్డి, మురహరి నరసయ్య, చీ కటి వెంకటసుబ్బయ్య, తాతపూడి స్టాలిన్(బుజ్జి), తదితరులు పాల్గొన్నారు.

మాచవరంలో ఇంటింటి ప్రచారం

కనిగిరి, ఏప్రిల్ 19: కనిగిరి ప్రాంత ప్రజల భవిష్యత్తు తరాలకు భరోసా ఉగ్రతోనే సాధ్యమని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని మాచవరం గ్రామంలో శుక్రవారం రాత్రి భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో నెలకొన్న మంచినీటి, తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం జరగాలంటే ఉగ్ర లాంటి సమర్థుడైన నాయకుడిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు సూరసాని హజరత్‌రెడ్డి, కార్యదర్శి కుడుముల షద్రక్, రామయ్య, ఒంటిపెంట శ్రీనివాసులురెడ్డి, చీమలదిన్నె చినవెంకటసుబ్బయ్య ముప్పారపు మార్కు, తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎంపాడు మండలం చినగొల్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ ఉగ్ర

ఆంధ్రజ్యోతి

ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	40.2	39.0	43.0	43.0	39.0
కనిష్ఠం	28.0	28.0	29.0	28.0	28.0

సోమశిలలో 8.486 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి ప్రాజెక్టులో 8.486 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 15, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



'నేను ఉన్నాను. నేను విన్నాను. మద్యం కారణంగా అక్కచెల్లెమ్మలు పడుతున్న బాధల గురించి తెలుసుకున్నా. మీ బిడ్డ జగన్ ఒకటే మాట ఇస్తున్నాడు. రాబోయే ఐదేళ్లలో దశలవారీగా సంపూర్ణంగా మద్యాన్ని నిషేధిస్తానని మా ఆడపడుచులకు సవినంగా మనవి చేసుకొంటున్నా'...

- పాదయాత్ర సందర్భంగా 'జగన్ ఇచ్చిన హామీ

ఐదేళ్లు గడిచిపోయాయి. కానీ ఇచ్చిన మాట మాత్రం నిలబెట్టుకోలేదు సరికదా..! మానిపోనివిధంగా పెద్ద వాతే పెట్టాడు. 2019లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఉన్న మద్యం ధరలతో పోల్చితే రెట్టింపు చేసి ఐదేళ్ల కాలంలో అక్షరాలా రూ. 2,500 కోట్లు దోచుకున్నాడు. డబ్బుపోతే పోయింది.. సరుకు అయినా మంచిదా... ? అంటే అంతా నాసిరకమే. ఐదేళ్లపాటు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించిన మందు కారణంగా ఇంట్లో మగాళ్ల ఆయుష్షు కూడా 20 ఏళ్లు తగ్గిపోయిందని మహిళలు ఘొల్లుమన్నారు. జే బ్రాండ్ మద్యం వల్ల లివర్ సమస్యలతోపాటు కొత్తగా బ్రెయిన్‌స్ట్రోక్‌లు కూడా వస్తున్నాయని డాక్టర్లు తేల్చారు. సంపూర్ణ మద్య నిషేధం అనే హామీతో గద్దెనెక్కి అధిక ధరల రూపంతో ప్రజాధనాన్ని నాసిరకం మద్యంతో ప్రజారోగ్యాన్ని లూటీ చేశాడు.

నిషేధమనీ... మందులో ముంచి!

అధిక ధరలతో మద్యం దోపిడీ రూ.2,500 కోట్లు

నాసిరకం మందుతో ఆరోగ్యాలు నాశనం

2019 టీడీపీ హయాంలో చీప్ క్వార్టర్ ధర రూ. 60 నుంచి రూ. 80 వరకు ఉండేది. కొన్ని బ్రాండ్లు రూ. 60కి లభిస్తే కొన్ని బ్రాండ్లు రూ.80. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ ధరలను అమాంతం పెంచేశారు. చీప్ ధర క్వార్టర్ రూ. 120-150. ఉంటే ప్రస్తుతం రెట్టింపు అయ్యింది. ఇక మిడిల్ రేంజ్ మద్యం ధరల విషయానికి వస్తే అప్పట్లో మ్యాన్షన్‌హౌస్, ఎంసీ తదితరాల క్వార్టర్ ధర రూ. 110-120లు. ఇప్పుడు ఆ బ్రాండ్లు లేనేలేవు. అన్ని నాసిరకం బ్రాండులే. అయినా వాటి రేటు క్వార్టర్ రూ. 220లు. యబౌమిడిల్ రేంజ్ మద్యం విషయానికి వస్తే అప్పట్లో క్వార్టర్ రూ. 180లు అయితే ఇప్పుడు రూ. 320లు. అప్పట్లో టాప్‌రేంజ్ మద్యం క్వార్టర్ రూ.250 నుంచి 300లుగా ఉంటే ఇప్పుడు రూ. 450 నుంచి రూ.600 వరకు ఉంది. బీర్ల విషయానికి వస్తే అప్పట్లో కింగ్‌ఫిషర్, నాక్ అవుట్ తదితర ఇంటర్‌నేషనల్ బ్రాండ్ల ధర రూ. 110లు. ఇప్పుడు భూమ్ భూమ్ లాంటి వాటి (దేశంలో ఇక్కడ తప్ప మరెక్కడా దొరకని బ్రాండ్లు) ధర రూ. 220-230. అంటే చీప్ మొదలు, మిడిల్ రేంజ్ కాని, అప్పర్ రేంజ్ కాని, బీర్లు కాని ఏదైనా కాని టీడీపీ హయాంలో ఉన్న ధరకన్నా ప్రస్తుతం ధర దాదాపుగా రెట్టింపు అయింది.

అమ్మఒడి, రైతు భరోసాల కన్నా అధికం

మద్యం అధిక ధరల రూపంలో నాలుగేళ్ల కాలంలో జిల్లా వాసులు నష్టపోయింది ఎంతంటే...? రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకునే అమ్మఒడి, రైతు బరోసా పథకాల ద్వారా ఇచ్చిన మొత్తం కన్నా 900 కోట్లు ఎక్కువగా ఉంటడం గమనార్హం. జిల్లాలో అమ్మఒడి కింద ఏటా 2లక్షల మందికి ఒక్కొక్కరికి రూ. 13వేలు చొప్పున పంపిణీ చేశారు. అంటే ఏడాదికి రూ.260 కోట్లు. నాలుగేళ్ల కాలానికి రూ.1,060 కోట్లు. రైతు భరోసా పథకంలో రాష్ట్ర వాటా రూ. 7,500లు. జిల్లాలో 2లక్షల మంది రైతులకు ఇస్తున్న మొత్తం రూ. 150 కోట్లు. నాలుగేళ్ల కాలంలో ఇచ్చిన మొత్తం రూ. 600 కోట్లు. అమ్మఒడి 1,060 కోట్లు, రైతు భరోసా రూ.600 కోట్లు కలుపుకుంటే మొత్తం రూ. 1,660 కోట్లు. కానీ ఒక్క మద్యంపై అధిక ధరల రూపంలో పిండుకున్న మొత్తం రూ.2,500 కోట్లు.

● ధరల దోపిడీ రూ. 2,500 కోట్లు


గత నాలుగేళ్ల కాలంలో అధిక ధరల రూపంలో జిల్లా ప్రజలు ఎంత దోపిడీకి గురయ్యారో తెలుసుకుందాం. 2020 నుంచి 2023 వరకు విభజిత నెల్లూరు జిల్లా పరిధిలో జరిగిన అమ్మకాల విలువ అక్షరాల రూ. 5,060 కోట్లా 88 లక్షలు. గత ఏడాది రూ. 1,433 కోట్ల విక్రయాలు జరిగాయి. దానికి ముందు 1,327 కోట్లు. కరోనా కారణంగా 2020,2021 సంవత్సరాల్లో రూ.1,038, రూ.1,261 కోట్లు. కరోనా కారణంగా ఆ రెండేళ్లు మద్యం విక్రయాలు కాస్త తగ్గాయి. సరే...ఈ నాలుగేళ్ల కాలంలో రూ.5,060 కోట్ల విక్రయాలు జరిగాయి. ఇందులో 2019(టీడీపీ హయాంలో) ధరలతో పోల్చితే సుమారు రూ. 2,500 కోట్ల దోపిడీ జరిగింది. అంటే వైసీపీ ప్రభుత్వంలో గడచిన నాలుగేళ్ల కాలంలో జిల్లాకు చెందిన మద్యం ప్రియులు అధిక ధర రూపంలో నష్టపోయిన మొత్తం రూ. 2,500 కోట్లన్నమాట.



అనంతసాగరంలోని ఓ దుకాణం ముందు మద్యం కోసం బారులు తీరిన మందుబాబులు

● ప్రజారోగ్యం మాటేమిటో...?

ఆరోగ్యమే మహాభాగ్యం అనేది దేశావాసుల నినాదం. ఆరోగ్యాన్ని దేనితోనూ విలువ కట్టలేం. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించిన నాసిరకం మందు కారణంగా లక్షలాదిమంది కుటుంబ యజమానుల ఆరోగ్యాలు గుల్ల అయ్యాయి. నాసిరకం మద్యం కారణంగా కాలేయ సంబంధిత వ్యాధులు ఎక్కువయ్యాయి. తాజాగా బ్రెయిన్ స్ట్రోక్‌లు కూడా సంభవిస్తున్నాయి. ఇటీవలి కాలంలో 30 నుంచి 40 ఏళ్ల లోపు ఉన్న యువకుల్లో ఎక్కువమందికి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. ఇందుకు కారణం నాణ్యత లేని మద్యం తాగడమేనని వైద్యులు అంటున్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. ప్రభుత్వ మద్యం దుకా ణాలు, అనుమతి పొందిన బార్లలో తప్ప మరెక్కడా మందు దొరకదు. మరి మద్యం తాగడం వల్ల ప్రజారోగ్యాలు ఇలా గుల్లవుతున్నాయంటే అందుకు బాధ్యత ఎవరు వహించాలో ప్రజలే ఆలోచించాలి.



రెండో రోజు
8 మంది.. 17 సెట్లు



నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ ధాఖలు చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



కావలిలో ఆర్వో శీనా నాయక్‌కు నామినేషన్ పత్రాలు ఇస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

నెల్లూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. రెండో రోజూ నామినేషన్ల జోరు కనిపించింది. పలు స్థానాలకు కీలక పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నెల్లూరు ఎంపీతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాలకు ఎనిమిది అభ్యర్థులు 17 సెట్ల నామినేషన్లు వేశారు. నెల్లూరు ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు రిటర్నింగ్ అధికారి ఎం హరినారాయణన్‌కు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎటువంటి హంగు, ఆర్భాటాలు లేకుండా తన నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ నామినేషన్‌ను ఆర్వో ఏ మలోలాకు అందజేశారు. తొలి రోజే ఒక సెట్‌ను శ్రీధర్‌రెడ్డి తరఫున దాఖలు చేసిన విషయం తెలిసిందే. కావలి టీడీపీ అభ్యర్థి దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయనకు డమ్మీగా దగ్గుమాటి సంహిత కూడా రెండు సెట్లను దాఖలు చేశారు. రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులుగా కందుకూరులో బాల్‌కుమార్ ఎండ్లూరి, కావలిలో యల్లు సల్మాన్‌లు నామినేషన్లు వేశారు. ఆత్మకూరులో యుగతులసీ పార్టీ తరఫున నెల్లూరు కృష్ణారెడ్డి రెండో రోజు మరో సెట్ నామినేషన్‌ను వేశారు. నెల్లూరు రూరల్‌లో సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ఫాజిల్ సయ్యద్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా నెల్లూరు సిటీ, సర్వేపల్లి నియోజకవర్గాల్లో రెండో రోజూ కూడా నామినేషన్లు దాఖలు కాకపోవడం విశేషం.

కోటంరెడ్డి ఆస్తులు రూ.2.45 కోట్లు

నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబం ఆస్తుల విలువ రూ.2.45 కోట్లుగా అఫిడవిట్‌లో చూపించారు. శ్రీధర్‌రెడ్డి పేరు మీద రూ.95.61 లక్షల విలువైన చరాస్తులు ఉండగా ఆయన సతీమణి పేరు మీద రూ.59.81 లక్షల చరాస్తులున్నాయి. అలానే శ్రీధర్‌రెడ్డి పేరుపై రూ.25.38 లక్షలు, ఆయన సతీమణి పేరుపై రూ.64.33 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. అలానే వీరిద్దరికి రూ.16.90 లక్షల అప్పులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇక శ్రీధర్‌రెడ్డిపై నాలుగు కేసులు కూడా ఉన్నట్లు చూపించారు. నెల్లూరులోని చిన్న బజారు పోలీసు స్టేషన్ పరిధిలో సెక్షన్లు 143,341, రెడ్‌విత్149 ఐపీసీ కింద ఎఫ్ఐఆర్ నెంబర్ 216/2023 నమోదై ఉంది. అలానే దర్గామిట్ట పోలీసు స్టేషన్ పరిధిలో క్రైమ్ నంబర్ 152/2023గా కేసు నమోదు ఉంది. ప్రభుత్వ ఉద్యోగి విధులను అడ్డుకున్నందుకు ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వేదాయపాలెం పీఎస్ పరిధిలో 30/2023 ఎఫ్ఐఆర్ నంబర్‌తో మరో కేసు నమోదై ఉంది. సెక్షన్లు 448, 363, రెడ్‌విత్ 34 ఐపీసీ కింద ఈ కేసు నమోదు చేశారు. అలానే 2018లో ఏసీబీ నమోదు చేసిన బెట్టింగ్ కేసు ప్రస్తుతం విజయవాడలోని కోర్టులో విచారణ దశలో ఉండగా దానిపై అప్పీల్ హైకోర్టులో పెండింగ్ ఉన్నట్లు శ్రీధర్‌రెడ్డి తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కాగా శ్రీధర్‌రెడ్డి వీఆర్ కాలేజీలో బీకాం డిస్‌కంట్యూనిడ్ అయ్యారు.

కొప్పుల రాజు ఆస్తులు రూ.11.55 కోట్లు

నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ ఐఏఎస్ అధికారి, పూర్వపు కలెక్టర్ కొప్పుల రాజు కుటుంబం ఆస్తుల విలువ రూ.11.55 కోట్లుగా ఉంది. కొప్పుల రాజుతో పాటు ఆయన సతీమణిపేర్లపై ఈ ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రాజు పేరు మీద రూ.10.44 లక్షలు, ఆయన సతీమణి పేరు మీద రూ.82.43 లక్షల చరాస్తులున్నాయి. అలానే రాజు పేరుపై రూ.5 కోట్లు, ఆయన సతీమణి పేరుపై రూ.5.62 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపారు. ఇక వీరికి రూ.1.02 కోట్ల అప్పులు కూడా ఉన్నట్లు చూపించారు. కొప్పుల రాజు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశారు.

అభివృద్ధి చేసి చూపిస్తా!

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు



నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు

నెల్లూరు (హరనాథపురం/ వైద్యం) : గతంలో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సంపూర్ణ అనుభవంతో నెల్లూరు పార్లమెంటును అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని నెల్లూరు పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొప్పుల రాజు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్‌కు నామినేషన్ పత్రాలను ఆయన దాఖలు చేశారు. ముందుగా వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్, వామపక్షాలు, ఆమ్ ఆద్మీ నేతలు కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కొప్పుల రాజు మాట్లాడుతూ గతంలో తాను జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ప్రతి సోమవారం ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకు అధిక సమయం కేటాయించి, సమస్యలు పరిష్కరించానని చెప్పారు. తనను ఎంపీగా గెలిపిస్తే పేదల మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేస్తానని చెప్పారు. యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు రావాలన్నా, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, ఎంపీగా తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, ఉడత వెంకట్రావ్, పల్లంరెడ్డి యశోధర తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో నేడు 'ప్రజాగళం'

● బహిరంగ సభలో పాల్గొననున్న చంద్రబాబు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 19 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శనివారం సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు పొదలకూరులోని గేట్ సెంటర్ వద్ద జరిగే ప్రజా గళం సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు. ఉదయం 11 గంటలకు గూడూరులో జరిగే సభలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు పొదలకూరు చేరుకుంటారు. ఈ మేరకు టీడీపీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న సోమిరెడ్డి, అజీజ్, కన్నబాబు తదితరులు

పొదలకూరుకు సాగునీరందించి పునర్జన్మ ఇచ్చింది చంద్రబాబే!

● మాజీ మంత్రి సోమిరెడ్డి

● భయం వద్దు.. స్వచ్ఛందంగా ఓటెయ్యండి : అజీజ్

పొదలకూరు : మండల రైతాంగానికి సాగు నీరందించే కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్, సోమశిల దక్షిణ కాలువ పనులను పూర్తి చేసి మండలానికి పునర్జన్మనిచ్చింది మాజీ సీఎం చంద్రబాబేనని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శని వారం చంద్రబాబు రాక సందర్భంగా మర్రిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను జిల్లా నాయకులు అబ్దుల్ అజీజ్, జి.కన్నబాబు తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. అలాగే బహిరంగ సభ జరిగే గేట్ సెంటర్ కూడలి ప్రదేశాన్ని కూడా పరిశీలించి, స్థానిక నాయకులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజున పొదలకూరు మండలానికి పునర్జన్మనిచ్చిన చంద్రబాబు రావడం మండల ప్రజానీకం చేసుకున్న అదృష్టమన్నారు. మంత్రి కాకాణి సర్వేపల్లి ఏర్పడిన తర్వాత ఏ ఎమ్మెల్యే చేయని విధంగా దోపిడీ చేశారని, ఆయన దోపిడీతో ఎవరు పోటీ పడలేరన్నారు. నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అజీజ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎవరికీ భయపడనవసరం లేదని, బెదిరింపులకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు గోడల మధ్య వేసే ఓటును ఎవరూ చూడలే రని, అభివృద్ధి వైపు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బొమ్మి సురేంద్ర, తలచీరు మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్య నాయుడు, వెంకటరత్నం నాయుడు, వెంకటరెడ్డి, దేవరం అమరనాథ్‌రెడ్డి, బిల్లు సుందరయ్య పాల్గొన్నారు.

కన్న ఊరి కోసం కాపుకాశా..

ఇప్పుడు ఒంటరినయ్యా!

● ఇస్కపల్లి తలెత్తుకునేలా అభివృద్ధి చేశా

● ఎవరిని ఓడించామో ఆ నలుగురు ఒక్కటై పోయారు!

● అందుకే మిమ్మల్ని కోరతా ఉండా!

● కష్టాల్లో ఉన్నా..! సహాయం చేయండి!.

● ఉద్వేగంతో టీడీపీ నేత బీద రవిచంద్ర కంటతడి



బీద రవిచంద్ర... చిన్న కార్యకర్తగా తెలుగుదేశం జెండా పట్టుకుని క్రమశిక్షణ, కఠోర శ్రమతో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. చంద్రబాబు, నారా లోకేష్‌లకు అత్యంత సన్నహితుడిగా మారారు. తలపండిన నెల్లూరు జిల్లా నాయకుల తలలో నాలుకలా మెదిలారు. రాయలసీమ జిల్లాల సమన్వయకర్తగా టీడీపీ అభ్యర్థుల ఖరారులో కీలకపాత్ర పోషించారు. అదరని, బెదరని, తొణకని లోతైన మనిషిగా గుర్తింపు పొందారు. అలాంటి వ్యక్తి సొంతూరిలో చంటిబిడ్డగా మారిపోయాడు. ఆప్తుల ముందు కష్టం చెప్పుకునే క్రమంలో ఉద్వేగానికి లోనై చిన్న పిల్లాడిలా కంటతడి పెట్టుకున్నారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించాయి. రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గురువారం రాత్రి బాగా చీకటిపడ్డాక బీద రవిచంద్ర తన సొంతూరైన ఇస్కపల్లి గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన అన్న మాటలు యథాతథంగా..!

'కన్న ఊరికి, కార్యకర్తలకు కష్టం రాకుండా కాపుకాశా. కన్నీరు తుడిచా. ఈ రోజు ఒంటరివాడినయ్యాను. మిమ్మల్నే నమ్ముకొని ఒంటరి పోరాటం చేస్తున్నా. ఇస్కపల్లి తలెత్తుకునేలా అభివృద్ధి చేసిన నాకు తలదించుకునే పరిస్థితి తీసుకురావద్దని అభ్యర్థిస్తున్నా..

మనం గెలిపించినోళ్లు.. మనం ఓడించినోళ్లు నలుగురు ఒకటైపోయారు. ఎవరికోసమైతే పోరాడామో, ఎవరి వల్ల అయితే ఇబ్బందులు పడ్డామో, ఎవరిని గెలిపించడానికి ఎవరిని ఓడించామో ఆ నలుగురు ఒకటైపోయారు. నేను ఒక్కడిగా మిగిలాను.

ఈ 20 ఏళ్లు నా ఇష్టాలతో పని లేకుండా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పోరాడా. మొన్న ఎన్నికల్లో విష్ణువర్ధన్ రెడ్డి కోసం పని చేశాం. దానికి ముందు బీద మస్తాన్‌రావు కోసం పని చేశాం. దానికి ముందు ఆదాల ప్రభాకరరెడ్డి కోసం పని చేశాం. ప్రతాప్‌రెడ్డిని ఎవరి కోసం ఓడించాలని అనుకున్నాం. నాకేం ప్రతాప్‌రెడ్డితో వ్యక్తిగత విరోధం లేదే! విష్ణువర్ధన్ రెడ్డిని ఎందుకోసం ఓడించాం. ఆదాల ప్రభాకరరెడ్డి కోసం, బీద మస్తాన్‌రావు కోసం ఓడించాం. ఈ 20 ఏళ్లు ఎవరిని గెలిపించామో, ఎవరిని ఓడించామో ఆ నలుగురు ఒక్కటైపోయారు. నేను ఒక్కడినే ఒంటరిగా మిగిలాను. అందుకే మిమ్మల్నందరినీ కోరతావుండా. కష్టాల్లో ఉండా..! సహాయం చేయండి!.' అంటూ బీద రవిచంద్ర ఉద్వేగానికిలోనై కళ్లనీళ్ల పర్యంతం అయ్యారు. ఆ సన్నివేశం ఇస్కపల్లిని కదిలించింది. 'మీ వెంట మేమున్నాం' అంటూ నినదింపజేసింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

లంచం సొమ్ము
బాధితులకు వాపస్

కావలి రూరల్, ఏప్రిల్19: కావలి రూరల్ మండలం కొత్తపల్లికి చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల లంచం సొమ్మును తిరిగి ఇచ్చేశారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది లంచం డిమాండ్ చేసి, ఆ తర్వాతే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందచేశారు. ఈ విషయమై ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో 'చిల్లరిస్తేనే చెక్కు లు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే ఇప్పటి వరకు గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం ఒక్కసారిగా బట్టబయలు కావటంతో ఈ విషయమై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విచారించగా, ముగ్గురు వాటాదారులని తేలింది. ఎన్నికల సమయం కావటంతో తమకు చెడ్డపేరు వస్తుందనే భావనతో గురువారం రాత్రే లంచంగా తీసుకున్న సొమ్మును గుట్టుగా తీసుకెళ్లి బాధితులకు అప్పగించారు. ఫోన్ పే ద్వారా తీసుకున్న రూ.30 వేలు తిరిగి ఫోన్‌పే ద్వారా వారికి చెల్లించారు. నగదు రూపంలో తీసుకున్న రూ.1,90,000ను తిరిగి నగదు రూపంలోనే బాధితులకు చేర్చారు. దీంతో బాధితులు ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు.

దీనదయాళ్‌నగర్ వద్ద
దారి దోపిడీ

● రూ. 9.43 లక్షల అపహరణ

నెల్లూరురూరల్, ఏప్రిల్ 19 : నెల్లూరు రూరల్ మండల పరిధి కోడూరుపాడు కల్తీకాలనీలోని దీనదయాళ్ నగర్ సమీపాన ఉన్న వెంకటప్రసాద్ రైస్‌మిల్లు వద్ద దారి దోపిడీ జరిగినట్లు గురువారం తమకు ఫిర్యాదు అందినట్లు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు, ఇందుకూరుపేట మండలం పల్లెపాడు ఇసుక రీచ్‌లో గుమస్తాలుగా పనిచేస్తున్న పెంచలప్రసాద్, బాలక్రిష్ణలు ఈనెల 17న రీచ్‌లో వచ్చిన వసూళ్లు రూ. 9.43 లక్షలను తీసుకుని వేదాయపాళెంలోని రీచ్ కార్యాలయంలో జమ చేసేందుకు స్కూటర్‌పై బయలుదేదారు. వారు దీనదయాళ్ నగర్ దగ్గరకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. కిందపడిపోయిన తమవద్దకు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై వచ్చి నగదు ఉన్న బ్యాగును అపహరించుకు వెళ్లారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ మారుతీకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రలోభాల సామగ్రిపై
నిఘా ముమ్మరం చేయండి : కలెక్టర్



సమీక్షలో మాట్లాడున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లా సరిహద్దులు, ఇతర ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయలోని కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్షించారు. రాత్రివేళల్లో కూడా తనిఖీలను ముమ్మరంగా చేపట్టి, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వస్తువుల రవాణాను నిరోధించాలని సూచించా రు. 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి ఖర్చులన్నీ అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

బోగోలులో 'ఆరోగ్య సురక్ష'

బిట్రగుంట, ఏప్రిల్ 19: బోగోలు పంచాయతీ సచివాలయ-2 పరిధిలో కోవూరుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కావలి ఏరియా వైద్యశాల డాక్టర్ మాధవి లత, వైద్యులు జీ హారిక, నిత్యప్రశాంతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనంతా అవినీతిమయం

● టీడీపీ నేత బీద రవిచంద్ర


మాట్లాడుతున్న బీద రవిచంద్ర

కావలి, ఏప్రిల్ 19: వైసీపీ ఐదేళ్ల పాలనలో కావలి నియోజకవర్గంలో అంతా అవినీతి తప్ప అభివృద్ధి జాడే లేదని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. పట్టణంలోని ముసునూరులో ఉన్న టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో, అనంతరం ఆర్డీవో కార్యాలయం వెలుపల టీడీపీ నామినేషన్ల అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి కావలిలో రెండు పర్యాయాలు, నెల్లూరు పార్లమెంట్‌లో మూడు పర్యాయాలు అవకాశం ఇచ్చారని, వారి పాలలో అరాచకాలు తప్ప సంక్షేమాలే లేవన్నారు. కనీసం స్వేచ్ఛగా మాట్లాడే హక్కు లేదని, ఎవరికీ రక్షణలేని ఈ వైసీపీ పాలన ఇంకా అవసరమా అన్నారు. ఈ పర్యాయం కావలి అసెంబ్లీకి, నెల్లూరు పార్లమెంట్‌కు టీడీపీకి అవకాశం ఇచ్చి కావ్య క్రిష్ణారెడ్డిని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే కావలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారన్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలను చూస్తే టీడీపీ పాలనలో తప్ప ఇతరుల పాలనలో కావలిలో ఎలాంటి అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి, కేంద్రంలో మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. మన ప్రాంత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని టీడీపీకి ఇక్కడ ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతిపరుడైన ప్రతాప్‌కుమార్ రెడ్డి ఇంకా అవసరమా అన్నారు. ఈ ఎన్నికలలో వైసీపీని తరిమి కొట్టి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.4 లక్షల స్వాధీనం

కావలి రూరల్, ఏప్రిల్ 19: కావలి పట్టణంలోని పెండెం సెంటర్ వద్ద శుక్రవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.4 లక్షలను సీజ్ చిసినట్లు 1వ పట్టణ సీఐ రాజేష్ తెలిపారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు అక్రమ మద్యం, నగదు తరలింపుపై పోలీసులు నిఘా ఉంచారు. మండలంలోని నారాయణపురంకు చెందిన డేగా చిన్నయ్య సంచితో నడిచి వెళ్తుండటంతో పోలీసులు తనిఖీ చేశారు. అతని వద్ద రూ.4లక్షలు ఉండగా అందుకు సబంధించి ఎలాంటి ఆధారాలు, ఎలక్షన్ నిర్వహణ అధికారి అనుమతులు లేవు. దీంతో నిబంధనల మేరకు అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న రూ.4లక్షలు స్వాధీనం చేసుకుని జిల్లా ట్రెజరీ కార్యాలయానికి అప్పగించినట్లు సీఐ రాజేష్ తెలిపారు.

వైఎస్‌ఆర్ సుజలధార
ఏడాదిగా మూత!

గట్టుపల్లిలో మూతేసిన వైఎస్‌ఆర్ సుజల పథకం మదర్‌ప్లాంటు




జలదంకిలో మూతపడిన శుద్ధి జలాల ట్యాంకు

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలకు సురక్షిత తాగునీరు అందించాలన్న సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వంలో రూ.28 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి పథకాన్ని ఏడాది కాలంగా మూత వేసింది. దీంతో వందల గ్రామాలకు రక్షిత శుద్ధి జలాలు అందక అధిక ధరలకు తాగు నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్లను నిరుపయోగంగా మూలకు చేర్చడంతో అవి తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుతోన్నాయి.

\- జలదంకి

- టీడీపీ ప్రభుత్వంలో 8 మండలాల కోసం రూ.28 కోట్లు ఖర్చు
- నిర్వహణ భారమంటూ చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వం
- వందల గ్రామాలకు ఆగిన శుద్ధి జలాల సరఫరా
- నిరుపయోగంగా మూలనపడ్డ వాటర్ ట్యాంకర్లు
- అదిక ధరకు మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్న పల్లె వాసులు
- నాణ్యమైన తాగునీరు అందక రోగాల బారిన మెట్టప్రాంత ప్రజలు
- ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు అందని సురక్షిత నీరు

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు ఇంటింటికి సురక్షితమైన తాగునీరు అందించాలన్న సంకల్పంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద ఒక్కో మండలానికి రూ.3.5 కోట్లు వంతున రూ.28 కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులతో నియోజకవర్గంలోని 8మండలాలలో శుద్ధిజల ప్లాంట్లు నిర్మింపజేశారు. ఈ ప్లాంట్లకు నీటిని సరఫరా చేసేందుకు జలదంకి మండలం గట్టుపల్లిలో మదర్‌ప్లాంటు ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటు నుంచి గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని రవాణా చేసి ప్రజలకు రూ.2లకు 20 లీటర్లు అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకానికి పేరు మార్చి వైఎస్ఆర్ సుజలధారగా మార్చిందే తప్ప నిర్వహణ బాధ్యతను గాలికొది లేసింది. మదర్ ప్లాంటుకు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో మొండి బకాయి కింద ట్రాన్స్‌కో అధికారులు సరఫరా నిలిపివేశారు. దీంతో ఏడాదిగా మెయింటెనెన్స్ చేయలేక నిర్వాహకులు మదర్‌ప్లాంటుకు తాళం వేశారు. దీంతో జలదంకి మండలంలోని 30కి పైగా గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని 7 మండలాలకు తాగునీరందించే బృహత్తర పథకానికి తాళం పడింది. ఈ క్రమంలో మండలంలోని ప్రతిపక్ష టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించి పథకాన్ని కొనసాగించి మండల ప్రజలకు తాగునీరు అందించాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో కోట్లరూపాయల ప్రభుత్వ నిధులు వథా అయ్యాయి. ఉదయగిరి నియోజకవర్గం జిల్లాలోనే అత్యంత మెట్టప్రాంతం కావడం, వర్షాలు తక్కువగా పడి భూగర్భ జలమట్టం కూడా వేసవిలో పడిపోయి ప్రజలు తాగునీటికి కిలోమీటర్లు దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. అలాంటి మెట్ట ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఎంతో కష్టపడి నియోజకవర్గం ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించినా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ ప్రాజెక్టును కొనసాగించడంలో చూపలేదు. ఎన్టీఆర్ సుజలస్రవంతిగా ఉన్నప్పుడు రూ.2లకు 20 లీటర్లు ఇచ్చేవారు. వైఎస్‌ఆర్ సుజలధారగా పేరు మారాకా మంచినీటి ధరను కూడా రూ.4లకు పెంచారు. అది కూడా నిర్వహణ బాధ్యతను గాలికొదిలేసి సురక్షి నీరు లేకుండా చేశారన్న ఆరోపణలు న్నాయి. ఈ క్రమంలో గత ఏడాదిగా ప్రజలు రూ.10 నుంచి రూ.20లకు 20 లీటర్లు తాగునీరు ప్రైవేటు మినరల్‌వాటర్ ప్లాంటుల నుంచి కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. కానీ ఇవి సురక్షితం కావని, వీటి వల్ల జబ్బుల బారిన పడుతున్నామని మెట్టప్రాంతం ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కొండాపురం మండలంలో ఫ్లోరైడ్ సమస్య ఎప్పటి నుంచో పట్టిపీడిస్తోంది. ప్రస్తుతం ఈ సమస్య మరింత తీవ్రమైంది. మూతపడ్డ సుజల పథకం నియోజకవర్గంలోని 8మండలాలలో కొనసాగించాలని పలు దఫాలు వైసీపీ నాయకులను, అధికారులను ప్రజలు వేడుకున్నా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. వైసీపీ పాలనపై గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు మూతపడ్డ సుజలదార పథకాన్ని తెరిపించలేక పోయారని మెట్టప్రాంత ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏ ముఖం పెట్టుకుని మా ఇళ్లకు ఓట్లడగడానికి వస్తారని పేదప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్లాంటు ఆగడం మూలంగా నెలనెలా మాజేబులకు చిల్లులు పడడమే కాక సురక్షితమైన నీరు తాగలేక రోగాల బారిన పడుతున్నామని, ఇదేం ఖర్మ మాకు అంటూ ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నిరుపయోగంగా గ్రామాలకు రక్షితనీరు తరలించే ట్రాక్టర్లు

మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి రేపు రాత పరీక్ష

లింగసముద్రం, ఏప్రిల్ 19 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు ఈ నెల 21వ తేదీన ఉదయం 9 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్లు స్కూల్ వద్దనే అందజేస్తామని పేర్కొన్నారు. పరీక్షలో మార్కులు, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం వారి సొంత ఖర్చులపై కందుకూరు ఆర్టీసీ డిపో వారి సహకారంతో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశామని తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కావలి రూరల్, ఏప్రిల్ 19 : అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్‌వో జీ.రామసిద్ధార్థ సూచించారు. పట్టణంలోని ఏరియా వైద్యశాల, కందుకూరి హాస్పిటల్ సిబ్బందికి, రోగులకు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామస్వామి, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌పై వెళ్లి నామినేషన్

అల్లూరు, ఏప్రిల్ 19 : రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ రిస్ట్ కావలి అభ్యర్థిగా ఎల్లు సాల్మన్‌రాజు శుక్రవారం కావలి డివిజన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేశారు. అల్లూరు పాత బస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి మోటారు సైకిల్‌పై కావలికి తరలి వెళ్లారు. అక్కడ ఆర్వో శీనానాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, ముసలి నరేంద్ర, గోళ్ల మహేష్, నక్కా గిరి, కప్పల నవీన్ కుమార్, ఎల్లు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి నామినేషన్ దాఖలు

కావలి, ఏప్రిల్ 19: కావలి టీడీపీ అభ్యర్థిగా దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు మూడు సెట్ల నామినేషన్ల పత్రాలు అందజేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, మైనార్టీసెల్ అధ్యక్షుడు అబ్దుల్ రహీంలతో కలిసి వారు నామినేషన్ల పత్రాలు అందజేశారు. అలాగే టీడీపీ తరుపున క్రిష్ణారెడ్డి కుమార్తె దగుమాటి సంహితారెడ్డి పేరుతో ఒక సెట్టు నామినేషన్ పత్రాలను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ పట్టణాధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌లు అందజేశారు. తొలుత ముసునూరులోని క్రిష్ణారెడ్డి ఇంటివద్ద సర్వమత ప్రార్థనలు చేసి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తల సమక్షంలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అక్కడ నుంచి నిరాడంబరంగా ఎన్డీఏ కూటమి క్యాడర్‌తో ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు.

● రెండో రోజు ముగ్గురు నామినేషన్లు

కావలి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండవ రోజు శుక్రవారం ముగ్గురు నేతలు 6 సెట్ల నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందజేశారు. టీడీపీ తరుపున దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మూడు సెట్లు, ఆయన కుమార్తె దగుమాటి సంహితారెడ్డి పేరుతో ఒక సెట్టు , రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున ఎల్లు సాల్మన్ రెండు సెట్లు నామినేషన్లు అందజేశారు.

వీపీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

అల్లూరు, ఏప్రిల్ 19 : టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను అల్లూరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మండలంలోని ఇందుపూరులో కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, ఎ.చందన్‌రెడ్డిలతో కసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో బండి అమర్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, రఫీమాలిక్, బండి శ్రీనివాసులు రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నలగట్ల శ్రీనివాసులు రెడ్డి, కత్తుల శ్రీకాంత్, కావలి కృష్ణ, అంబటి రాజేంద్ర, ఎండోటి హరికృష్ణ, ఊటు గోపి, నలగట్ల శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరినీ కలుపుకుపోవాలి

కలిగిరి, ఏప్రిల్ 19 : టీడీపీ విజయం కోసం అందరినీ కలుపుకుని పోవాలని మాజీ మండలాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఎంవీ.రామిరెడ్డి వర్గీయులు పేర్కొన్నారు. శుక్రవారం తన స్వగ్రామం అనంతపురంలో ఆత్మీయులతో నిర్వహించిన సమావేశంలో రామిరెడ్డి ఆట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకర్ల సురేష్ కోసం పనిచేస్తున్నా తమ స్వగ్రామమైన అనంతపురంలో పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు కనీసం తమకు సమాచారం ఇవ్వకపోవడం అవమానకరంగా భావిస్తున్నామన్నారు. కాగా తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని, సీనియర్లకు గుర్తింపు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్ ఫోన్ ద్వారా తెలపడంతో అంతా శాంతించారు. ఈ కార్యక్రమంలో మెట్టుకూరు రాంజీవ్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, సిద్దుల నాయుడు, కొండపనాయుడు, భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ఓటింగ్‌కు అర్హుల వివరాల సేకరణ


ఓటర్ల వివరాలు సేకరిస్తున్న సెక్టోరల్ అధికారి

అల్లూరు, ఏప్రిల్ 19 : పోలింగ్ బూత్‌కు రాలేని దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని సెక్టోరల్ అధికారి భాస్కర్ అన్నారు. అందులో భాగంగా అల్లూరు పట్టణ పరిధిలోని దివ్యాంగులు, వృద్ధుల వివరాలను ఆయన శుక్రవారం సేకరించారు. ఆయన మాట్లాడుతూ ఓలింగ్ బూత్‌కు రాలేని ఓటరుల వివరాలను సేకరించి జిల్లా రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్నామని, తద్వారా ప్రత్యేక బృందం ఇటువంటి ఓటర్లు వద్దకు వచ్చి ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రహంతుల్లా, సచివాలయ సిబ్బంది మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు


కందుకూరు : టీడీపీలో చేరిన దామచర్లతో ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 19: కందుకూరు పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన దామచర్ల నరసింగరావు (పండు) వైసీపీని వీడి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆయన వెంట పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, గల్లా రాధాకృష్ణ, కాకుమాని మాల్యాద్రి, పిరతల బాలాజీ, కాటా కిషోర్ పాల్గొన్నారు. అనంతరం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దివివారిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయం

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అటు రాష్ట్రంలో ఇటు కందుకూరులో టీడీపీ విజయం ఖాయమని కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 20వ వార్డు పరిధిలోని పెద్దబజారు, 16వ వార్డు పరిధిలోని సోమేశ్వరాలయం ఎదురుబజారు, వినాయకుడి గుడి ప్రాంతాలలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీనివాసులు, జొన్నాదుల రాఘవయ్య, సీహెచ్ పాండురంగయ్య, దండే శ్రీనివాసరావు, కొత్తూరి శివ, కోట కిషోర్, పబ్బిశెట్టి రాజా, తాతా లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లెపాలెంలో వైసీపీ కుటుంబాల చేరిక

ఉలవపాడు : మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెంకు చెందిన పలు వైసీపీ కుటుంబాలు పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వారికి పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుబ్రహ్మణ్యం, గొల్లపోతు గోపి, శ్రీను, వెంకట కృష్ణారావు, అశోక్, ఈశ్వర్, నాగేశ్వరరావు, ఏడుకొండలు, తదితరులు ఉన్నారు. గ్రామ నాయకులు కొప్పాడి స్వాములు, నాయుడు రాజు, నాంచార్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు

లింగసముద్రం, ఏప్రిల్ 19 : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ప్రతి మహిళకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తారని తెలుగు యువత మండల అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్‌లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం లింగసముద్రంలోని డాక్టర్ కృష్ణమోహన్ వైద్యశాల నుంచి స్థానిక వెంకటేశ్వరస్వామి గుడి వరకు టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కండే మాలకొండయ్య, మాజీ ఎంపీపీ పి బాలకోటయ్య, ఎ నర్సయ్య, జి బాలనారాయణ, జంపాల కృష్ణయ్య, సీహెచ్ బాలకోటయ్య, ఎ చినసత్యం, జె శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ఉలవపాడు : టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

జగన్ దోపిడీని అరికట్టాలి

ఉలవపాడు : అన్ని రంగాల్లో అధిక ధరలు పెంచి రాష్ట్ర ప్రజలను నిలువు దోపిడీ చేసిన జగన్ మోహన్‌రెడ్డిని ఓడించి టీడీపీని గెలిపించాలని టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం ఉలవపాడులోని వడ్డెరపాలెం కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ 5 ఏళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన దోపిడీని ప్రతి గృహిణి గుర్తుకు తెచ్చుకోవాలని, చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


లింగసముద్రం : ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

ఇంటింటా ప్రచారం

కొండాపురం : మండలంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం టీడీపీ నాయకులు ముమ్మరంగా ఇంటింటా ప్రచారం చేపట్టారు. గరిమెనపెంట పంచాయతీలో శుక్రవారం యాదవ కృష్ణయ్య, అల్లిక మధు, కేవీఆర్ కాలనీలో దగడ మాలకొండారెడ్డి, ఇసుకదామెర్ల గ్రామంలో బూత్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో, పార్లపల్లిలో బూత్ కన్వీనర్ కొమ్మి కొండలరావు ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించి ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ పరిశీలకుడు కామయపల్లి సుబ్బారావు, టీడీపీ నాయకులు సి.హెచ్.వెంకటాద్రి, పోలినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.


దగదర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న మాలేపాటి రవీంద్రనాయుడు

పేదరిక నిర్మూలనే టీడీపీ లక్ష్యం

దగదర్తి(బిట్రగుంట) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా యువతకు ఉపాధి కల్పించేలా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెట్టారని ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు అన్నారు. దగదర్తి మండలం చెన్నూరు పంచాయతీ కట్టుబడిపాలెం ఎస్టీకాలనీలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం మళ్లీ వస్తేనే విమానాశ్రయం వస్తుందని, తద్వారా దగదర్తి, అల్లూరు, బోగోలు మండలాల యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించుకోవాలని తెలిపారు. కాగా దగదర్తి మండలం ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఇర్ల దుర్గారావు కుమార్తె శ్రీలక్ష్మి కావలి ప్రైవేటు వైద్యశాల్లో చికిత్స పొందుతుండగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు ఆమెను పరామర్శించారు.

నార్తుమోపూరులో...

అల్లూరు : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇంటింటా ప్రచారం జోరందుకుంది. అల్లూరు మండలం నార్తుమోపూరులో టీడీపీ నాయకులు ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. నెల్లూరు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించి నార్తుమోపూరు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విడవలూరు దశరథరామిరెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కందుకూరు, ఏప్రిల్ 19: పట్టణంలోని అంకమ్మ దేవాలయం వద్ద శుక్రవారం సాయంత్రం మోటారు సైకిల్ ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. రోడ్డు దాటుతున్న వృద్ధుడిని మోటారు సైకిల్ ఢీకొట్టడంతో కిందపడి తలకు బలమైన గాయం అయింది. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనం తరం ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అయితే ఆ వృద్ధుడు ఎవరనేది నిర్ధారణ కాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో మార్చురీకి తరలించారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఇంటూరి'కి మద్దతివ్వను : దివి

కందుకూరు, ఏప్రిల్ 19 : టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు రాబోయే ఎన్నికల్లో మద్దతు ఇచ్చేది లేదని కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ఇదివరకే పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పార్టీ అధిష్ఠానం పునరాలోచన చేస్తే పార్టీ కోసం పని చేస్తానని తెలిపారు. లేనిపక్షంలో ఇంటూరి రాజేష్‌కు మద్దతు ఇచ్చి పనిచేస్తానన్నారు. ఈ సమావేశంలో దివి సౌభాగ్య, దివి రమేష్ పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

నెల్లూరు(హరనాథపురం) : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ వ్యయపరిశీలకుడు ప్రసాద్ దత్తాత్రేయ సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆర్‌వోలు, నోడల్ అధికారులతో సమావేశం జరిగింది.

అధ్వానంగా రాళ్లపాడు ఎడమ కాలువ!

● పెరిగిన జమ్ము, చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు



పిచ్చి మొక్కలతో రాళ్లపాడు ఎడమ కాలువ

లింగసముద్రం, ఏప్రిల్ 19 : రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ అధ్వానంగా ఉంది. గత రబీ సీజన్‌లో ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు లేకపోవడంతో రైతులు వరి పైరు సాగు చేయలేదు. దీంతో అధికారులు కుడి, ఎడమ కాలువలకు నీరు విడుదల చేయలేదు. నీరు విడుదల చేయని కారణంగా ఎడమ కాలువలో జమ్ము, చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు విరివిగా పెరిగాయి. అయితే ఎడమ కాలువ పరిధిలో రైతులు కొంత మేరకు వరి పైరు సాగు చేశారు. అయితే రైతులు ఈ వరి పైరును ఎక్కువగా బోర్ల కింద సాగు చేశారు. అయితే కొంత లీకేజీ ద్వారా కూడా నీరు ఎడమ కాలువకు వచ్చేది. కానీ ఎడమ కాలువ పిచ్చి మొక్కలతో నిండి ఉన్న కారణంగా ఆ వచ్చే లీకేజీ నీరు కూడా సరిగా వచ్చేది కాదు. దీంతో రైతులు ఎలాగోలా వరి పైరు పండించుకున్నారు. ఈ కాలువలో నిండి ఉన్న జమ్ము, పిచ్చి మొక్కలను వచ్చే సీజన్‌కైనా తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఓ ప్రణాళిక... పద్ధతి లేకుండా ప్రజాప్రతినిధులు ఆదేశించడం... అధికారులు తలఊపడం తప్ప.. చేస్తున్న పని సరైనదా.. కాదా.. ? అన్నది కూడా చూసుకునే పరిస్థితి ఇరిగేషన్ శాఖలో లేకుండా పోయింది. నెల్లూరు నగరంలో పెన్నా రక్షణ గోడల నిర్మాణాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.



అసంపూర్తిగా పెన్నా రక్షణగోడ పనులు



వరదొస్తే 'రక్షణ' లేదు!

జగన్ హామీకి దిక్కు

- 20 నెలలుగా అతీగతీ లేదు • ఐదోవంతు కూడా పూర్తికాని వైనం
- 2కి.మీ. నుంచి 650 మీటర్లకు తగ్గిన పెన్నా వాల్స్
- ఎస్టిమేషన్లు, రివైజ్ ఎస్టిమేషన్లతోనే సరి
- నిర్మాణం పూర్తికి మరో రూ.150 కోట్లు అవసరం
- జగనన్నా.. మీ హామీ ఏమైందన్నా?



మోసం గురూ!

నెల్లూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వస్తుందంటే నెల్లూరులోని వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీలు వణికిపోతున్నాయి. 2020, 2021 సంవత్సరాల్లో వరదలు రావడంతో ఈ ప్రాంతవాసులు కుదేలయ్యారు. కాగా 2021 డిసెంబరులో అక్కడ పర్యటించిన సీఎం వైఎస్ జగన్ రూ.వంద కోట్లతో పెన్నా రక్షణ గోడలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎనిమిది నెలలకు శంకుస్థాపన సందర్భంగా జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, నగర ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్‌లు.. ఏడాదిలోపు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కానీ రెండేళ్లు గడిచినా నేటికీ పునాదుల దశ దాటలేదు. అది నుంచి డిజైన్లను మార్చడం, ఎస్టిమేషన్లను రివైజ్ చేయడం తోనే కాలం గడిచిపోతోంది. కానీ చివరకు తేల్చిందేమిటంటే రక్షణ గోడలు పూర్తిగా నిర్మించేందుకు మరో రూ.150 కోట్ల వరకు అవసరమవుతాయని నిర్ధారించారు. ఇప్పుడు పెరిగిన అంచనాల మేరకు కొత్తగా మళ్లీ అనుమతులు వచ్చి పనులు పూర్తి చేయడం సాధ్యమేనా.. అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు చూస్తే పూర్తవడానికి మరో రెండేళ్ల సమయం పట్టేలా కనిపిస్తోంది.

• రాజకీయ జోక్యంతో..

2021 నవంబరులో వరదల సమయంలో రూ.80.56 కోట్ల అంచనాతో పొర్లుకట్టల నిర్మాణాలకు టీపీజీ అధికారులు టెండర్లు పిలిచారు. డిసెంబరులో టెండర్లు ముగిశాయి. అయితే ఈ పనిని దక్కించుకునేందుకు అధికార పార్టీలోని ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయగా ఇద్దరు డిస్‌క్వాలిఫై అయ్యారు. మిగిలిన ఇద్దరు రివర్స్ టెండరింగ్‌లో నువ్వా.. నేనా.. అన్నట్లు పోటీ పడడంతో చివరకు 13.38 శాతం లెస్‌కు(రూ.69.78 కోట్లు) శ్రీసాయి కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పనులు దక్కించుకుంది. నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సూచించిన వారికి పని దక్కకపోవడంతో ఈ వర్కును రద్దు చేస్తారంటూ అప్పట్లో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అనుకున్నట్లుగానే అగ్రిమెంటు జరగాల్సిన సమయంలో మట్టికట్టల స్థానంలో కాంక్రీటు గోడలు నిర్మించాలన్న ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాక ఎస్టిమేషన్లు తయారు చేసిన ఇరిగేషన్ అధికారులకు ఈ విషయం ముందుగా తెలియదా..?అన్నదే అసలు ప్రశ్న. ఇక ఆ తర్వాత రూ.81.85 కోట్లకు అంచనాలు సవరించి 2022 ఏప్రిల్‌లో మరోమారు టెండర్లు పిలిచారు. ఈ దఫా కేవలం రెండు సంస్థలు మాత్రమే టెండర్లలో పాల్గొన్నాయి. మొదటిసారి మాదిరిగా ఇక్కడ కూడా పోటీ జరగలేదు. దీంతో 3.55 శాతం ఎక్సెస్‌తో రూ.84.76 కోట్లకు బెకెమ్-సిరి జాయింట్ వెంచర్ సంస్థ పనులు దక్కించుకుంది.

• పెరిగిన అంచనా

పోనీ ఈదఫా అయినా పనులు మొదలయ్యాయా అంటే అదీ లేదు. తీరిగ్గా పది నెలల తర్వాత కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి పదిశాతం పనులు చేశారు. అయితే ప్రస్తుత డిజైన్ ప్రకారం కాంక్రీట్ వాల్ నిర్మిస్తే అది భారీ వరదలను తట్టుకోలేదని గుర్తించారు. దీంతో మళ్లీ డిజైన్ మార్పు అంటూ హడావిడి చేయడంతో పనులకు మళ్లీ బ్రేక్ పడింది. కొత్త డిజైన్లను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపగా కొన్ని నెలల తర్వాత ఇటీవల అప్రూవల్ వచ్చింది. అయితే కాంట్రాక్టర్ అగ్రిమెంట్ జరిగిన రూ.84.76 కోట్లకు అనుగుణంగానే కొత్త డిజైన్‌కు అనుమతులిచ్చారు. దీంతో వెంకటేశ్వరపురం నుంచి జాతీయ రహదారి దిగువున వరకు రెండు కిలో మీటర్ల మేర రక్షణ గోడ నిర్మించాల్సి ఉండగా అది 650 మీటర్లకు తగ్గిపోయింది. ఈ క్రమంలో పెన్నాకు మళ్లీ భారీ వరదలు వస్తే ఇళ్ల మధ్యలోకి నీరు చేరుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కొత్త ఎస్టిమేషన్లు పంపాలి..

పెన్నా రక్షణ గోడల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే కొంత జాప్యం జరుగుతున్న మాటవాస్తవమే. రివైజ్ ఎస్టిమేషన్లు అప్రూవయ్యాయి. పనుల్లో వేగం పెంచుతాం. మిగిలిన దూరాన్ని రెండో విడతలో చేపట్టేలా కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి పంపాలి.

- వై పెంచలయ్య, ఇరిగేషన్ డీఈఈ



అన్నీ మంచి రోజులే!

- అభ్యర్థుల నామనక్షత్రాలను బట్టి ముహూర్తాల బేరీజు



సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. ఈనెల 25వతేదీ నామినేషన్ల దాఖలుకు తుదిగడువు. మంచి ముహూర్తంలో నామినేషన్ వేస్తే సగం విజయం సాధించనట్లేనని అభ్యర్థుల విశ్వాసం. జన్మనక్షత్రం, నామనక్షత్రాలను గణించి జ్యోతిషులు నామినేషన్లు వేసే ముహూర్తాలు నిర్ణయిస్తున్నారు. జిల్లాలో ఒక ఎంపీ, 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తొలిరోజు కొందరు నామినేషన్లు వేశారు. రెండోరోజు శుక్రవారం మరికొందరు వేశారు. అయితే చైత్రమాసంలో ఈనెల 18 నుంచి 25వతేదీ వరకు పరిశీలిస్తే అన్నీ మంచి ముహూర్తాలే ఉన్నాయి. ఈనెల 21వతేదీ ఉన్న మంచిరోజుల్లో శ్రేష్ఠమైన రోజని వేద పండితులు తెలిపారు. ఆ రోజున ఎక్కువమంది నామినేషన్లు వేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

చెల్లుబాటు అయ్యే అఫిడవిట్ సమర్పించాలి: రిజిస్ట్రార్

నెల్లూరు(హరనాథపురం): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే అఫిడవిట్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు. అఫిడవిట్ తీసుకునేటప్పుడు ఆ నోటరీ పోర్సులో ఉన్నాడా... రెన్యువల్ చేసుకున్నాడా...అనే విషయాలు పరిశీలించాలన్నారు. రెన్యువల్ చేయించుకోని నోటరీల వద్ద అఫిడవిట్ తీసుకొంటే అది చెల్లదన్నారు. ఈ విషయాన్ని అభ్యర్థుల గమనించాలన్నారు.

వడలు మీకు.. ఓట్లు మాకు!



ప్రచార చిత్రం

నెల్లూరు నగరంలో పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. టీడీపీ కూటమి అభ్యర్థి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి, ఆయన కుమార్తెలు సింధూర, శరణి కొంత కాలంగా నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జనార్దన్‌రెడ్డి కాలనీలో ప్రచారం చేస్తూ అక్కడున్న టిఫిన్ అంగడిలో వడలు కాల్చుతూ కనిపించారు రమాదేవి. ప్రచారంలో ప్రజలు చేసే వివిధ పనుల్లో వారు నిమగ్నమవుతూ ఓట్లు అడుగుతున్నారు.



పరదాల సరదా

పరదాల సరదాలకు ప్రభుత్వ అధికారులు ముగ్ధులవుతున్నట్టుంది. ఇందుకు కోవూరు ఎన్నికల కార్యాలయ ఆవరణం ఓ ఉదాహరణ. సార్వత్రిక ఎన్నికల నామి నేషన్ల దాఖలు సమయంలో ప్రతిసారీ కార్యాలయ ఆవరణలోకి ప్రధాన ద్వారం మాత్రమే లోపలికి వెళ్ళేందుకు గోడల మీద కంచె ఏర్పాటు చేస్తారు. నామి నేషన్ దాఖలు సమయంలో ఎంపిక చేసిన వా,ఇ,న లోపలికి అనుమతిస్తారు. ఇందుకోసం తహసీల్దారు కార్యాలయ ఆవరణ గోడదూకి ఎవరూ లోపలకు రాకుండా పకడ్బందీగా ఇనుప కమ్ములతో బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. ఎన్నికల కార్యాలయానికి 100 మీటర్ల దూరం నుంచి రోడ్డుపై మూకమ్మడి జనసంచారం లేకుండా నిషేధాజ్ఞలు విధిస్తారు. కాగా ఈ దఫా విచిత్రంగా గోడపై ఏకంగా 20 అడుగుల ఎత్తుకు పరదాలు కట్టేసి అధికారులు తమ సరదా తీర్చుకున్నారు. ఏకంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణను పరదాలతో కప్పేయడంతో పలు వ్యంగ్య పలుకులు వినిపిస్తున్నాయి.

- కోవూరు

కలుగోళ్ల శాంభవిని దర్శిస్తే కలుగును జయం!

సెంటిమెంట్



ఏ ఎన్నికల్లోనైనా పోటీచేసే నేతలు తొలుత కావలిలోని కలుగోళ్ల శాంభవి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తే విజయం చేకూరినట్లే ననే నమ్మకం ఉంది. ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు చేపట్టాలన్నా ముందుగా అమ్మవారిని దర్శించుకుంటారు. ఆ తర్వాత నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. ప్రచారం ప్రారంభించేవారు కూడా మొదటగా అమ్మవారిని దర్శించుకునే వెళతారు. ఈ నమ్మకం ఎక్కువమంది నేతల్లో నేటికీ ఉంది. చాలామంది నాయకులు ఇప్పటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. మరి ఈ ఎన్నికల్లో అమ్మవారు ఎవరిని కరుణిస్తారో... విజయలక్ష్మి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే!

- కావలి

లక్షలు కావాలా నాయనా!?

ద్వితీయ శ్రేణి నాయకులకు బంపర్ ఆఫర్

గాసిప్స్

అవును.. ద్వితీయ శ్రేణి నాయకుల కాలమిది. ఎన్నికల్లో గెలుపే పరమావధిగా అన్ని రాజకీయ పార్టీలు కేడర్‌ను తమ వైపు తిప్పుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ద్వితీయశ్రేణి నాయకులకు, కార్యకర్తలకు బాగా డిమాండ్ పెరిగింది. వారి స్థాయి, హోదాను బట్టి రూ. 5 లక్షల నుంచి 50 లక్షల వరకు ప్యాకేజీ కింద ముట్టచెబుతున్నారు. ఇటీవల జిల్లాలోని పశ్చిమ నియోజకవర్గంలో కొందరు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు రూ.20, రూ.50. రూ.10 లక్షలు చొప్పున ప్యాకేజీ ముట్టడంతో వారంతా పార్టీలు మారినట్లు పొలిటికల్ గాసిప్స్ హల్‌చల్ చేస్తున్నాయి. ఒక ప్రజాప్రతినిధికి అయితే ఏకంగా ఓ కారును కూడా కొనిస్తామంటూ హామీ ఇచ్చినట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తల తమ వంతు ఎప్పుడు వస్తుందా!? అని కళ్లలో ఒత్తులో వేసుకుని ఎదురు చేస్తున్నారు. తదానుగుణంగా గల్లీ లీడర్లు, కార్యకర్తలు సైతం తమ మాటేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ప్యాకేజీలు ఇవ్వకుంటే మరో పార్టీలో చేరిపోతామని బెదిరింపులకు దిగుతున్నారనే వార్తలూ గుప్పుమంటున్నాయి.

- ఆత్మకూరు



నీ ఓటుందో లేదో చూస్కో మావోయ్!



ఎట్టెట్ట

అల్లుడు : ఓయ్... మావోయ్.. బాగున్నావా!?

మామ : ఆ.. బాగున్నా అల్లుడూ. ఊరి నుంచి ఎప్పుడొచ్చావ్. అమ్మయి, పిల్లలు ఎలా ఉన్నారా? ఎన్నికలొచ్చాయి అంటున్నారు. ఎప్పుడు ఓటేసేది?

అల్లుడు : అదేంది మావా!? నీకు తెల్వదా!? అసలు మనూరు పోలింగ్ బూత్‌లో నీ ఓటు ఉందో.. లేదో చూసుకో. ఎందుకంటే లిస్టులో సుబ్బాగాడు, రామయ్య పేర్లు లేదాంటా ఉండారు!? కాబట్టి ఇప్పుడే చేసుకో!

మామ : ఎందిలే అల్లుడూ.. నా ఓటు ఉంటే ఉంటదీ లేకుంటే లేదు. నేను ఓటు ఏసినంత మాత్రాన ఏం ఒరుగుతుందిలే!?

అల్లుడు : అదేంది మామా. అంత మాటంటివి. ఓటనేది మనహక్కు. మనూరు బాగుపడాలన్నా!? మన బిడ్డల భవిష్యత్తు కోసం మంచి నాయకుడ్ని ఎన్నుకోవాలా! అందుకే మనం ఓటెయ్యాలి. రేపు పోలింగ్ బూత్‌కెళ్లి నీకు ఓటుందో లేదో చూస్కో!

మామ : సరేనయ్యా.. రేపే పోయి అధికారులను అడుగుతా!?

అల్లుడు : మంచిది మామ. ఇంకో విషయం ఈసారి ఓటుకు రెండు మూడు వేలు ఇస్తారని చెబుతా ఉన్నారు. ఆశపడి ఎవరికంటే వారికి ఓటు వేయొద్దు మామో. మన రాష్ట్రం, మనూరును ఎవరూ అభివృద్ధి చేస్తారో ఆలోచించి ఓటేయాలి. గుర్తుంచుకో!?

మామ : సరేలే అల్లుడూ లోకంలో ఏం జరుగుతుందో గమనిస్తున్నాలే. సరేయిన నాయకుడుకే నా ఓటు వేస్తా.

అల్లుడు : సరే మావా ఆరోగ్యం జాగ్రత్త!. అదుగో బస్ వస్తాంది. నే బయల్దేరుతా!

- అనంత సాగరం

ఓటుకు నోటు.. ప్రజాస్వామ్యానికి చేటు!

ఎన్నికలు వచ్చాయంటే నేతలందరికీ ఓటరు మహాశయుడు దేవుడిలా కనిపిస్తాడు. అలాంటి ఓటరును ప్రలోభపెట్టేందుకు రకరకాల యత్నాలు మొదలు పెడతారు. మాయమాటలు చెబుతారు.. బుజ్జగిస్తారు.... వినకపోతే అదిరిస్తారు.. బెదిరిస్తారు.... మద్యాన్ని ఎరగా వేస్తారు.. ఆపై నగదు కూడా ఇస్తారు.. ఇలా నాయకులు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా తప్పే. ఓటు వేసేందుకు నగదు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి చేటు కూడా.. అలాంటి తప్పులు చేయకుండా పోటీలో ఉన్న అభ్యర్థులు జాగ్రత్త పడాలి.

- సంగం

- అలా చేయడం నేరం కూడా..
- స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు అవకాశం ఇవ్వండి



- ప్రతి వ్యక్తి తన ఇంటిలో తాను ప్రశాంతంగా, ఏకాంతంగా జీవించే హక్కు ఉంది. దాన్ని అందరూ గౌరవించాలి.
- రోడ్డుపై ప్రజల రాకపోకలకు ఆటంకాలు కలిగించకూడదు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఊరేగింపులు జరుపుకోవాలి.
- ప్రదర్శనల్లో అల్లర్లకు పాల్పడకూడదు.
- ఓటరు స్లిప్పులపై ఏ పార్టీ గుర్తు, అభ్యర్థి పేరు ఉండకుండా చూసుకోవాలి. సాదా కాగితం వాడాలి.
- పోలింగ్ రోజు వాహనాలు వాడేవారు నిబంధనలు పాటించాలి.
- ఎంత పెద్ద పదవిలో ఉన్న వ్యక్తి అయినా (పీఎం, సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు) ఎన్నికల సంఘం నుంచి ప్రత్యేక అనుమతి పత్రం ఉంటేనే పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించాలి. లేదా ఓటు వేయడానికి మాత్రమే బూత్‌లోకి అడుగుపెట్టాలి.
- ఎన్నికలకు సంబంధించిన ఏ ఫిర్యాదునైనా ఆర్వోకి అందచేయాలి.
- ఈ నిబంధనలు పాటించి ప్రశాంత ఎన్నికలకు అభ్యర్థులు సహకరించాలి.

ఓటరు గుర్తింపు కార్డు ఎప్పటి నుంచి అమలు?

తెలుసుకుందాం



నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 19 : ఓటరు గుర్తింపు కార్డును 1993లో ఎన్నికల ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్ ప్రవేశపెట్టారు. 2011 జనవరి 25న మొట్టమొదటి సారిగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ 1950 జనవరి 25న ఏర్పాటైంది. అప్పటి నుంచి జిల్లా స్థాయిలో కలెక్టర్ ముఖ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఓటింగ్ యంత్రాలను 1999 ఎన్నికల్లో గోవాలో వినియోగించారు. 2013లో సుప్రీంకోర్టు ఓటింగ్ యంత్రాల్లో వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. 2004 నుంచి ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఎన్నికల సంఘం నిషేధించింది.